ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు
బుధవారం 3 సెప్టెంబరు 2025

'ఎల్‌ఆర్‌ఎస్‌'పై విస్తృత ప్రచారం చేయండి!

- 45 రోజుల్లో దరఖాస్తు చేసుకుంటే 50 శాతం రాయితీ
- మున్సిపల్‌ శాఖ టౌన్‌ ప్లానింగ్‌ ఆర్‌డీ మధుకుమార్‌

8లో...



అమరజీవికి నిలువెత్తు గౌరవం



పిల్లర్లకు పరిమితమైన స్మారక భవనం అదనపు గదులు

- అమరావతిలో కాంస్య విగ్రహం, మ్యూజియం, స్మృతివనం
- పనులకు నేడు సీఎం చంద్రబాబు శంకుస్థాపన
- పొట్టి శ్రీరాములు నడయాడిన జువ్వలదిన్నె బాగుపడేనా!?
- నాడు రూ.100 కోట్లతో పనులకు శంకుస్థాపన
- పూర్తిగా నీరుగార్చిన వైసీపీ సర్కారు
- ప్రస్తుత ప్రభుత్వంపై చిగురిస్తున్న ఆశలు

బిట్రగుంట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం నిరాహార దీక్ష చేసి, ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములుకు ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం అరుదైన గౌరవం ఇచ్చింది. అమరావతిలోని 6.8 ఎకరాల సువిశాల స్థలంలో పొట్టిశ్రీరాములు కాంస్య విగ్రహం, మ్యూజియం, ఆడిటోరియం, స్మృతివనం నిర్మాణానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారథ్యంలో బుధవారం శంకుస్థాపన జరగనుంది. అమరజీవికి టీడీపీ హయాంలోనే గౌరవం దక్కుతోందని పొట్టి శ్రీరాములు అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అమరజీవి నడియాడిన బోగోలు మండలం జువ్వలదిన్నెలో పలు అభివృద్ధి పనులకు కూడా చంద్రబాబునాయుడే శంకుస్థాపనలు చేశారని గుర్తు చేసుకుంటున్నారు. 2019, జనవరి 11వ తేదీన అప్పుడు సీఎంగా ఉన్న చంద్రబాబు నాయుడు రూ.100 కోట్ల నిధులు మంజూరు చేయించి జువ్వలదిన్నెలో పలు శంకుస్థాపనలు చేశారు. తీరప్రాంత మత్స్యకారుల ఆర్థికాభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో సుమారు రూ.282 కోట్లతో పనులు ప్రారంభించారు. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వ పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఆ ఐదేళ్లలో పనులు ముందుకు సాగలేదు. గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికలలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడంతో పెండింగ్‌ పనులపై ప్రస్తుత ప్రభుత్వం దృష్టి సారించింది. బకింగ్‌హాం కెనాల్‌పై వంతెన నిర్మాణం, మంచినీటి ప్రాజెక్ట్‌, సోలార్‌ పనులు పూర్తి చేయాల్సి ఉంది. అలాగే తీరప్రాంత ప్రజల విద్యాభ్యాసానికి ఆదర్శ ఉన్నత పాఠశాల నిర్మించాలన్న చంద్రబాబు కలను వైసీపీ ప్రభుత్వం నీరుగారుస్తూ పుట్టింగులకే పరిమితం చేసింది. సీజనల్‌ వ్యాధులు తీవ్రంగా విస్తరించే తీరప్రాంత ప్రజల ఆరోగ్య అవసరార్థం పీహెచ్‌సీ నిర్మాణానికి వైసీపీ పాలకులు స్థలం కేటాయించలేదు. పొట్టిశ్రీరాములు స్మారక అదనపు గదుల నిర్మాణం పిల్లర్ల దశ దాటలేదు. ఈ పరిస్థితుల్లో తీరప్రాంత అభివృద్ధి, గంగపుత్రుల దాహార్తి తీర్చే విషయంలో కావలి ఎమ్మెల్యే వెంకటక్రిష్ణారెడ్డి అడుగులు వేస్తున్నారు. పూర్తి స్థాయిలో ఫిషింగ్‌ హార్బర్‌ పనులు పూర్తయ్యాక సీఎం చంద్రబాబు చేతుల మీదుగా పలు అభివృద్ధి కార్యక్రమాలు, ప్రారంభోత్సవాలు చేయించాలన్న ఆలోచనలు జరుగుతున్నాయి.

2019లో చంద్రబాబు నాయుడు ఆవిష్కరించిన పొట్టి శ్రీరాములు విగ్రహం

'పీఎం యశస్వి'కి 15 వరకు గడువు

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి) : పీఎం యశస్వి పథకం కింద ఉపకారవేతనాల కోసం దరఖాస్తు చేసుకోడానికి ఈనెల 15 వరకు గడువును పొడిగించారని జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారి పీ వెంకట లక్ష్మమ్మ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పథకం కింద టాప్‌క్లాస్‌ స్కూళ్లు, కాలేజీల కింద ఎంపిక చేయబడిన పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న 9వ తరగతి, 10వ తరగతి విద్యార్థులకు రూ.75వేలు, ఇంటర్మీడియట్‌ విద్యార్థులకు గరిష్ఠంగా రూ.1.25లక్షల స్కాలర్‌షిప్‌ అందిస్తారని తెలిపారు. జిల్లాలో 2.50లక్షలలోపు వార్షికాదాయం కలిగిన బీసీ, ఓబీసీ, మైనార్టీ, డీఎన్‌టీ విద్యార్థినీ విద్యార్థులు ఈ ఉపకార వేతనాలకు అర్హులని పేర్కొ న్నారు. జిల్లాలో అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

బార్‌ల వేజారు!



నెల్లూరులో మూతపడ్డ బార్‌లు

- జిల్లాలో 55కి 21 బార్‌లకే దరఖాస్తులు
- నూతన పాలసీపై వ్యాపారుల్లో అసహనం
- జిల్లాలో మూతపడుతున్న బార్‌లు

నెల్లూరు (క్రైం), సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ హయాంలో అప్పటి పాలకుల పుణ్యమా అని ఓ వెలుగు వెలిగిన బార్‌లు ఇప్పుడు మూతపడుతున్నాయి. ఇందుకు ప్రస్తుత ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన పాలసీ ప్రభావమేనని వ్యాపారులు వాపోతున్నారు. జిల్లావ్యాప్తంగా 55 బార్లకు గజిట్‌ విడుదల చేయగా 21 బార్లకు 94 దరఖాస్తులు మాత్రమే అందాయి. దీంతో ప్రభుత్వానికి దరఖాస్తుల రూపేణా ఆశించిన స్థాయిలో ఆదాయం రాలేదు. ప్రధానంగా నెల్లూరు నగరం వంటి ప్రాంతాల్లో 35 బార్లకు గజిట్‌ విడుదల చేసినా 17 బార్లు మాత్రమే దరఖాస్తులు అందడం అధికారులను ఆశ్చర్యానికి గురి చేసింది. ఒకప్పుడు బార్‌లకు దరఖాస్తులు చేసుకోవడమంటే వ్యాపారులు పోటీపడేవారు. అయితే, ప్రస్తుతం వారిలో చలనం కరువైంది. టెండర్‌, వేలం కాకుండా ఈ సంవత్సరం బార్లను లాటరీ విధానంలో కేటాయించినా ఒక్కో బార్‌కు నాలుగు దరఖాస్తులు కంటే ఎక్కువ అందలేదు.

● పాలసీలో మార్పులు వచ్చేనా!?

నూతన బార్‌ పాలసీలో కొన్ని మార్పులు చేయాలని దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కాక ముందు నుంచే వ్యాపారులు కోరుతున్నారు. అయితే, ప్రభుత్వం అంగీకరించకపోవడంతో వ్యాపారులంతా చర్చించుకొని దరఖాస్తుల ప్రక్రియకు దూరంగా ఉన్నారు. అయితే, దరఖాస్తుల ప్రక్రియలో చివరి రోజున కొందరు వ్యాపారులు ముందుకు వచ్చి ఒక్కో బార్‌కు నాలుగేసి దరఖాస్తులు వేశారు. దీంతో జిల్లాలో గీతకులాలతో కలిసి 21 బార్‌లకు లక్కీడిప్‌ నిర్వ హించారు. నూతన పాలసీలో మార్పులు తీసుకువస్తే అన్ని బార్లకు దరఖాస్తులు చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని వ్యాపా రులు చెబుతున్నారు. కొద్ది రోజుల్లోనే మరో నోటిఫికేషన్‌ విడుదల అవుతుందని, జిల్లాలో మిగిలి ఉన్న బార్లకు దరఖాస్తులు చేసుకునే అవాకాశం ఉందని అధికారులు తెలుపుతున్నారు.

'కోత'లు మొదలైనా..

కొనుగోళ్లు ఏవీ!?

జిల్లాలో ఎడగారు వరి పంట కోతలు మొదలైనా ధాన్యం కొనుగోలు కేంద్రాలు మాత్రం ప్రారంభం కాలేదు. అల్పపీడన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేస్తున్న నేపథ్యంలో అన్నదాతలో గుబులు మొదలైంది. అన్నదాతలతోపాటు రైతు సంఘాల నాయకులు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులు నష్టపోకుండా చూడాలని కోరుతున్నా వారి విన్నపాలను పాలకులు పట్టించుకోవటం లేదు.

- నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి)

- 'ఎడగారు'లో విస్తృతంగా వరి సాగు
- ఐదు లక్షల మెట్రిక్‌ టన్నుల ధాన్యం దిగుబడి
- మొదలైన కోతలు.. భయపెడుతున్న వాతావరణం
- ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల ఊసేది!?
- నివేదిక పంపి మిన్నకుండిపోయిన అధికార యంత్రాంగం
- ఇదే అదునుగా దళారుల రంగప్రవేశం..
- వారు చెప్పిన రేటుకే కొనుగోలు
- తీవ్రంగా నష్టపోతున్న అన్నదాత



కోతల అనంతరం ధాన్యాన్ని ట్రాక్టర్‌లో నింపుతున్న యంత్రం

ఎడగారు సీజన్‌లో సాగునీటికి ఇబ్బందులు లేకపోవటంతో రైతులు విస్తృతంగా వరి సాగు చేపట్టారు. 98 వేల ఎకరా లలో సాగు జరుగుతుందని అధికారులు అంచనా వేసినా 1.98 లక్షల ఎకరాల్లో వరి సాగయినట్లు తెలుస్తోంది.. ఐదు లక్షల మెట్రిక్‌ టన్నుల ధాన్యం వస్తుందని అధికారులు లెక్కగట్టారు. ఇందుకు అనుగుణంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. జిల్లాలో ఎక్కువగా కేఎన్‌ఎం-1638 వరి రకం సాగుచేశారు. నెల్లూరు రూరల్‌, బుచ్చి, జలదంకి, అల్లూరు, వెంకటాచలం, కొడవలూరు, తోటపల్లిగూడూరు ఇందుకూరు పేట తదితర ప్రాంతాల్లోని 1.64 లక్షల ఎకరాల్లో ఈ రకం వరి సాగుచేశారు. ఎంటీయూ 1010 రకం 20 వేల ఎకరాల్లోను, 1790 ఎకరాల కుపైగా కేఎన్‌ఎం-733, ఆర్‌ఎన్‌ఆర్‌ 15048 రకాలను సాగు చేశారు.

● దళారుల రంగ ప్రవేశం

బుచ్చి, నెల్లూరు రూరల్‌, ఇందుకూరుపేట, అల్లూరు తదితర చోట్ల వరి కోతలు మొదలయ్యాయి. అప్పుడే దళారులు రంగప్రవేశం చేసి గిట్టుబాటు ధర కన్నా తక్కువకు ధాన్యం కొనుగోలు చేయను సన్నద్ధమైనట్లు సమచారం. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు సాధారణ రకానికి రూ.2300, గ్రేడ్‌-ఏ రకానికి రూ.2320 గా ఉంది. ఈ లెక్కన పుట్టి ధాన్యం ధర రూ.19,720గా ఉంది. ప్రభుత్వం తరఫున ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే ఈ మద్దతు ధర రైతులకు లభిస్తుంది. కోతలు మొదలైనా కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దళారులకు కలిసి వస్తోంది. ఎంటీయూ 1010 రకం పుట్టి ధాన్యాన్ని రూ. 15 వేల నుంచి 15,500లకు దళారులు కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం. వర్షాలు కురిస్తే ఈ ధరను మరింత దిగజార్చే అవకాశం ఉంది.

● ప్రతిపాదనలతో సరి

జిల్లా పౌరసరఫరాల సంస్థ జిల్లా యంత్రాంగం తరఫున 3లక్షల మెట్రిక్‌ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసే అవకాశం ఉందని, ఇందుకోసం 125 కేంద్రాలు చేయాల్సిన ఆవశ్యకత ఉందని ప్రభుత్వానికి ప్రతిపాదన పంపింది. ఆ తరువాత రైతుల ఆవేదనను ప్రభుత్వం దృష్టికి వారు తీసుకెళ్లలేదనే విమర్శలు ఉన్నాయి. మిల్లర్లతో సమావేశాలు జరుగు తూనే ఉన్నాయి. రైతుల గోడుగోడుగానే మిగిలిపోయింది. ఇకనైనా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తారో వేచిచూడాల్సిందే.

అనుమతి రాగానే ప్రారంభిస్తాం

జిల్లాలో ఎడగారు పంట వివరాలు, కొనుగోలు కేంద్రాల ఏర్పాటు విషయం ప్రభుత్వానికి తెలియచేశాం. కేంద్రాల ఏర్పాటు, కొనుగోళ్లకు సంబంధించి అనుమతి రాగానే కొనుగోలు ప్రారం భిస్తాం. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడానికి అన్ని చర్యలు తీసుకున్నాం.

- అర్జునరావు, జిల్లా మేనేజర్‌, పౌరసరఫరాల సంస్థ

ఖబడ్దార్‌ క్రిమినల్స్‌!

- తరచూ నేరాలకు పాల్పడితే పీడీయాక్ట్‌
- ఎస్పీ కృష్ణకాంత్‌

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తరచూ నేరాలకు పాల్పడుతూ ప్రజాశాంతికి భంగం కలిగించే వారిపై పీడీ యాక్ట్‌ కింద కేసు నమోదు చేస్తున్నామని ఎస్పీ జీ కృష్ణకాంత్‌ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రౌడీ, కేడీ, బీసీల ప్రవర్తనలో మార్పు రాకుంటే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. పదేపదే నేరాలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని, పీడీ యాక్ట్‌ అమలు చేస్తే జైలు జీవితం తప్పదన్నారు. అవసరమైతే జిల్లా నుంచి బహిష్కరణ విధించడానికి కూడా వెనుకాడ బోమని, చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రతీ నేరస్థుడిపై నిరంతరం పటిష్ఠ నిఘా ఉంటుందని తెలిపారు. కాగా, నెల్లూరులోని వెంకటేశ్వరపురం జగనన్న కాలనీలో నివసిస్తున్న షేక్‌ తన్వీర్‌పై పీడీ యాక్ట్‌ను జిల్లా పోలీసులు అమలు చేశారు. గతంలో వేదాయపాళెం పరిధిలోని చంద్రబాబునగర్‌లో తన్వీర్‌ నివాసం ఉండే వాడు. అతనిపై ఒక హత్యాయత్నం, మూడు దోపిడీ, ఒక దొంగతనం... ఇలా మొత్తం 11 కేసులున్నాయి. వేదాయపాలెం పోలీసు స్టేషన్‌లో రౌడీషీట్‌ ఉంది. ఈ నేపథ్యంలో పీడీ యాక్ట్‌ను ప్రయోగించారు.

మీకు చెక్‌పవర్‌ ఎందుకు రద్దు చేయకూడదు!

వెంకటాచలం సర్పంచుకు డీపీవో నోటీసు


వారం రోజుల వరకు గడువు 8

మద్యం కేసు.. నీరుగార్చే యత్నం?

ప్రభుత్వం మారి ఏడాది దాటినా ఇంకా కొందరు అధికారుల తీరు మాత్రం మారడం లేదు. గత ప్రభుత్వంలో వైసీపీ నేతల అండ చూసుకొని విచ్చలవిడిగా వ్యవహరించిన కొందరు అధికారులు.. ఇప్పుడు ఆ బాగోతాలు బయటకు రాకుండా మళ్లీ అడ్డదారులు తొక్కుతున్నారు. ఎన్నికల సమయంలో మద్యం బాటిళ్లు పక్కదారి పట్టించి వైసీపీ నేతలకు చేరవేసిన కేసును ఎలాగైనా నీరు గార్చాలన్న కుట్రలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఓ అధికారి కేసు ముందుకు సాగకుండా ఉండేందుకు తన పలుకుబడి మొత్తాన్ని ఉపయోగించుకుంటున్నట్లు ఎక్సైజ్‌ శాఖలో గుసగుసలు వినిపిస్తున్నాయి.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

- గతేడాది ఎన్నికలలో భారీగా మద్యం పక్కదారి
- వైసీపీ నేతల చేతుల్లోకి లక్షల బాటిళ్లు
- సర్వేపల్లి వ్యవహారంతో గుట్టు రట్టు
- కీలకంగా వ్యవహరించిన ఓ అధికారి
- నేడు విచారణ ముందుకు సాగకుండా విశ్వప్రయత్నం
- రెండు నెలల నుంచి ఎక్సైజ్‌కు అందని డేటా



గతేడాది సార్వత్రిక ఎన్నికల సమయంలో పొదలకూరు మండలం విరువూరు, ముత్తుకూరు మండలం పంటపాలెం వద్ద ఇద్దరు వైసీపీ నేతల వద్ద భారీగా మద్యం డంప్‌లను ఫ్లయింగ్‌ స్క్వాడ్‌ అధికారులు పట్టుకున్నారు. ఆ కేసుల్లో వైసీపీ నేతలను అరెస్టు కూడా చేశారు. అప్పట్లో పనిచేస్తున్న అధికారులు లోతైన విచారణ జరపకుండా కేసును క్లోజ్‌ చేశారు. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఓ వ్యక్తి ఈ కేసులపై కోర్టును ఆశ్రయించారు. దీంతో మళ్లీ కేసుల పునఃవిచారణ ప్రారంభమైంది. ఈ కేసులతో సంబంధం ఉందన్న అభియోగంతో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని అరెస్టు కూడా చేశారు. పునఃవిచారణలో ఎన్నికల సమయంలో జరిగిన మద్యం కుట్ర బయటపడింది. వైసీపీ నేతల వద్ద దొరికిన మద్యం కేసలన్నీ ప్రభుత్వ దుకాణాల నుంచే వచ్చినట్లు అధికారులు గుర్తించారు. ఇవేగాక మరింత భారీ స్థాయిలో ప్రభుత్వ దుకాణాల నుంచి మద్యం బయటకు వెళ్లినట్లు ప్రాథమికంగా నిర్ధారించుకున్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో ఉన్న 35 దుకాణాల్లోని నాటి అమ్మకాల రికార్డులను పరిశీలించగా 2024, మార్చి మొదటి వారంలోని రెండు రోజుల్లోనే సాధారణ అమ్మకాలకు మించి మద్యం అమ్మకాలు జరిగినట్లు గుర్తించారు. ఒక్కో షాపులో సాధారణంగా రోజుకు వెయ్యి బాటిళ్ల మద్యం విక్రయాలు జరుగుతుండగా, ఆ రెండు రోజుల్లో

- మిగతా 6లో

కార్పొరేషన్‌లో 'ఓసీ' కలకలం!

- 72 అపార్టుమెంట్లకు మార్టిగేజ్‌ల విడుదల
- భారీ స్కాంలో నాటి కమిషనర్‌లే కీలకం
- చర్యలకు టీడీపీ నేత ఆనం డిమాండ్‌

నెల్లూరు మున్సిపాలిటీలో మరో అవినీతి బాగోతం

నెల్లూరు (సిటీ), సెప్టెంబరు 2,(ఆంధ్రజ్యోతి) : అవినీతి స్కాంలకు కేంద్ర బిందువుగా మారిన నెల్లూరు కార్పొరేషన్‌లో తాజాగా మరో అవినీతి బాగోతం వెలుగులోకి వచ్చింది. ఏపీ ఆక్వా అథారిటీ బోర్డు ఛైర్మన్‌, టీడీపీ నేత ఆనం వెంకటరమణారెడ్డి ఫిర్యాదుతో సిటీ ప్లానింగ్‌లో తీగలాగగా అవినీతి డొంకంతా కదిలింది. గడిచిన వైసీపీ హయాంలో నెల్లూరు నగరంలోని 72 అపార్టుమెంట్లకు ఆక్యూపేషన్‌ సర్టిఫికెట్‌ (ఓసీ) లేకుండానే మార్టిగేజ్‌లు విడుదల చేసిన భారీ అవినీతి స్కాం బయటకు వచ్చింది. ఆ నివేదిక ఆధారంగా బాధ్యులైన కమిషనర్లపై చర్యలు తీసుకోవాలని ఆనం డిమాండ్‌ చేస్తూ మంగళవారం కమిషనర్‌ నందన్‌ కలిసి వినతి పత్రం అందచేశారు. ఆ వివరాలు మేరకు.. వైసీపీ హయాంలో కార్పొరేషన్‌లోని సిటీప్లానింగ్‌ విభాగం అవినీతితో భ్రష్టుపట్టిందని తెలిపారు. 72 అపార్టుమెంట్లకు కనీస క్షేత్రస్థాయి విచారణ కూడా లేకుండా ఓసీ విడుదల చేయకుండానే మార్టిగేజ్‌ ధ్రువీకరణ ఇచ్చేశారని తెలిపారు. ఇందులో అప్పటి కమిషనర్లుగా పని చేసిన డీ హరిత, వికాస్‌మర్మత్‌, ప్రస్తుత డీసీ చెన్నుడు కీలక పాత్ర పోషించారని ఆరోపించారు. తాను మే నెలలో

- మిగతా 6లో



పంచకర్మ చికిత్సలో అందిస్తున్న శిరోధార ప్రక్రియ

ఆయుర్వేదానికి అందలం

మొండి జబ్బులను కూడా నయం చేసే పురాతన వైద్య విధానం ఆయుర్వేదం. ఇంగ్లీష్‌ మందుల హోరులో వెనుకబడి పోయిన ఆ ఆయుర్వేదానికి పూర్వవైభవం తెచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఆసుపత్రులను అభివృద్ధి చేయడమేకాక అధునాతన సేవలు, పంచకర్మ వంటి ఖరీదైన చికిత్సలనూ అందించేందుకు కసరత్తు చేస్తోంది.

- ప్రాచీన వైద్యానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యం
- అందుబాటులోకి పంచకర్మ చికిత్సలు
- వెల్‌నెస్‌ సెంటర్లుగా 8 ఆసుపత్రులు
- వైద్యులు, సిబ్బంది నియామకానికి అనుమతులు

జిల్లా వ్యాప్తంగా 25 ఆయుర్వేద ఆసుపత్రులు ఉన్నప్పటికీ వాటిని వైద్యులు, సిబ్బంది కొరత వేధిస్తోంది. నెల్లూరులోని ప్రధాన ఆయుర్వేద ఆసుపత్రిలోనూ తగినంత మంది వైద్యులు లేరు. తాత్కాలికంగా వేరే ఆసుపత్రి నుంచి మూడు రోజులు వచ్చి సేవలు అందిస్తున్నారు. అల్లూరు లో 5 పడకల ఆసుపత్రి ఉన్నా వైద్యులు, సిబ్బంది లేకపోవటంతో ఆ కేంద్రం ఎప్పుడూ మూసే ఉంటోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వైద్యులు, సిబ్బంది భర్తీకి గ్రీన్‌ సిగ్నల్‌ ఇచ్చింది. దీంతో జిల్లాలోని ఆయుర్వేద ఆసుపత్రులకు 40 మంది వరకు వైద్యులు, సిబ్బంది నియామకాలు జరుగనున్నాయి.

వివరాలు 8లో...

'సోమశిల'కు తగ్గిన ఇన్‌ఫ్లో

అనంతసాగరం సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. సోమవారం 23,031 క్యూసెక్కుల వరద రాగా, మంగళవారం 19,745 క్యూసెక్కులకు పడిపో యింది. ఇక డ్యాంలో 63.330 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నీటి సామర్థ్యం 68 టీఎంసీలు కాగా ప్రస్తుతం 38.080 క్యూసెక్కులు నిల్వ ఉన్నట్లు ఉన్నదని ఏఈ అనీల్‌కుమార్‌ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 9,650 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 1,425 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఉత్తర కాలువకు 400, కండలేరుకు 10,100, డెల్టాకు 1,350 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

● కండలేరులో.. రాపూరు : కండలేరు డ్యాం

రామదాసుకండ్రిగలో రేషన్ పంపిణీ

వెంకటాచలం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామదాసు కండ్రిగలో మంగళవారం స్మార్ట్ రైసు కార్డులకు రేషన్ సరుకులను పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా ఇడిమేపల్లి మాజీ ఎంపీటీసీ, టీడీపీ నేత చాట్ల వెంకటసుబ్బయ్య హాజరై సరుకులను పంపిణీ చేసి మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు ప్రజలకు రేషన్ కార్డులను స్మార్ట్ కార్డులుగా ఆధునీకరించి సకాలంలో రేషన్ సరుకులు పంపిణీ చేసే అవకాశాన్ని కల్పించారన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 9978
వెండి కిలో ధర	రూ. 126000
వెండి ఒక గ్రాము	రూ. 129.00

వీఎస్‌యూలో అధ్యాపకులకు క్రీడా పోటీలు



అధ్యాపకురాళ్లతో కలిసి ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొన్న రిజిస్ట్రార్ డాక్టర్ సునీత

వెంకటాచలం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీ ఎస్‌యూలో మంగళవారం ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని అధ్యాపకులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా షాట్‌పుట్, మ్యూజికల్ బాల్, షార్ట్ రన్, డి స్కత్రో, త్రోబాల్, చెస్, క్రికెట్, టగ్ ఆఫ్ వార్ వంటి క్రీడల్లో అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత పోటీలను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ క్రీడలు ఉపాధ్యాయు ల మధ్య అనుబంధాన్ని పెంపొందించడమే కాకుండా శారీరక ఆరోగ్యాన్ని కాపాడడంలోనూ, మానసిక ఉల్లాసాన్ని అందించడంలోనూ ముఖ్యపాత్ర పోషిస్తాయన్నారు. కార్యక్రమంలో వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గణేశ్ పూజలు

బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు సెంటర్లలో నెలకొల్పిన గణేశ్ విగ్రహాలతోపాటు మండలంలోని జొన్నవాడ బడి సెంటర్‌లో నెలకొల్పిన వినాయక విగ్రహానికి మంగళవారం పూలాలంకరణలు చేసి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. పలువురు గణేశ్ విగ్రహాలకు ప్రసాదాలను నివేదించారు.

నేడు ఎక్సైజ్ స్టేషన్‌లో బైక్‌ల వేలం

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో బుధవారం రెండు బైక్‌లకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ కిషోర్ మంగళవారం తెలిపారు. బజాజ్ పల్సర్, హీరో హోండా బైక్‌లకు వేలం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వివరాలకు స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

13న లోక్ అదాలత్

కందుకూరు : జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 13న నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కందుకూరు సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.శోభ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ లోక్ అదాలత్‌లో సివిల్, క్రిమినల్, మోటారువాహనాలు, భరణం తదితర కేసులను రాజీచేసుకోవచ్చునని తెలిపారు.

ఊపందుకున్న వరి కోతలు

- కానరాని ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- గిట్టుబాటు ధర లేక రైతుల ఆవేదన
- ఆదుకోవాలంటూ కోవూరు ఎమ్మెల్యేకి వేడుకోలు



విడవలూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో వరికోతలు ఊపందుకున్నాయి. రబీలో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేసింది. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపటంతో రైతులకు గిట్టుబాటు ధర లభించింది. అయితే ఖరీఫ్‌లో అందుకు భిన్నంగా పరిస్థితులు ఏర్పడ్డాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై ప్రభుత్వం చేతులెత్తేసింది. దీంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. సరిగ్గా కోతలు జోరుగా సాగే సమయంలో ధాన్యం ధరలు ఒక్కసారిగా తగ్గాయి. దీంతో రైతులు ఎమ్మెల్యేపైనే ఆశలు పెట్టుకున్నారు.

●గిట్టుబాటు ధర లేక నష్టాలు

మండలంలో ఖరీఫ్‌లో సుమారు 20వేల ఎకరాల్లో అధికంగా కేఎన్ఎం 1638, కేఎన్ఎం 733, ఎంటీయూ 1010, ఆర్ఎన్ఆర్.ఎం7 వరి రకాలను వేశారు.ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఈస్ట్రన్ చానల్ డీసీ చైర్మన్ పాశం శ్రీహరిరెడ్డి పర్యవేక్షణలో చివరి అయకట్టు వరకు సాగునీరు అందింది. దీంతో ఎకరాకు 3 నుంచి 3.50 పుట్ల ధాన్యం పండింది. ఇంతవరకు బాగానే ఉన్నా, వరికోతలు ఊపందుకున్న సమయంలో కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేయలేదు. దీంతో దళారులు, మిల్లర్లు కుమ్మక్కై వారికి ఇష్టం వచ్చిన ధరకి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. వాతావరణ పరిస్థితులను బట్టి ధాన్యం ధరలను పెంచుతూ, తగ్గిస్తున్నారు. ప్రస్తుతం దళారులు ఎంటీయూ 1010 రూ.15వేలు, కేఎన్ఎం 1638 రూ.17వేలు, కేఎన్ఎం733 రూ.16వేలకు కొనుగోలు చేస్తున్నారని రైతులు తెలిపారు. ఎకరా వరిపంటకి సుమారు రూ. 30వేల నుంచి రూ. 40వేలు వరకు ఖర్చు అవుతున్నదని, ధాన్యం ధరలు లేకపోవటంతో అప్పులు పాలవుతున్నామని రైతులు పేర్కొన్నారు. పుట్టి రూ. 20వేలకు కొనుగోలు చేస్తేనే అప్పులు పాలు కాకుండా ఉంటామని వారు తెలిపారు.

●ఎమ్మెల్యే అదుకోవాలి

రబీలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి రైతుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేయటమే కాకుండా మిల్లర్లతో సంప్రదించి, రైతులకు లారీలను సకాలంలో పంపి గిట్టుబాటు ధర వచ్చేలా చూశారు. అలాగే రబీలో కూడా ఎమ్మెల్యే చొరవ తీసుకుని గిట్టుబాటు ధర వచ్చేలా చర్యలు తీసుకోవాలిఇ.

తీవ్రంగా రైతులు నష్టపోతున్నారు...



ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవటంతో రైతులు, కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నాం. ఈ రోజు ఉన్న ధర రేపు ఉండటం లేదు. దళారులు, మిలర్లు కుమ్మక్కై రైతులను దోచుకుంటున్నారు. గిట్టుబాటు ధరలేక నష్టపోతున్నాం.

-పోలిరెడ్డి ఆశోక్‌కుమార్‌రెడ్డి, రైతు, చౌకిచర్ల

సాగు ఖర్చులు పెరుగుతున్నా గిట్టుబాటు ధర లేదు



సాగు ఖర్చులకు అనుగుణంగా ధాన్యం ధరలు పెరగడంలేదు. ప్రతి వస్తువునకు నిర్ధిష్టమైన ధర ఉంది. కానీ ధాన్యానికి మాత్రం లేదు. ప్రభుత్వం దృష్టి సారించి రైతులకు ఆదుకోవాలి.

- నట్టం సూరినారాయణ, వరిణి గ్రామం

వరి కోయాలంటే భయంగా ఉంది



రెండు,మూడు రోజుల్లో పంట కోత కోయాల్సివుంది. ధాన్యం ధరలు చూస్తే చాలా వరకు తగ్గిపోయ్యా యి, కోసిన ధాన్యాన్ని నిల్వ చేయ్యటానికి ఎటువంటి సదుపాయాలు లేవు. ఏమిచేయ్యాలో తోచటం లేదు.

- పులి సురేష్, దండిగుంట

ఊరూరా పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు

- పలుచోట్ల కేక్ కటింగ్ చేసి సంబరాలు, పండ్లు పంపిణీ, అన్నదానం



బుచ్చి : డీసీఎం పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న కూటమి నేతలు



మనుబోలు : రక్తదాతకు ప్రశంసాపత్రం అందిస్తున్న జనసేన మండలాధ్యక్షుడు ప్రసాద్



పొదలకూరు : పవన్ కల్యాణ్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న కూటమి నాయకులు

బుచ్చిరెడ్డిపాళెం,సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి):స్థానిక శ్రీరాంనగర్‌లోని జనసేన కార్యాలయంలో మంగళవారం ఆ పార్టీ మండలాధ్యక్షుడు దేపూరు మాధవ్ ఆధ్వర్యంలో జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ముందుగా కేక్ కట్‌చేసి డీసీఎంకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన నేతలు చప్పిడి శ్రీనివాసులురెడ్డి, భువనేశ్వరం మురళి, టీడీపీ అర్బన్ అధ్యక్షుడు గుత్తా శ్రీనివాసులు, నాయకులు ఎంవీ. శేషయ్య, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కాసా శ్రీనివాసులు, రామిశెట్టి మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మనుబోలు : జనసేన పార్టీ అధినేత కే. పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వేడుకలను మంగళవారం ఆ పార్టీ మండలనాయకులు ఘనంగా నిర్వహించారు. ముందుగా స్థానిక సంగమేశ్వరాలయంలో డీసీఎం పేరిట పూజలు చేయించారు. అనంతరం గిరిజనకాలనీలోని పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. తరువాత మడమనూరులో జనసైనికులు రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. శిబిరంలో రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందించారు. మనుబోలు అంగన్‌వాడీ కేంద్రానికి ఫర్నిచర్‌ను అందించి, చిన్నారులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల నాయకులు పెనుబాక ప్రసాద్, ఖాదర్‌వలి, సాగునీటి సంఘం సభ్యులు పెనుబాక మహేష్, నాయకులు జాకీర్, కంటేపల్లి సుధాకర్, ఎన్ఆర్ఐ. కమతం ప్రదీప్, బీ. పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరు : పట్టణంలో డీసీఎం పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలను జనసేన నాయకులు నారదాసు రవి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, అనంతరం గేట్ సెంటర్‌లో భారీ కేక్‌ను కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. తదుపరి కూటమి నాయకులతో కలిసి వృద్ధాశ్రమంలో దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. అన్నదానం నిర్వహించారు. పంచాయతీ బస్టాండ్‌లో ఉన్న పవన్‌కల్యాణ్ భారీ కటౌట్‌కు పూలమాలలు వేసి పాలభిషేకం చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు బీ. సురేష్‌నాయుడు, ఎన్. రవి, టీడీపీ నాయకులు, పాల్గొన్నారు.

గుడపల్లి కాలువ అభివృద్ధికి రూ.50లక్షలు : ఎమ్మెల్యే

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హౌస్‌తోట ప్రాంతంలో మంగళవారం ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పర్యటించారు. అక్కడున్న గుడపల్లి కాలువ దుస్థితిని చూసి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్య ల పరిష్కారానికి రూ.50లక్షలు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. అలాగే 11వ వార్డులో కమిషనర్‌తో కలిసి ఎమ్మె ల్యే పర్యటించి, ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. రోడ్లు, ఇళ్ల స్థలాలు, ఇళ్లు, పింఛన్లు మంజూరు చేయాలని పలువురు ఎమ్మెల్యే ముందు ఏకరువు పెట్టారు. అనంతరం వాసవీనగర్‌లోని రాచూరి సోమయ్య కల్యాణ మండపంలో కూటమి నేతలతో కలిసి డీసీఎం పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, టీడీపీ అర్బన్ అధ్యక్షుడు గుత్తా శ్రీనివాసులు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కూటమి నాయకులు చప్పిడి శ్రీనివాసులురెడ్డి, దేపూరు మాధవ్, శేషయ్య, హరనాథ్, కాసా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

● ఎమ్మెల్యేతో పీఏసీఎస్ చైర్మన్ల భేటీ



విడవలూరు : ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డితో పీఏసీఎస్ చైర్మన్లు

విడవలూరు : కొత్తగా నియమితులైన పార్లపల్లి, విడవలూరు, వరిణి పీఏసీఎస్ చైర్మన్లు వేగూరు చంద్రారెడ్డి, పొన్నలూరు పురందర్‌రెడ్డి, కొడిమెర్ల వెంకటేశ్వర్లు మంగళవారం నెల్లూరులోని వీ వీఆర్ నివాసంలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సమస్యలు తెలుసుకుని, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రాకుండా చూసుకోవాలన్నారు. ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అడపాల శ్రీధర్‌రెడ్డి, పాశం శ్రీహరిరెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, వెల్లంపల్లి దిలీప్, ఉచ్చూరు సుధీప్‌రెడ్డి, శంబయ్య, కే. శ్రీధర్‌నాయుడు పాల్గొన్నారు.

సిఫార్సుల మేరకే యూరియా వాడాలి



ఇందుకూరుపేట : పొలం పిలుస్తుంది కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ అధికారులు, రైతులు



మనుబోలు మండలం వెంకన్నపాళెంలో వ్యవసాయాధికారులు, రైతులు

ఇందుకూరుపేట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యో తి): పైర్లకు సిఫార్సుల మేరకు యూరియా వాడాలని మండల వ్యవసాయ అధికారి డీ. రఘునాథరెడ్డి తెలిపారు. మండలంలోని పున్నూరులో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు అధికంగా యూరియాను వాడటం వల్ల చీడపీడలు ఎక్కువగా ఆశిస్తాయన్నారు. అంతేకాక పూత ఆలస్యంగా వచ్చి తాలు గింజలు ఏర్పడి దిగుబడులు తగ్గుతాయన్నారు. రాబోవు రబీ సీజన్‌కి బీపీటీ-5204, ఎన్ఎల్ఆర్-34449, కేఎన్ఎం-118 వంటి వరి రకాలు అనుకూలమని తెలిపారు. వరి విత్తనాలకు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసుకున్న తర్వాతే నారు పోసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏవో సురేందర్‌రెడ్డి, వీఏఏ నరహరి, పలువురు రైతులు పాల్గొన్నారు.

ముత్తుకూరు : పంటలకు జీవన ఎరువుల వాడకంతో భూరక్షణ సాధ్యమని పొదలకూరు వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త షేక్.హసీనాభాను తెలిపారు. పంటపాలెం ఆర్ఎస్‌కేలో జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మా ట్లాడుతూ వరి, వేరుశనగ పంటల్లో జీవన ఎరువుల ఉపయోగం, భూరక్షణకు అవసరమైన చర్యల గు రించి వివరించారు. కృష్ణపట్నం సొసైటీ ప్రెసిడెంట్ పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువులు, వ్యవసాయ పనిముట్లు సకాలంలో అందజేశామన్నారు. అనంతరం ముత్తుకూరు, పంటపాలెం గ్రామాల్లో వేరుశనగ సాగు చేసిన పొలాలను పరిశీలించారు. తెగుళ్ల నివారణకు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు జోత్స్నారాణి, మధురిమ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది దశయ్య, వ్యవసాయ సిబ్బంది రమణమ్మ, కరీం, ప్రసన్న, రైతు నాయకులు పల్లంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.



ముత్తుకూరు : రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయ అధికారులు

మనుబోలు : మండలంలోని వెంకన్నపాళెం, పిడూరుపాళెం గ్రామాల్లో మంగళవారం వ్యవసాయాధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వెంకన్నపాళెంలో రైతు సాగుచేస్తున్న జొన్నపైరును పరిశీలించి, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య మాట్లాడుతూ ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించాలన్నారు. వాటి ఫలితాల ఆధారంగా రసాయన ఎరువులు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏ దివ్యపలువురు రైతులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌కు ఘన నివాళి



పొదలకూరు : వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైసీపీ నాయకులు

పొదలకూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పంచాయతీ బస్టాండ్‌లో మాజీ సీఎం స్వర్గీయ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 16వ వర్థంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ రమణారెడ్డి, వైస్ ఎంపీపీ శేఖర్‌రెడ్డి, రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ కోనం బ్రహ్మయ్య, వార్డు మెంబర్ షేక్.అంజాద్, గంగవరపు వేణుగోపాల్‌రెడ్డి, దాదిబత్తిన భాస్కర్‌రెడ్డి, ఆకులూరు హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.

మనుబోలు : స్థానిక వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అలాగే అంబేడ్కర్ నగర్‌లో వైఎస్ చిత్రపటానికి వైసీపీ అభిమానులు నివాళులు అర్పించారు. అనంతరం పీహెచ్‌సీలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, నాయకులు ముంగర రవీంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంకటాచలం : సర్వేపల్లిలో వైఎస్ఆర్ విగ్రహానికి వైసీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వృద్ధులు, పేదలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పొట్లూరి సుబ్రహ్మణ్యం, వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, వైసీపీ నేతలు వెంకటశేషయ్య, భాస్కర్ నాయుడు, మోహన్‌నాయుడు, ఆరుగుంట ప్రభాకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

- రూ. 8వేల నగదు, 5 సెల్‌ఫోన్ల స్వాధీనం



పోలీసులకు పట్టుబడిన పేకాటరాయుళ్లు

పొదలకూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లూర్తి గ్రామంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు మంగళవారం సాయంత్రం అరెస్టు చేశారు. పేకాట ఆడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం రావడంతో ఎస్ఐ హనీఫ్ సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.8వేల నగదు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంగళవారం విజిలెన్స్ అధికారులు పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో వెంకటేశ్వర ఫర్టిలైజర్స్ దుకాణంలో ఉన్న యూరియా స్టాక్‌లో వ్యత్యాసం ఉండటాన్ని గుర్తించి, 6ఏ కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ సీఐ శ్రీహరిరావు, అగ్రికల్చర్ అధికారి వేణుగోపాలరావు, మండల వ్యవసాయాధికారి శ్రీహరి పాల్గొన్నారు.

75 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

బుచ్చిరెడ్డిపాళెం,సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి):ఓ వాహనంలో బద్వేల్ నుంచి నెల్లూరుకు శ్రీనివాసులు అనే వ్యక్తి రేషన్ బియ్యం రవాణా చేస్తుండగా, బుచ్చి టోల్‌గేట్ వద్ద స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. 75 బస్తాల్లో సుమారు రెండున్నర టన్నుల బియ్యం ఉన్నట్లు తెలిపారు. బస్తాలను సివిల్ సప్లై అధికారులకు స్వాధీనం చేసి, కేసు దర్యాప్తు ఆయన తెలిపారు.

బాలికపై అత్యాచారయత్నం

- పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు

కావలి రూరల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రకోట ఎస్టీ కాలనీలో 7 ఏళ్ల బాలికపై ఓ 20 ఏళ్ల యువకుడు అత్యాచార యత్నానికి పాల్పడినట్లు బాలిక తల్లి మంగళవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. బాలిక కుటుంబం ప్రకాశం జిల్లా నుంచి 3 ఏళ్ల క్రితం రుద్రకోటకు వలస వచ్చింది. బాలిక తల్లిదండ్రులు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండగా వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ క్రమంలో తల్లి గ్రామంలోని కూరగాయల షాపునకు వెళ్లి వచ్చేలోగా అదే ప్రాంతానికి చెందిన ఆ యువకుడు ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలికపై అత్యాచారయత్నం చేయబోగా బాలిక పెద్దగా కేకలు వెయ్యడం, అదే సమయంలో బాలిక తల్లి అక్కడకు రావడంతో ఆ యువకుడు అక్కడ నుంచి పరారయ్యాడు. బాలిక తల్లి ఫిర్యాదుతో పోలీసులు పోక్సో కేసు నమోదు చెయ్యగా డీఎస్పీ శ్రీధర్ దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాత గొడవలతో దాడి చేసి నగరంలో హత్యాయత్నం

- పోలీసుల కేసు నమోదు

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): పాత గొడవలు మనసులో పెట్టుకొని ఓ వ్యక్తిపై రాయితో ఇష్టానుసారంగా దాడి చేసిన ఘటనపై దర్గామిట్ట పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని ప్రగతి నగర్ ఏ-బ్లాక్‌లోని ఏడవ వీధిలో షేక్ మస్తాన్ కుటుంబం నివసిస్తోంది. ఆయన ఏసీ మెకానిక్‌గా జీవనం సాగిస్తున్నారు. సోమవారం రాత్రి సారాయి అంగడి సెంటర్ సమీపంలో స్నేహితుడు కలాంతో మాట్లాడుతుండగా అబ్దుల్ ముజీద్ అనే వ్యక్తి అక్కడకు వచ్చాడు. వారి మధ్య పాత కక్షలుండటంతో మాస్తాన్‌తో గొడవకు దిగాడు. మస్తాన్‌ను కింద పడేసి గుండెలమీద కూర్చొని పక్కనే ఉన్న ఓ రాయితో తలపై బలంగా మోదాడు. మస్తాన్ స్పృహ కోల్పోవడంతో మరణించాడనుకుని అక్కడి నుంచి వెళ్లిపోయాడు. అక్కడే ఉన్న కలాం ఆంబులెన్స్‌లో మస్తాన్‌ను జీజీహెచ్‌కు తరలించారు. మంగళవారం కోలుకున్న మస్తాన్ దర్గామిట్ట పోలీసు స్టేషన్‌కు చేరుకొని ఫిర్యాదు చేశారు. పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కార్పొరేషన్‌లో 'ఓసీ' కలకలం!

(5వ పేజీ తరువాయి)

రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించి తగు విచారణ కోరగా ఆ మేరకు కలెక్టర్‌కు అందిన ఆదేశానుసారం కార్పొరేషన్ అధికారులు విచారించి ఇటీవల కలెక్టర్, హైకోర్టుకు నివేదికను అందచేశారని తెలిపారు. ఓసీలు లేకుండా మార్టిగేజ్‌లు విడుదల చేసింది నిజమేనన్న వాస్తవాన్ని వారే ధ్రువీకరించారని స్పష్టం చేశారు. పైగా తదుపరి విచారణకు విజిలెన్స్‌కు సిఫార్సు చేయడం తగదన్నారు. కార్పొరేషన్ అధికారులే అక్రమాలు జరిగాయని తేల్చి మరలా విజిలెన్స్‌కు రాయడం సరికాదని చెప్పారు. అక్రమాలకు పాల్పడిన కమిషనర్లపై చర్యలకు సిఫార్సు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇందులో భాధ్యులుగా ఉన్నవారందరికీ తగు శిక్షపడాలని సూచించారు. పైగా భూగర్భ డ్రైనేజీలోనూ రూ 20 కోట్లు అవినీతి బాగోతం జరిగిందని, ఆ వివరాలను కూడా త్వరలో బయటపెడతానన్నారు. ఓ మహిళా కమిషనర్ సంతకాలు చేసి పనులు జరగకుండానే బిల్లులు చేసిందని ఆరోపించారు. ఆనం ఫిర్యాదుతో బయటకు వచ్చిన ఈ నివేదిక రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ యంత్రాంగంలో చర్చనీయాంశంగా మారింది.

మద్యం కేసు నీరుగార్చే యత్నం?

(5వ పేజీ తరువాయి)

అదనంగా 1800 నుంచి 2 వేల బాటిళ్ల విక్రయించినట్లు నిర్ధారించుకున్నారు. ఇలా ఒక్క సర్వేపల్లిలోనే సుమారు 80 వేలకుపైగా మద్యం సీసాలు బల్క్‌గా బయటకు వెళ్లినట్లు గుర్తించారు. మరి ఇక జిల్లా మొత్తం విచారణ జరిపితే అక్కడ పరిస్థితేమిటన్నది కూడా తెలుస్తుందన్న వాదన వినిపిస్తోంది.

● ఆ అధికారి కనుసన్నల్లోనే!

సాధారణానికి మించి అమ్మకాలు జరిగిన షాపుల్లోని డేటాను ఇవ్వాలని ఎక్సైజ్ అధికారులు నాటి సాఫ్ట్‌వేర్ కన్సల్టెన్సీ సంస్థను కోరారు. ఆ వివరాలు అందితే ఎక్సైజ్ అధికారుల పాత్ర ఏ స్థాయిలో ఉందో స్పష్టమవుతుంది. అలానే ఏఏ వ్యక్తులకు ఈ మద్యం చేరిందన్నది కూడా బయటపడుతుంది. కానీ ఈ సమాచారం ఎక్సైజ్ అధికారులకు అందడం లేదు. దీంతో మద్యం కేసుల విచారణ కూడా ముందుకు సాగడం లేదు. అయితే గతంలో జిల్లాలో పనిచేసినప్పుడు ఆరోపణలు ఎదుర్కొన్న అధికారి ఇప్పుడు తెరవెనుక కీలకంగా వ్యవహరిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. వివరాలు బయటకు వస్తే తనకు ఇబ్బందని భావించిన సదరు అధికారి.. ఎలాగైనా ఈ కుంభకోణం నుంచి బయటపడాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు ఎక్సైజ్ శాఖలో చెప్పుకుంటున్నారు. కాగా ఈ కేసుల అంశంపై ఎక్సైజ్ సూపరిటెండెంట్ శ్రీనివాసులు నాయుడును వివరణ కోరగా అన్ని కోణాల్లో విచారణ జరుగుతున్నట్లు చెప్పారు. అవసరమైన డేటాను ఇవ్వాలని గతంలో పనిచేసిన కన్సల్టెన్సీ సంస్థను కోరామని, ఇంకా ఆ వివరాలు అందలేదని వెల్లడించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	118
స్కిన్ చికెన్	216
స్కిన్‌లెస్	240

కోడిగుడ్ల ధర (100): 570



మస్టర్లలో తప్పులుంటే చర్యలు : ఎంహెచ్‌వో

పారిశుధ్య కార్మికులను లెక్కకట్టే మస్టర్లలో తప్పులుంటే ఒప్పుకోనని ఎం హెచ్‌వో కనకాద్రి శానిటేషన్ అధికారులను హెచ్చరించారు. మంగళవారం రిత్విక్ ఎన్‌క్లేవ్ మస్టర్ పాయింట్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇక నుంచి ప్రతీ వారం మస్టర్ పాయింట్లను తానే స్వయంగా తనిఖీ చేసి లోపాలను గుర్తిస్తానని చెప్పారు. తప్పిదాలు వాటిల్లితే అక్కడిక్కడే చర్యలు తీసుకుంటామని చెప్పారు. డివిజన్ల, సచివాలయాల వారీగా పారిశుధ్య కార్మికుల లెక్క, సమయం కచ్చితంగా మస్టర్లలో ఉండాలని ఆదేశించారు.

- నెల్లూరు(సిటీ, ఆంధ్రజ్యోతి)

న్యూస్ బాక్స్

గ్రామీణ యువతకు కంప్యూటర్ శిక్షణ

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి) : గ్రామీణ యువత కోసం సీడాప్, త్రెడ్డి-ఐటీ సంస్థలు కంప్యూటర్ కోర్సులు, వృత్తి నైపుణ్య కోర్సులలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు త్రెడ్డి-ఐటీ నిర్వాహకుడు కే సునీల్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శిక్షణ సమయంలో భోజన, వసతి సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. శిక్షణ పూర్తయిన తరువాత సర్టిఫికెట్‌తో పాటు ఉద్యోగ అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు.

రౌడీ షీటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రౌడీ షీటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ ఎరుకల సేవా సంఘం రాష్ట్ర కన్వీనర్ నల్లగొండ్ల శివ పోలీసులను డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కొంత మంది రౌడీషీటర్లు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి హత్యపై చర్చించుకోవడం వెనుక కుట్రను బట్టబయలు చేయాలని కోరారు.

గిరిజనులను ఆదుకోవాలి

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి) : దగదర్తి మండల వెలుపోడు గ్రామ గిరిజనులను ఆదుకోవాలని యానాదుల హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్టు కార్యదర్శి పొట్లూరి శ్రీనివాసులు ఓ ప్రకటనలో అధికారులను కోరారు. ఆ గ్రామంలోని గిరిజన కాలనీకి మంచి నీటి వసతి, వీధి దీపాల సౌకర్యం లేవని తెలిపారు. దీనిపై కలెక్టర్‌కు అర్జీ ఇచ్చినా స్పందన కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు చొరవ చూపి గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

దంత చికిత్సలో 50 శాతం రాయితీ

● డాక్టర్ దివ్యారెడ్డి

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నగరంలోని డాక్టర్ జీ కొండారెడ్డి సూపర్ స్పెషాలి టీ డెంటల్ ఆసుపత్రిలో ప్రభుత్వ ఉపాధ్యాయులు, పెన్షనర్లు, జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు వైద్య చికిత్సల్లో 50 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు డాక్టర్ దివ్యారెడ్డి తెలిపారు. మంగళవారం జర్నలిస్టు భవన్‌లో ఆమె విలేకరులతో మాట్లాడారు. ఉచితంగా కన్సల్టేషన్, ఓపీజీ, ఎక్స్‌రే, రూట్ కెనాల్ ట్రీట్మెంట్ చేస్తామని చెప్పారు. ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు వారి పాఠశాల గుర్తింపు కార్డును తప్పనిసరిగా తీసుకుని వస్తే 50శాతం లభిస్తుందని తెలిపారు. ఈ అవకాశం ఈ నెల 6వతేదీ వరకు ఉంటుందని, సద్వినియోగించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో డాక్టర్ మనోజ్‌రెడ్డి పాల్గొన్నారు.

నేత్రదానం



బాలసుబ్రహ్మణ్యం (ఫైల్)

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పుల్లారెడ్డి నగర్‌కు చెందిన చీదెళ్ల బాల సుబ్రహ్మణ్యం (67) మంగళవారం మృతి చెందడంతో ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. వాసవి వనిత లెజెండ్ అధ్యక్షురాలు దుగ్గిశెట్టి హేమలత సహకారంతో ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి టెక్నీషియన్ సునీల్ ఆ నేత్రాలను సేకరించారు.

12 అడుగుల కొండచిలువ ప్రత్యక్షం

చేజర్ల, సెప్టెంబరు2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దొరువుపాడు గ్రామానికి చెందిన గంటా జనార్ధన్ ఇంటి వెనుక దాదాపు 12 అడుగుల కొండచిలువ ఉన్నట్లు గమనించారు. వెంటనే సమీపంలో ఉన్న ఆదురుపల్లి అటవీశాఖ చెక్‌పోస్ట్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో సిబ్బంది సలీం, జనార్ధన్‌రావు, రాహుల్ అక్కడకు చేరుకుని చాకచక్యంగా పామును పట్టుకుని సమీపంలో ఉన్న అటవీప్రాంతంలో వదిలిపెట్టారు.

డిగ్రీ విద్యార్థినికి ఎమ్మెల్యే కాకర్ల పరామర్శ

జలదంకి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న జలదంకికి చెందిన డిగ్రీ విద్యార్థిని కరిష్మాను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మంగళవారం పరామర్శించారు. విద్యార్థిని తల్లిదండ్రులు మాబాషా, నూర్జహాన్‌ల నుంచి ఆమె ఆరోగ్య విషయం తెలుసుకుని ప్రభుత్వం తరుపున వైద్యసహాయం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

భక్తిశ్రద్ధలతో పవిత్ర ప్రతిష్ఠ

● వైభవంగా రంగడి పవిత్రోత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో పవిత్రోత్స వాలు వైభవంగా జరుగుతున్నాయి. వీటిలో భాగంగా మంగళ వారం సాయంత్రం పవిత్ర ప్రతిష్ఠ జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథ స్వామికి తిరుమంజనం, అధివాసం, పవిత్ర సమర్పణ, మండల ఆరాధన, హోమాలు జరిగాయి. ఉభయకర్తలుగా పప్పు రామయ్య కుటుంబం వ్యవహరించింది. ఆలయ ఈవో ఆళ్ల శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు.



పవిత్రాలతో ఆలయ ప్రాకారోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

5న మిలాద్ ఉన్ నబీ

● నగరంలో జులూస్ ర్యాలీ



నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మహమ్మద్ ప్రవక్త జయంతి వేడుకను మిలాద్ ఉన్ నబీ పండుగగా ముస్లింలు ఈనెల 5న జరుపుకోనున్నారు. ఇది ఇస్లామ్ క్యాలెండర్‌లో మూడవ నెల. రబీ అల్ అవ్వల్ 12వతేదీన వస్తుంది. ఇందుకోసం జిల్లాలో ముస్లింలు మసీదు, పరిసరాలు శుభ్రం చేయడం, పవిత్ర ప్రార్థనలు, సేవా కార్యక్రమాలను వారం రోజుల ముందు నుంచే ప్రారంభించారు. ప్రవక్త మహమ్మద్ రబీ అల్ అవ్వల్ నెలలో 12వతేదీన మక్కాలో జన్మించారని ముస్లింల విశ్వాసం. ఈ సందర్భంగా ఆ రోజు నూతన వస్త్రాలు ధరించి ప్రార్థనలు చేస్తారు. గురువులు మహమ్మద్ ప్రవక్త బోధనలు వినిపిస్తారు.

కాగా, నెల్లూరు నగరంతోపాటు జిల్లా వ్యాప్తంగా అన్నీ పట్టణాలలో ప్రవక్త జన్మదిన వేడుకలు, జులూస్ ఊరేగింపులకు ముస్లింలు భారీ ఏర్పాట్లు చేసుకున్నారు. నగరంలో ఉదయం అన్నీ మసీదుల్లో ప్రార్థనలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు జరుగుతాయి. సాయంత్రం కోటమిట్ట అమీనియా మసీదు నుంచి మిలాద్ ఉన్ నబీ జులూస్ నగరోత్సవం జరుగుతుంది. నగరంలోని అన్నీ ముస్లిం సంఘాలు వారి ప్రాంతాల నుంచి ఊరేగింపుగా వచ్చి ప్రధాన జులూస్ ర్యాలీలో చేరుతారు.

ఘనంగా గణనాథుడి నిమజ్జనోత్సవం

సీతారామపురం,సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామాల్లో కొలువుదీరిన వినాయక విగ్రహాలు మంగళవారం నిమజ్జనానికి తరలాయి. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని రాజుగారి వీధిలో ఏర్పాటు చేసిన విగ్రహాల వద్ద లడ్డూ వేలంపాట నిర్వహించారు. అలాగే యువత ఉట్టి ఉత్సవంలో పాల్గొన్నారు. అనంతరం నిమజ్జనోత్సవం నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ వెంకట్రావు, ఎస్సై శివకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది విధులు నిర్వహించారు.

పోషకాహార ప్రాముఖ్యతను తెలియజేస్తాం

● 2,934 అంగన్‌వాడీ కేంద్రాల్లో మాసోత్సవాలు ● ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్



ఇంటర్వ్యూ...

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గర్భిణులు, బాలింతలు సరైన పౌష్టికాహారం తీసుకోకపోవటంతో అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. అవగాహన లేమి, ఇతర సమస్యల వల్ల వారికి సరైన పోషకాహారం అందటం లేదు. ప్రభుత్వం పోషకాహారం అందిస్తున్నా, వారు సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. ఈ క్రమంలో పోషకాహార ప్రాముఖ్యతను గర్భిణులు, బాలింతలకు పోషకాహార మాసోత్సవాల ద్వారా వివరిస్తున్నట్లు జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ హేనా సుజన్ తెలిపారు.

? పోషకాహార మసోత్సవాలు ఎప్పటి వరకు జరుగుతాయి.

! ఈ నెల 1వ తేదీన ప్రారంభమైన మాసోత్సవాలు 30వ తేదీ వరకు జరుగుతాయి. జిల్లాలోని 2934 అంగన్‌వాడీ కేంద్రాలు అన్నింటిలో ఈ కార్యక్రమం జరుగుతుంది.

? అంగన్‌వాడీల్లో ఎంత మంది పిల్లలు చదువుతున్నారు.

! అంగన్‌వాడీల్లో ఆరేళ్లలోపు చిన్నారులు 1,11,369 మంది చదువుతున్నారు. వీరిలో ఆరు నెలల నుంచి ఒక సంవత్సరంలోపు పిల్లలు 13,987 మంది, సంవత్సరం నుంచి 3 సంవత్సరాలలోపు పిల్లలు 50,965 మంది ఉన్నారు. మూడేళ్ల నుంచి 6 సంవత్సరాలలోపు పిల్లలు 39,706 మంది ఉన్నారు.

? జిల్లాలో గర్భిణీలు, బాలింతలు ఎంత మంది ఉన్నారు.

! గర్భిణులు 12,871 మంది, బాలింతలు 10,712 మంది ఉన్నారు. వీరందరికి పోషకాహారాన్ని అందచేస్తున్నాం.

? అవగాహనా కార్యక్రమాలు ఎలా ఉంటాయి.

! ముఖ్యంగా తల్లులకు అవగాహన కల్పిస్తాం. గర్భవతులకు, పిల్లలకు కూడా పోషకాహారం గురించి తెలియజేస్తాం.

? ఆహార తయారీ గురించి వివరిస్తారా...

! తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహారం గురించి తల్లులకు వివరిస్తాం. పోషక విలువలు కలిగిన ఆహార తయారీ, అందుకు అవసరమైన సరుకుల గురించి కూడా తెలియజేస్తాం.

? పోషణ్ మహ్ కార్యక్రమం ఎప్పుడు ప్రారంభిస్తారు.

! పోషణ్ మహ్ కార్యక్రమాన్ని ఈ నెల 12 నుంచి అక్టోబరు 11వ తేదీ వరకు నిర్వహిస్తాం. ఇందులో భాగంగా పలు ఆరోగ్య అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం. రక్తహీనతపై ప్రత్యేక శిబిరాలు ఉంటాయి. ఈ అం శాలన్నీ జన్ ఆందోళన్ డాష్‌బోర్డులో ఏరోజుకారోజు అప్‌లోడ్ చేయిస్తాం.

ఘనంగా పవర్ వాక్

● ఉప ముఖ్యమంత్రి పవన్ పుట్టినరోజు వేడుకలు ● సేవా కార్యక్రమాలు, సంబరాలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ పుట్టిన రోజు వేడుకలను జనసేన పార్టీ నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, అభిమానులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యాల యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. నాయకులు, వీరమహిళలు, అభిమానులు పెద్ద సంఖ్యలో రక్తదానం చేశారు. జీజీహెచ్ లోని గర్భిణులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేసి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, గునుకుల కిషోర్, లాయర్ శ్రీరామ్, పావుజెన్ని చంద్రశేఖర్‌రెడ్డి, జమీర్, కృష్ణారెడ్డి, రవి, తదితరులు పాల్గొన్నారు.



పవర్ వాక్‌లో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు



కేక్ కట్ చేస్తున్న రాష్ట్ర టిడ్కో చైర్మన్ అజయ్‌కుమార్, టీడీపీ నాయకులు గిరిధర్ రెడ్డి, విజయభాస్కర్ రెడ్డి తదితరులు

● జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ ఆధ్వర్యంలో నగరంలోని వీఆర్‌సీ సెంటర్ నుంచి గాంధీబొమ్మ సెంటర్ వరకు పవర్ వాక్ కార్యక్రమం నిర్వహించారు. అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్, టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి తదితరులు భారీ కేక్ కట్ చేసి అభిమానులకు పంచి పెట్టారు. పవన్ కల్యాణ్ సేవలు, ఆశయాలను కొనియాడారు.

● జనసేన పార్టీ నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు ఆధ్వర్యంలో జీజీహెచ్‌లో రోగులకు పండ్లు, రొట్టెలు, గ్లూకోజ్, దుప్పట్లు పంపిణీ చేశారు. పార్టీ కార్యాలయంలో భారీ కేక్‌ను కట్ చేశారు. ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, జనసేన పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్ గుడ్లూరు నాగరత్నం, జిల్లా కార్యదర్శి ఆలియా, నగర ప్రధాన కార్యదర్శి శనివారపు అజయ్‌బాబు, కార్యదర్శి సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించి సహకరించండి

● నగర కమిషనర్ నందన్



నెల్లూరు (సిటీ), సెప్టెంబరు 2,(ఆంధ్రజ్యోతి) : నగరం అభివృద్ధి చెందాలంటే ప్రజలందరూ సకాలంలో పన్నులు చెల్లించి సహ కరించాలని కార్పొరేషన్ కమిషనర్ నందన్ పిలుపునిచ్చారు. మంగళవారం కార్పొరేష న్‌లోని ఆయన చాంబరులో మీడియాతో మా ట్లాడారు. నగర ప్రజల ప్రయోజనార్థం రోడ్లు, డ్రైన్ల నిర్మాణం ముమ్మరంగా సాగుతోందని చెప్పారు. మొక్కల పెంపకం, విద్యుత్ దీపా లు, తాగునీటి పంపిణీ, పార్కుల అభివృద్ధి పనులు కూడా జరుగుతున్నాయని తెలిపారు. ఇవన్నీ నిరంతరం సాగుతుండాలంటే ప్రజలు పన్నులను సకాలంలో చెల్లించాలని కోరారు. దుబారా ఖర్చులను పూర్తి స్థాయిలో తగ్గించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. అంతకుముందు వెంగళరావు నగర్‌లోని అన్న క్యాంటీన్‌ను కమిషనర్ పరిశీలించారు. 17వ డివిజన్ పార్థసారథి నగర్‌లో పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. కాగా, ఏసీ సెంటర్‌లోని కేఏసీ కాంప్లెక్స్‌లో అద్దె బకాయిలు చెల్లించలేదని 5,6,9 నెంబర్ల దుకాణాలను కార్పొరేషన్ రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు.

వ్యవసాయ యంత్రాల వినియోగంపై మహిళలకు శిక్షణ


కందుకూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో వ్యవసాయ యంత్ర పరికరాల వినియోగంపై మహిళా రైతులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. కేవీకే, అనంతపురంలోని దక్షిణక్షేత్ర వ్యవసాయ యంత్రాల శిక్షణ, పరీక్షణసంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కందుకూరు ప్రాంతంలోని వివిధ గ్రామాల మహిళా రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిచికారి డ్రోన్లు, పవర్‌వీడర్లు, వివిధ రకాల నార్లు నాటే యంత్రాలు, విత్తనాలు విత్తే యంత్రాలు, వేరుశనగ కాయలు వలిచే యంత్రం, ఎరువులు, విత్తనాలు చల్లుకునే యంత్రాలపై అవగాహన కల్పించటంతో పాటు వాటి వినియోగంలో మెలకువలపై శిక్షణ ఇచ్చారు. కేవీకే శాస్త్రవేత్త వివేక్ కామత్, అనంతపురం నుంచి వచ్చిన శిక్షణ అధికారులు వెంకటరమణ, వెంకటేశ్, భాస్కర్, పలు స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న మహిళా రైతులు

విజయ పాల ఉత్పత్తిదారులకు ప్రోత్సాహకాలు

సంగం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగారెడ్డిపాళెం, అన్నారెడ్డిపాళెం విజయ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం ఆధ్వర్యంలో మంగళ వారం విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి పాల ఉత్పత్తిదారులకు ప్రోత్సాహక బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో విజయ పాల డెయిరీ ఎండీ పిసి కృష్ణమోహన్, వెంగా రెడ్డిపాళెం, అన్నారెడ్డిపాళెం పాల ఉత్పత్తి సహకార సంఘాల అధ్యక్షులు ఆనం వెంకట శేషారెడ్డి, బేతు సుబ్రహ్మణ్యం, సెక్రటరి రవి, డైరెక్టర్లు పాల్గొన్నారు.



పాల ఉత్పత్తిదారులకు బహుమతులు అందచేస్తున్న డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి

ప్రజలకు, రైతులకు అందుబాటులో ఉండండి

● సొసైటీ అధ్యక్షులకు గిరిధర్‌రెడ్డి సూచన

నెల్లూరు(సిటీ), సెప్టెంబరు 2,(ఆంధ్రజ్యోతి) : ప్రజలకు, రైతులకు అందుబాటులో ఉండి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని పీఏసీఎస్‌లకు ఇటీవల ఎన్నికైన చైర్మన్లు, డైరెక్టర్లకు టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి సూచించారు. మంగళవారం నగరంలోని రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో రూరల్లోని 6 సొసైటీల బాధ్యులతో ఆయన సమావేశం నిర్వహించారు. అర్హులైన రైతులకు రుణాలిచ్చి ప్రభుత్వపరంగా అండగా నిలవాలన్నారు. అనంతరం 24 కుటుంబాలకు రూ. 21 లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కార్యాలయ ఇన్‌చార్జి వేమిరెడ్డి సురేంద్ర రెడ్డి, నాయకుడు ఇందుపూరు శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోధనేతర కార్యక్రమాల బాధ్యతలు తప్పించండి : ఎస్‌టీయూ

నెల్లూరు(విద్య), సెప్టంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాల బాధ్యతలను తప్పించాలని ఎస్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని పలు పాఠశాలల్లో జరిగిన సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులకు పాఠాలు బోధించాల్సిన ఉపాధ్యాయులను పలు రకాల యాప్‌లు, ఆన్‌లైన్ పనులు, శిక్షణా తరగతులంటూ ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. నూతనంగా ప్రవేశ పెట్టిన మూల్యాంకన పత్రాలు ఉపాధ్యాయులకు అగ్ని పరీక్షగా మారాయన్నారు. వీటిని వెంటనే ఉపసంహరించి పాత పద్ధతిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. పీఆర్‌సీ ప్రకటించాలని, మధ్యంతర భృతి మంజూరు చేయాలని, ప్లస్‌టూ పాఠశాలల్లో ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అశోక్‌బాబు, ప్రధాన కార్యదర్శి కే నరసిం హం, సీహెచ్ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదులో ఎస్‌టీయూ నాయకులు

క్రాఫ్ట్ బజార్ ప్రారంభం

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని కస్తూరిదేవి విద్యాలయంలో చేనేత వస్త్ర, హస్త కళారూపాల ప్రదర్శన మంగళ వారం ప్రారంభమైంది. దేశం నలుమూలల నుంచి చేనేత కళాకారులు, హస్త కళాకారులు, తమ ఉత్పత్తులు అమ్ముకునేందుకు నెల్లూరు వచ్చారని ఈ క్రాఫ్ట్ బజార్ నిర్వాహకుడు ఎం శ్రీనివాస్ తెలిపారు. 70 స్టాల్స్ ఏర్పాటు చేశామని, ప్రతీరోజు ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు తెరచి ఉంటుందని పేర్కొన్నారు. ఇందులో చేనేత, ఖాదీ వస్త్రాలు, కలంకారీ, మంగళగిరి, గద్వాల్ చీరలు, జైపూర్ బెట్‌షీట్స్, వరంగల్ టవల్స్, కశ్మీర్ టాప్స్, బెంగాలీ కాటన్ చీరలు ఉన్నాయని తెలిపారు. హస్తకళా వస్తువులలో హైదరాబాద్ ముత్యాలు, కొండపల్లి బొమ్మలు, జైపూర్ చెప్పులు, ఫారంపూర్ కొయ్య వస్తువులు, రాజస్తాన్ గాజులు, ఇమిటేషన్ ఆభరణాలు, టెర్రకోట్, పింగాణీ వస్తువులు ఉన్నాయని, నగర వాసులు ఆదరించాలని కోరారు.



విద్యార్థులకు నిత్యావసరాల పంపిణీ

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వియానీ హోమ్‌లో ఆశ్రయం పొందుతున్న పేద విద్యార్థులకు వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు చింతల అమరేంద్రరెడ్డి మాట్లాడుతూ సంఘం ఉపాధ్యక్షుడు స్వర్ణ రమేష్ తల్లి జయలక్ష్మి వర్ధంతి సందర్భంగా విద్యార్థులకు టూత్‌పేస్ట్‌లు, బ్రష్‌లు, సబ్బులు, కొబ్బరి నూనె తదితర వస్తువులు అందచేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌర వాధ్యక్షుడు మేకల నరేంద్రరెడ్డి, ప్రధాన కార్యదర్శి పొన్నం రవిచంద్ర, మా జీ గవర్నర్ రాఘవేంద్రశెట్టి, ఎలెక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్య నాయుడు, సభ్యులు పాల్గొన్నారు.



విద్యార్థులకు వస్తువులను అందచేస్తున్న వాకర్స్

ఉదయగిరిని జిల్లా చేయాలి : జనసేన

ఉదయగిరి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అనాదిగా అభివృద్ధికి నోచుకోని మెట్ట ప్రాంతమైన ఉదయగిరిని జిల్లా చేయాలని మంగళ వారం డిప్యూటీ తహసీల్దారు షాజియాకు జనసేన పార్టీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నూతన జిల్లాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసినందున ఈప్రాంత స్థితి గతు లను పరిశీలించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఉదయగిరి అభివృద్ధి జిల్లా ఏర్పాటుతోనే సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు అల్లూరి రవీంద్ర, కిరణ్‌కుమార్, రవి, మహేష్, కేశవ్, సురేష్, మాల్యాద్రి పాల్గొన్నారు.



డిప్యూటీ తహసీల్దారుకు అర్జీ ఇస్తున్న జనసేన నాయకులు

పోలేరమ్మకు పొంగళ్లు

మండలంలోని మూసాయిపేటలో మంగళ వారం గ్రామదేవత పోలేరమ్మకు గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో పొంగళ్లు నిర్వహించారు. ముందుగా గ్రామవీధుల్లో ఊరేగింపు జరిపి ఆలయం వద్దకు చేరుకుని పొంగళ్లు పొంగించారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని పూజలు చేశారు.

హౌసింగ్ అవినీతిని సీఎం దృష్టికి తీసుకెళ్లండి

● ఎమ్మెల్యే సోమిరెడ్డికి బీజేపీ నాయకుడి వినతి

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పేదల పక్కా గృహాల నిర్మాణానికి కేంద్రం ఇస్తున్న నిధుల దుర్వినియోగంపై సీఎంవోకు ఇస్తున్న ఫిర్యాదులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకు వెళ్లాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని బీజేపీ నాయకుడు మిడతల రమేష్ కోరారు. ఆయన మంగళవారం సోమిరెడ్డిని కలిశారు. హౌస్ ఫర్ ఆల్ పథకం కింద కేంద్రం రూ.19వేల కోట్లు హౌసింగ్ కార్పొరేషన్‌కు కేటాయించిందని, రాష్ట్రంలో 3,47,226 గృహాల నిర్మాణ బాధ్యతను కాంట్రాక్టర్లకు అప్పగించిందన్నారు. అయితే 99 వేల గృహాలు పూర్తి చేసినట్లు ఫైనల్ బిల్లులు కాంట్రాక్టర్లకు చెల్లించారన్నారు. కానీ 98 వేల గృహాలు అసంపూర్తిగా నిర్మించినట్లు ఆరోపించారు. అవి నివాస యోగ్యంగా లేవని చెప్పారు. 91,555 గృహాలు బేస్‌మెంట్ లెవల్ లోనే ఆపేశారని పేర్కొన్నారు. వీటన్నింటిపై ప్రభుత్వం చర్యలు తీసుకునేలా చొరవ చూపాలని కోరారు.



యూరియా కోసం

రైతుల ఆందోళన

రైతుసేవా కేంద్రాల్లో యూరియా, ఇతరత్రా ఎరువులు అందుబాటులో ఉంచాలని మండలంలోని బండగానిపల్లి పంచాయతీ బిజ్జంపల్లి గ్రామంలో మంగళవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రైతు సంఘం నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ యూరియా కొరత రైతులను తీవ్రంగా వేధిస్తోందన్నారు. వ్యవసాయ పనులు వదులుకుని యూరియా కోసం రైతులు ప్రదక్షిణలు చేసినా ప్రయోజనం ఉండడం లేదన్నారు. అవసరమైన ఎరువులు అందుబాటులో లేక, పండించిన పంటలకు గిట్టుబాటు ధరల్లేక రైతులు వ్యవసాయాన్ని వదులుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. సమస్యను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

- ఉదయగిరి, ఆంధ్రజ్యోతి)

భక్తిశ్రద్ధలతో

తహలీల్ ఫతేహా

ముగిసిన దొరసానమ్మ గంధ మహోత్సవం



స్థానిక హజరత్ సయ్యద్ ఖాజారహమతుల్లా నాయబ్ రసూల్ సతీమణి హబీబా ఖాతున్(దొరసానమ్మ) గంధ మహోత్సవంలో భాగంగా మంగళవారం తహలీల్ ఫతేహా కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గాలోని సమాధులకు గంధ లేపనం చేశారు. అనంతరం ఖురాన్ పఠనం చేసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పలువురు భక్తులు కీర్తనలు ఆలపించారు. భక్తులకు ప్రసాదాలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంతో గంధమహోత్సవం ముగిసిందని నిర్వాహకులు తెలిపారు.

- ఏఎస్ పేట, (ఆంధ్రజ్యోతి)



ఆశా కార్యకర్తల సమావేశంలో సూచనలిస్తున్న జిల్లా మలేరియా అధికారి హుస్సేనమ్మ

మలేరియా నివారణకు చర్యలు

సంగం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో జిల్లాలో మలేరియా వ్యాధి ప్రబలకుండా ముందుస్తు చర్యలు చేపట్టినట్టు జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ పేర్కొన్నారు. మంగళవారం ఆమె స్థానిక ప్రాథమిక ప్రభుత్వ వైద్యశాలలో ఆశ డే సందర్భంగా ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో నీటి నిల్వల వల్ల దోమలు పెరిగి మలేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. దీంతో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఆశ కార్యకర్తలు నివాస గృహ పరిసరాల పరిశుభ్రతతోపాటు నీటి నిల్వ ఉండకుండా ప్రజలను చైతన్యం చేయాలని సూచించారు. జ్వరం రెండు, మూడు రోజులు ఉంటే వెంటనే స్థానిక ప్రాథమిక కేంద్రాలను సంప్రదించి పరీక్షలు చేయించుకో వాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి శ్రీనివాసులురెడ్డి, అశోక్, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పండక్కి వచ్చి పరలోకాలకు...

అదుపుతప్పి గేదెను ఢీకొన్న బైక్

యువకుడి మృతి



మస్తాన్‌బాబు(ఫైల్)

ఉదయగిరి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉన్న ఊరిలో ఉపాధి లేక కుటుంబ సమేతం గా పొట్ట చేతపట్టుకుని ఇతర ప్రాంతానికి వెళ్లి వినాయక చవితి పర్వ దినం సందర్భంగా స్వగ్రామానికి వచ్చి పరలోకాలకెళ్లిన సంఘ టన మంగళ వారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల మేరకు.. మండలంలోని మాసా యిపేట గ్రామానికి చెందిన పిడుగు మస్తాన్ బాబు(35)కు సీతారామపురం మండలం అయ్యవారిపల్లి పంచాయతీ గౌతం నగర్‌కి చెందిన వనజతో వివాహమైంది. మస్తాన్‌బాబు కటుంబ సమేతంగా బెంగళూరు వెళ్లి అక్కడ పీజీలో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించు కొని స్వగ్రామ మైన మాసాయిపేటకు కుటుంబ సమేతంగా వచ్చాడు. ఉత్సవం ముగిసిన అనంతరం మంగళవారం బెంగళూరు వెళ్లేందుకు రిజర్వేషన్ సైతం చేయించు కున్నాడు. ఈతరుణంలో భార్య, మరదలికి అనారోగ్యంగా ఉండడంతో మోటార్ బైక్‌పై ఉదయగిరికి వచ్చి వైద్యశాలలో చూపించి గ్రామంలో వదిలి పని నిమిత్తం తిరిగి ఉదయగిరికి వచ్చాడు. పని ముగిసిన అనంతరం అయ్యవారిపల్లికి వెళుతుండగా మండలంలోని సర్వరాబాదు గ్రామ సమీపంలోని 167-బీజీ జాతీయ రహదారిపై గేదెను ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. ఈప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందగా గేదే సైతం మృతిచెందింది. సమాచారం అందుకున్న ఉదయగిరి సీఐ వెంకటరావు, ఎస్ఐలు కర్నాటి ఇంద్రసేనారెడ్డి, అల శ్రీనులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి మృత దేహాన్ని ఉదయగిరి వైద్యశాలకు తరలించారు. మస్తాన్‌బాబు మృతిలో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించడంతో అక్కడ విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి ఒక పాప ఉంది.

పనితీరు మదింపు కమిటీని నియమిస్తూ

రాష్ట్ర జలవనరుల శాఖ ఉత్తర్వులు

అమరావతి, (ఆంధ్రజ్యోతి): కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఆదేశాల మేరకు నీటి పారుదల పనితీరు మదింపు కమిటీని నియమిస్తూ రాష్ట్ర జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రస్థాయిలో ఈటీ టూల్ కోర్ గ్రూప్‌ను జల వనరుల శాఖ ఏర్పాటు చేసింది. ఈ బృందంలో విజయవాడ సీడీవో చీఫ్ ఇంజనీరు, వ్యవసాయశాఖ డైరెక్టరు, హైదరాబాద్ జీఐఎస్ డైరెక్టర్, ఎన్ఐహెచ్ కాకినాడ సెక్షన్ ఆఫీసర్ ఉంటారు. ఈ అధికారుల బృందం.. సీడబ్ల్యూసీకు, ప్రపంచ బ్యాంకుకు రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాల తీరులను ఎప్పటికప్పుడు వివరిస్తుంది.

నేలబావుల రేడు..

తిక్కవరప్పాడు!

క్రమంగా తగ్గుతున్న వర్షపాతం కారణంగా దాదాపు అన్ని చోట్లా భూగర్భ జలాలు అడుగంటి పోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. నడివేసవిలో 150 నుంచి 200 అడ్డుగుల లోతు ఉన్న బోర్లలో కూడా చుక్క నీరు రాక పంటలు ఎండి పోతున్నాయి. అయితే మండలంలోని తిక్కవరప్పాడు పంచాయతీలోని తిక్కవరప్పాడు, గొట్లపాళెం గ్రామాల్లో మాత్రం పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంటుంది.

- వెంకటాచలం (ఆంధ్రజ్యోతి)

- రెండు గ్రామాల పరిధిలో 500 నేలబావులు
- తడి ఆరదు.. పంట ఎండదు..
- సర్వేపల్లి రిజర్వాయరు మాకు వరం
- తిక్కవరప్పాడు, గొట్లపాళెం గ్రామస్థుల హర్షం



తిక్కవరప్పాడు పొలాల్లోని నేల బావి

దాదాపు అన్ని ఇళ్లల్లోనూ, పొలాల్లోనూ నేల బావులుంటాయి. అదే ఈ పంచాయతీ విశిష్టత. తిక్కవరప్పాడు పంచాయతీలోని తిక్కవరప్పాడు, గొట్లపాళెం గ్రామాల్లో సుమారు 500 లకుపైగా గడపలుంటాయి. దాదాపు 3 వేల మంది జనాభా నివసిస్తుంటారు. ఇందులో 250 కుటుంబాలకు వ్యవసాయమే జీవనాధారం. మిగిలినవారు వ్యవసాయ కూలీలుగానూ, ఇతర పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రెండు గ్రామాలకుగాను మూడు చెరువులుండగా సుమారు 900 ఎకరాల వ్యవసాయ భూములున్నాయి. వరి ప్రధానమైన పంట కాగా మిరప తక్కువ విస్తీర్ణంలో సాగవుతుంది. అలాగే ఇతర రకాల కూరగాయలు, ఆకు కూరలు కూడా పండిస్తుంటారు. ఈ రెండు గ్రామాల్లోని ఇళ్లల్లో సుమారు 350కి పైగా నేల బావులుంటాయి. అదే విధంగా పొలాల్లో సుమారుగా 120కి పైగా నేల బావులుంటాయి. ఏ బావి చూసినా 24 నుంచి 30 అడుగులకు మించి లోతు ఉండదు. అయితే ప్రతి బావిలోనూ వేసవిలో తప్ప మిగతా రోజుల్లో నీరు చేతికి అందే విధంగా ఉంటుంది.

● 300 ఎకరాలు సస్యశ్యామలం

ఈ బావుల వద్ద ఆయిల్ ఇంజన్లు, విద్యుత్ మోటార్లు పెట్టి నీటిని రైతులు తమ పొలాలకు తరలిస్తుంటారు. ఒక్కో బావి కింద రెండెకరాల చొప్పున రెండు గ్రామాల్లోనూ సుమారు 300 ఎకరాల వరకు సాగవుతుంది. ఇందులో 50 ఎకరాల వరకు మిరప, కూరగాయలు, ఆకుకూరలు, మిగిలిన విస్తీర్ణంలో వరి సాగు చేస్తారు. అయితే వేసవిలో మాత్రం బావుల్లో నీటిమట్టం తగ్గుతుంది. కాబట్టి ఏడాదికి ఒక పంటే సాగు చేస్తుంటారు. ఈ రెండు గ్రామాల్లోని ఇళ్లల్లోని బావుల్లో కూడా ఇదే తరహాలో నీరు ఉంటుంది. వేసవిలో కూడా గ్రామస్థులు ఈ బావుల ఆధారంగా కూరగాయలు, ఆకు కూరలు సాగు చేస్తుంటారు. ఎర్ర గులక నేలలుండే ఈ గ్రామంలో నీరు పుష్కలంగా లభిస్తుండడం తమ అదృష్టమని గ్రామస్థులు చెబుతున్నారు. అయితే గ్రామ పొలాలను ఆనుకుని సర్వేపల్లి రిజర్వాయరు, పడమటి వైపున కనుపూరు చెరువు ఉండడం వల్ల బావుల్లో నీరు నిత్యం ఉంటుందని కొందరు గ్రామస్థులు చెబుతుంటారు. అయితే ఈ బావులు 100 ఏళ్ల క్రితం నుంచే గ్రామాల్లో సాగు, తాగు నీటిని అందిస్తున్నాయ ని వృద్ధులు చెబుతున్నారు. ఈ బావుల వల్ల తిక్కవరప్పాడు గ్రామంలో ఎప్పుడూ పంటలు ఎండిన దాఖలాలు లేవు. అదే విధంగా గ్రామస్థులు కూడా తాగు నీటికి ఇబ్బంది పడడం లేదు.



ఓ ఇంట్లో తవ్వుకుని ఉన్న నేలబావి

సర్వేపల్లి రిజర్వాయరు వల్లనే నీరు



తిక్కవరప్పాడు పంచాయతీకి సమీపంలో సర్వేపల్లి రిజర్వాయరు ఉంది. ఇందులో ఏడాది పొడవునా నీటిని నిల్వ చేస్తుంటారు. కనుపూరు చెరువు గ్రామం కన్నా ఎత్తులో ఉంది. అందు వల్ల గ్రామంలోని నేలబావుల్లో నీరు పుష్కలంగా ఉంటోంది. బావులు ఎక్కువ లోతు తవ్వాల్సిన అవసరం ఉండదు. 30 అడుగుల్లోనే స్వచ్ఛమైన నీరు లభిస్తుంది. ఏడాది పొడవునా బావుల్లో నీరు పుష్కలంగా ఉంటున్నందువల్ల పంటలు ఎండవు. అందు వల్ల రైతులు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి అవకాశం కలుగుతోంది. ప్రతీ ఏటా పంటలు ఖచ్చితంగా పండుతున్నాయి.

- దొడ్డక మురళీమోహన్, తిక్కవరప్పాడు

ఊహ తెలిసిన నాటి నుంచే నేల బావులున్నాయి



తిక్కవరప్పాడు, గొట్లపాళెం గ్రామాల్లో నా ఊహ తెలిసిన నాటి నుంచే ఇళ్లు, పొలాల్లో నేల బావులున్నాయి. మొదట్లో వీటి సంఖ్య చాలా పరిమితంగా ఉండేది. ఆ తర్వాత మిగిలిన వారు కూడా బావులు తవ్వుకున్నారు. బావుల తవ్వకం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. చెరువుల కింద ఉన్న విస్తీర్ణంలో ఒక వంతు మెట్ట భూములున్నాయి. వీటికి చెరువుల నీరు అంతగా అందుబాటులో ఉండదు. అందువల్ల రైతులు బావులు తవ్వుకోవడానికి ప్రాధాన్యత ఇచ్చారు. తక్కువ లోతులో నీరు లభిస్తుండడం వల్ల బావి తవ్వే ఖర్చు కూడా తగ్గుతుంది. దీంతో క్రమంగా బావులు తవ్వుకునే వారి సంఖ్య పెరిగింది.

- బోయపాటి సుధాకర్, తిక్కవరప్పాడు

వెంకటాచలం సర్పంచి చెక్‌పవర్ రద్దుకు నోటీసు

వెంకటాచలం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వెంకటాచలం గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగం, అక్రమాలపై సర్పంచి చెక్కు పవర్‌ను ఎందుకు రద్దు చేయకూడదో వారంలోగా వివరణ ఇవ్వాలంటూ మంగళవారం డీపీవో శ్రీధర్‌రెడ్డి షోకాజు నోటీసులు జారీ చేశారు. వెంకటాచలం సర్పంచి మందల రాజేశ్వరి అధికారాన్ని అడ్డంపెట్టుకుని నిధులు దుర్వినియోగం చేయడంతోపాటు అక్రమాలకు పాల్పడ్డారని టీడీపీ నేత సండి రమేష్‌తో పాటు గ్రామస్థులు డీపీవోకు ఫిర్యాదు చేశారు.

ఈక్రమంలో అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టడంతోపాటు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. 2021 నుంచి 2025 సంవత్సరం వరకు జరిగిన లావాదేవీల్లో 14వ, 15వ ఆర్థిక సంఘం నిధులతోపాటు సాధారణ నిధులు దుర్వినియోగం చేయడాన్ని గుర్తించారు. సర్పంచితో సహా పంచాయతీలో పని చేసిన ప్రత్యేక అధికారి, కొందరు పంచాయతీ కార్యదర్శులను కూడా బాధ్యులుగా ఉన్నారని విచారణలో తేల్చారు. సర్పంచి రాజేశ్వరి నిబంధనలకు విరుద్ధంగా తన భర్త, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్యను కాంట్రాక్టర్‌గా చూపించి వివిధ గ్రాంట్‌ల నుంచి తన భర్త అకౌంట్‌కు రూ.81.42,220, లబ్ధిదారులు కానీ వారి అకౌంట్‌కు రూ.4.81.268, డేటా ఎంట్రీ ఆపరేటర్ అకౌంట్‌కు రూ.1.84.668, గతంలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శి కే శ్రీనివాస్‌రావు కుమారుడు కే వంశీవెంకట్ అకౌంట్‌కు రూ.13.94.527, వివిధ పంచాయతీ కార్యదర్శుల అకౌంట్లకు రూ.5.56.258 జమ చేసి ఉన్నారు. గ్రాంట్ల నిధులను దుర్వినియోగం చేయడంతోపాటు అక్రమాలకు పాల్పడినట్టు వచ్చిన ఫిర్యాదుల మేరకు స్పందించిన డీపీవో ప్రత్యేక విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. ఇటీవల ఆ కమిటీ అక్రమాలపై విచారణ చేపట్టి నివేదికను డీపీవోకు సమర్పించింది. ఈ నివేదికపై డీపీవో స్పందించి, వారంలోగా చెక్ పవర్ ఎందుకు రద్దు చేయకూడదో వివరణ ఇవ్వాలంటూ సర్పంచికు నోటీసులు జారీ చేశారు. వివరణ ఇవ్వకుంటే చెక్‌పవర్ రద్దుతో పాటు ఏపీపీఆర్ యాక్ట్‌లోని నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని నోటీసులో పేర్కొన్నారు.

రేపు బొప్పరాజు రాక

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు గురువారం నెల్లూరుకు వస్తున్నారని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తహసీల్దార్లు, అమరావతి సంఘ సభ్యులతో ఆయన సమావేశం ఏర్పాటు చేస్తారని తెలిపారు.

ఇంకా నియంతలానే

జగన్‌రెడ్డి!

● మాజీ సీఎంపై సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి ఫైర్



నెల్లూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : 'పులివెందుల జడ్పీటీసీని గెలిపించుకోలేని మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డిని కలవాలంటే ఎంట్రీపాస్ ఉండాలంట! సొంత నియోజకవర్గం, సొంత మండల ప్రజలు కలవాలంటే కూడా పాస్ తీసుకోవాలంట! ఇవన్నీ జగన్‌రెడ్డి నియంతపోకడలకు నిదర్శనం. గత ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా జగన్‌రెడ్డి ఇంకా నియంత పోకడల నుంచి బయటకు రావడం లేదు' అంటూ టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం నెల్లూరులోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దమ్ము, ధైర్యం ఉంటే వైసీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటూ సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. ప్రజలు ఇవ్వని ప్రతిపక్ష హోదా కోసం ఎన్నిసార్లు అడుక్కుంటారంటూ ఎద్దేవా చేశారు. 'అప్పట్లో ఓ మహిళ నుంచి పార్టీని కాపాడుకునేందుకు అందరం కలిసి ప్రజాస్వామ్యయుతంగా చంద్రబాబును ఎన్నుకున్నాం. ఈ రోజుకీ ప్రజలు చంద్రబాబు నాయకత్వంలోని టీడీపీని ఆదరిస్తూ గెలిపించుకుంటున్నారు. వెన్నుపోటు అయితే ప్రజలు ఆదరిస్తారా..? మీరు చిన్నాయన వివేకానందరెడ్డిపై గొడ్డలి పోటు వేసి, ఆ నెపాన్ని మాపై నెట్టి 2019 ఎన్నికల్లో గెలిచారు. ప్రజలు అంతా గ్రహించాకే మిమ్మల్ని 11 సీట్లకు పరిమితం చేశారు. ఇప్పటికైనా కొంచెం కాకపోతే కొంచెమైనా బుద్ధితో మాట్లాడాలి' అంటూ వైసీపీ నేతలకు సోమిరెడ్డి హితవు పలికారు. కూటమి ప్రభుత్వంలో ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు.

ఆయుర్వేదానికి అందలం

- ప్రాచీన వైద్యానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం
- జిల్లాలో 8 ఆసుపత్రులు వెల్‌నెస్ సెంటర్లుగా మార్పు
- వైద్యులు, సిబ్బంది నియామకానికి అనుమతులు
- విలువైన పంచకర్మ చికిత్సలూ అందుబాటులోకి

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రాచీనమైన ఆయుర్వేద వైద్యానికి పూర్వ వైభవం కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఆరోగ్య కేంద్రాల అభివృద్ధితో పాటు వైద్యులు, సిబ్బంది నియామకానికి శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలోనే జిల్లాలో ప్రస్తుతం ఉన్న 25 ఆయుర్వేద ఆసుపత్రుల్లో ఎనిమిదింటిని అత్యాధునిక వెల్‌నెస్ కేంద్రాలుగా తీర్చిద్దాలని సంకల్పించింది. నెల్లూరు నగరం, డమ్మాయిపాళెం, జలదంకి, చిరమన, తోటపల్లి గూడూరు, సిద్దనకొండూరు, తెల్లపాడు, గండవరం ఆయుర్వేద ఆసుపత్రుల్లో అన్ని రకాల వైద్య చికిత్సలు అందించేలా అభివృద్ధి చేయనున్నారు. వాటిలో యోగా కేంద్రాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు.

అందుబాటులోకి పంచకర్మ చికిత్సలు

ఆయుర్వేద వైద్యంలో పంచకర్మ చికిత్సలు కీలకమైనవి. వేల రూపాయల విలువ చేసే ఈ చికిత్సలు కూడా జిల్లాలోని ఆసుపత్రుల్లో అందుబాటులోకి వచ్చాయి. నెల్లూరులోని ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రిలో కాళ్లు, కీళ్లు, మెడ నొప్పులు, వెన్నుముఖ నొప్పుల సమస్యలు, పక్షవాతం వంటి వ్యాధులకు చికిత్స చేస్తున్నారు. ఇక్కడ ప్రతి రోజూ 20 మంది వరకు పంచకర్మ చికిత్స చేయించుకుంటున్నారు. సిద్దనకొండూరు, డమ్మాయిపాళెం, తోటపల్లి గూడూరు ఆసుపత్రుల్లోనూ ఈ చికిత్సలు అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.



మూలాపేటలోని ఆయుర్వేద ఆసుపత్రి

ఆదరణ పెరుగుతోంది



నెల్లూరులోని ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రిలో పంచకర్మ చికిత్సలు అందిస్తున్నాం. ఆయుర్వేదానికి ప్రజలలో మంచి ఆదరణ ఉండటంతో ఇక్కడికి ప్రతిరోజూ 70 మంది వరకు వ్యాధిగ్రస్తులు వస్తున్నారు. వారికి అవసరమైన మందులు అందిస్తున్నాము.

- డాక్టర్ సుధారాణి, ప్రభుత్వ ఆయుర్వేద వైద్య నిపుణులు

కేరళ అర్బన్ కాన్‌క్లేవ్‌కు మున్సిపల్ మేయర్లు

అమరావతి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కేరళని కోచిలో ఈ నెల 12 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించనున్న కేరళ అర్బన్ కాన్‌క్లేవ్-2025కు హాజరయ్యేందుకు పలువురు మున్సిపల్ మేయర్లను, కమిషనర్లను ఎంపిక చేస్తూ రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. కేరళ ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగే ఈ కాన్‌క్లేవ్‌కు గ్రేటర్ విశాఖ మేయర్ పి.శ్రీనివాసరావు, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కోవెలమూడి రవీంద్రతోపాటు సీడీఎంఏ, విజయవాడ మున్సిపల్ కమిషనర్, గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, హిందూపూర్ మున్సిపాలిటీ కమిషనర్, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌లు హాజరు కానున్నారు.



రాజుపాళెం వద్ద పెన్నానదిలో లారీకి ఇసుక లోడ్ చేస్తున్న యంత్రం

నిబంధనలకు విరుద్ధంగా

యంత్రాలతో ఇసుక తవ్వకాలు

● పెన్నానది లోపలికి రోడ్డు ఏర్పాటు

కలువాయి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుపాళెం సమీపంలోని పెన్నా నదిలో నిబంధనల ప్రకారం మానవశక్తితో ఇసుక తవ్వకాలు జరగాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా రెండు రోజులుగా యంత్రాలతో ఇసుక తవ్వి భారీ వాహనాలతో తరలిస్తున్నారు. ఇసుకను తరలించేందుకు ఏకంగా నది లోపలికి రోడ్డు ఏర్పాటు చేశారు. మండలంలోని రాజుపాళెం దగ్గర పెన్నానదిలో పూడిక తొలగింపునకు అధికారులు ఇటీవల టెండర్లు నిర్వహించి అనుమతులు మంజూరు చేశారు. అయితే నిబంధనల ప్రకారం ఇక్కడ మానవ శక్తితో పూడిక తీసి స్టాక్ యార్డ్‌కు తర లించి అక్కడ నుంచి ఇసుక విక్రయాలు చేయాల్సి ఉంది. కాగా, ఇక్కడ నదిలో నిబంధనలకు నీళ్లు వదిలి యంత్రాలతో ఇసుక తవ్వి భారీ వాహనాలతో బయటకు తరలిస్తుండడంతో పేరుకేనా నిబంధనలు అంటూ విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

యువతి అదృశ్యం

నెల్లూరు రూరల్, (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ధనలక్ష్మీపురంలో నివాసముంటున్న దామరమడుగు అఖిల (18) అనే యువతి అదృశ్యమైనట్లు మంగళవారం కేసు నమోదు చేశామని రూరల్ సీఐ గుంజి వేణు తెలిపారు. ఆయన అందించిన వివ రాల మేరకు... వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదట సంవత్సరం చదువుతున్న అఖిల గత నెల 25వ తేదీ నుంచి కనపడటం లేదు. ఎంత వెతికినా ఫలితం లేనందున ఆమె తండ్రి శ్రీనివాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముత్తుకూరుకు చెందిన హర్షపై అనుమానం ఉందని, అఖి లను తనకు ఇచ్చి పెళ్లిచేయాలని ఇటీవల హర్ష కోరాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ఘనంగా పోలేరమ్మకు పొంగళ్లు

ఉదయగిరి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాసాయిపేట గ్రామంలో మంగళవారం గ్రామదేవత పోలేరమ్మకు గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో పొంగళ్లు నిర్వహించారు. ఈ సందర్భంగా పొంగళ్ల సామగ్రితో గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని పొంగళ్లు నిర్వహించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక పూజలు చేశారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 9978
వెండి కిలో ధర	రూ. 126000
వెండి ఒక గ్రాము	రూ. 129.00

న్యూస్ బాక్స్

కిడ్నీ రోగులకు ఆర్థిక సాయం



రోగికి ఆర్థిక సాయం చేస్తున్న నాయకులు

అనంతసాగరం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అగ్రహారంలో మంగళవారం వైయస్సార్ వర్ధంతి సందర్భంగా విగ్రహానికి నాయకులు పూల మాల లు వేసి నివాళులు అర్పించారు. అనంతరం దాత అక్కులరెడ్డి భాస్కర్‌రెడ్డి స్థానికంగా ఇద్దరు కిడ్నీ రోగులకు రూ. 15 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈకార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ పిచ్చిరెడ్డి, సర్పంచ్ లక్ష్మీదేవి, నార సింహారెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవనం అప్పగించాలి

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆండ్రావారిపల్లి ఎస్సీ కాలనీ సమీపంలో నిర్మించిన కమ్యూనిటీ భవనాన్ని తమకు అప్పగించాలని మంగళవారం కాలనీవాసులు ఎంపీడీవో గోపీశ్రీనివాస్, సర్పంచు దిలీప్‌కుమార్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆ భవనాన్ని కుల ప్రయోజనాలకు సంబంధించిన సమావేశాలు, అవగాహన సదస్సులు, ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణకు నిర్మించడం జరిగిందన్నారు. అయితే గత కొంత కాలంగా ఓ కుటుంబీకులు భవనంలో నివాసం ఉంటూ వ్యక్తిగతంగా వినియో గించుకుంటున్నారన్నారు. ఖాళీచేయమని పలుమార్లు హెచ్చరించినప్పటికీ ఫలితంలేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా భవనాన్ని ఖాళీ చేయించి తమకు అప్పగించాలని కోరారు.

ఇన్‌చార్జి ఆర్టీసీ డీఎం నియామకం

ఉదయగిరి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపో ఇన్‌చార్జి మేనేజర్‌గా రమేష్‌కుమార్‌ను నియమిస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు అసిస్టెంట్ మేనేజర్ నాగభూషణం మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. త్వరలో బాధ్యతలు చేపడతారన్నారు.

వైద్యులు, సిబ్బంది పోస్టులు భర్తీచేయాలి

ఉదయగిరి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం రూ.5.75 కోట్ల నిధులు మంజూరు చేయడం హర్షణీయమని, కానీ వైద్యశాలలో వైద్యుల కొరతతో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందడంలేదని ఉదయగిరి డెవలప్‌మెంట్ ఫోరం ప్రతినిధులు షేక్‌ఎండీ ఖాజా, వీ శ్రీరామచంద్రమూర్తి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వైద్యశాలలో ఖాళీగా ఉన్న వైద్యులు, సిబ్బంది పోస్టులు భర్తీచేసి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందేలా చూడాలని వారు కోరారు.

విజయ పాల ఉత్పత్తిదారులకు ప్రోత్సాహకాలు



పాల ఉత్పత్తిదారులకు బహుమతులు అందచేస్తున్న కొండ్రెడ్డి రంగారెడ్డి

సంగం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగారెడ్డిపాళెం, అన్నారెడ్డిపాళెం విజయ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి పాల ఉత్పత్తిదారులకు ప్రోత్సాహక బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో విజయ పాల డెయిరీ ఎండీ పిసి కృష్ణమోహన్, వెంగారెడ్డిపాళెం, అన్నారెడ్డిపాళెం పాల ఉత్పత్తి సహకార సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

మండల ఇన్‌చార్జి విద్యాశాఖ అధికారిగా ఇందిర

చేజర్ల, సెప్టెంబరు2 (ఆంధ్రజ్యోతి) : మండల ఇన్‌చార్జి విద్యాశాఖ అధికారి-1గా జి ఇందిర మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయ సంఘాల నేతలు ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు.

12 అడుగుల కొండచిలువ ప్రత్యక్షం

చేజర్ల, సెప్టెంబరు2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దొరువుపాడు గ్రామానికి చెందిన గంటా జనార్ధన్ ఇంటి వెనుక దాదాపు 12 అడుగుల కొండచిలువ ఉన్నట్లు గమనించారు. వెంటనే సమీపంలో ఉన్న ఆదురుపల్లి అటవీశాఖ చెక్‌పోస్ట్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో సిబ్బంది సలీం, జనార్ధన్‌రావు, రాహుల్ అక్కడకు చేరుకుని చాక చక్యంగా పామును పట్టుకుని సమీపంలో ఉన్న అటవీప్రాంతంలో వదిలిపెట్టారు.

మంచి మనసున్న వ్యక్తి పవన్‌కల్యాణ్

● జన్మదిన వేడుకల్లో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్



జలదంకిలో జరిగిన పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్

జలదంకి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మంచి మనసున్న వ్యక్తి అని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. మంగళవారం జలదంకిలో పవన్ అభిమానులు నిర్వహించిన జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని భారీ కేక్‌ను కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ అభిమానులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సోమశిలప్రాజెక్ట్ వైస్‌చైర్మన్ పీ.మధుమోహన్‌రెడ్డి, జనసేన నాయకులు కొట్టే వెంకటేశ్వర్లు, నిమ్మలపల్లి రామ్‌చైతన్య తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానం కన్నా మిన్న

● **కలిగిరి:** రక్తదానం ప్రాణదానం కన్నా మిన్న అని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో జరిగిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. జన సైనికులు రక్తదానం చేయడం గొప్ప విషయంగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు శివ, దిలీప్‌కుమార్, సురేష్, సునీల్, కార్యకర్తలు, రక్తదాతలు పాల్గొన్నారు.

●**దుత్తలూరు(ఉదయగిరి):** దుత్తలూరు సెంటర్‌లో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలను జన సైనికులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ జనసేన పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కొట్టె వెంకటేశ్వర్లు, జనసేన, టీడీపీ నాయకులతో కలిసి కేక్ కట్‌చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ప్రయాణికుల సౌకర్యార్థం కుర్చీ బల్లలను వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనేసన నాయకులు పాల్గొన్నారు.

●**ఆత్మకూరు:** పట్టణంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మకూరు జనసేన పార్టీ ఇన్‌చార్జి నలిశెట్టి శ్రీధర్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు దుప్పట్లు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటసుబ్బానాయుడు, బీజేపీ నాయకులు కె సుధాకర్‌రెడ్డి జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

●**ఉదయగిరి :** స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలను జనసైనికులు ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా వైద్యశాలలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం రోగులకు రొట్టెలు, దుప్పట్లు పంపిణీ చేయడంతోపాటు సీతారామపురానికి చెందిన జనసేన వీర మహిళ శ్రీదేవికి రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొట్టే వెంకటేశ్వర్లు, వైద్యులు ప్రశాంత్, రాగూర్, జనసేన పార్టీ నాయకులు అల్లూరి రవీంద్ర, సురేంద్రరెడ్డి, కిరణ్, రసూల్, రవి, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

●**ఉదయగిరి రూరల్ :** మండలంలోని గండిపాళెం బస్టాండ్ సెంటర్‌లో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. భారీ కేక్ కట్‌చేసి స్వీట్లుపంచి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు చైర్మన్ అడుసుమల్లి వెంకట సుబ్బయ్య, మాజీ ఎంపీటీసీ అడుసుమల్లి వెంకటేశ్వర్లు నాయకులు రెడ్డిబత్తిన నరసింహారావు, మచ్చా వెంకటేశ్వర్లు, షేక్ ఇమ్రాన్, రెడ్డిబత్తిన సునీల్, కలవకూరి వెంకటేష్, యాసిన్, వృద్వీ, గొల్లపల్లి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

●**కలువాయి:** ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను కలువాయిలో జనసేన నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. గ్రామదేవత కలువాయమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు పెరంకొండ మనోహర్, పువ్వాడి నరేష్, ప్రవల్లిక, వెంకటపతి, రాజేష్, రవిచంద్ర, హరి, గణేష్, నరేంద్ర, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

●**సీతారామపురం:** పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలను జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ మెంబర్ భోగినేని కాశీరావు ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జనసేనపార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పార్టీ కార్యకర్తలు, అభిమానులకు పంచిపెట్టారు. ఈకార్యక్రమంలో మండల టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, సొసైటీ అధ్యక్షుడు రాజశేఖర్, జనసేన మండల నాయకుడు భోగినేని కాశీరత్తయ్య (గాంధీ), పిడుగు రమేష్, వీకాష్ బాబు, బూత్ ఇన్‌చార్జి తోట మాల్యాద్రి పాల్గొన్నారు.

●**చేజర్ల:** మండల కేంద్రమైన చేజర్లలో జనసేన పార్టీ నాయకుడు షేక్‌నజీర్ ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం పవన కల్యాణ్ జన్మదిన వేడుకలను నిర్వహించి రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన పార్టీ సీనియర్ నాయకుడు చదలవాడ హరీష్, ఏఎస్ పేట పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ అక్బర్ బాష చేజర్ల మండల జనసైనికులు, అభిమానులు పాల్గొన్నారు.

●**ఏఎస్‌పేట:** పవన్ కల్యాణ్ జన్మదినం సందర్భంగా మంగళవారం జనసేన నాయకులు నాయబ్‌రసూల్ దర్గాలో ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో కేక్ కట్‌చేసి రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకులు చదలవాడ హరీష్, షేక్ నజీర్, మండల అధ్యక్షుడు సయ్యద్ అక్బర్, జనసేన నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

ఘనంగా గణనాథుడి నిమజ్జనోత్సవం



సీతారామపురంలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు

సీతారామపురం,సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామాల్లో కొలువుదీరిన వినాయక విగ్రహాలు మంగళవారం నిమజ్జనానికి తరలాయి. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని రాజుగారి వీధిలో ఏర్పాటు చేసిన విగ్రహాల వద్ద లడ్డూ వేలంపాట నిర్వహించారు. అలాగే యువత ఉట్టి ఉత్సవంలో పాల్గొన్నారు. అనంతరం నిమజ్జనోత్సవం నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ వెంకట్రావు, ఎస్సై శివకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది విధులు నిర్వహించారు.

ఉదయగిరిలో వర్షం

ఉదయగిరి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ప్రాంతంలో మంగళవారం రాత్రి ఓ మోస్తరు వర్షం కురిసింది. వర్షంతో మురుగు కాలువలు పొంగిపొర్లడంతో చెత్తాచెదారం రోడ్లపై చేరింది. దీంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు. ఈ వర్షం ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలకు అనుకూలంగా ఉంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

వైఎస్సార్‌కు ఘన నివాళి



ఉదయగిరిలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, నాయకులు

ఉదయగిరి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా మంగళవారం మండల వైసీపీ కన్వీనర్ కొండా రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక వైఎస్ఆర్ సర్కిల్ వద్దగల విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, జడ్పీటీసీ మోడి రామాంజనేయులు, మాజీ ఎంపీపీ చేజర్ల సుబ్బారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ షేక్ అలీఅహ్మద్, వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● **ఆత్మకూరు:** దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా మంగళవారం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ చిల్లూరు ఆదిశేషయ్య ఆధ్వర్యంలో మేకపాటి గౌతమ్‌రెడ్డి మెమోరియల్ మున్సిపల్ బస్టాండ్ కాంప్లెక్స్ ఆవరణలోని డాక్టర్ వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మున్సిపల్ విభాగం జనరల్ సెక్రటరీ అల్లారెడ్డి ఆనందరెడ్డి, పట్టణ అధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ సెక్రటరీ కొండా వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

● **కలువాయి:** కలువాయిలో జడ్పీటీసీ బి అనిల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక బస్టాండులోని వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో వైసీపీ మండల పార్టీ అధ్యక్షుడు మాకిరెడ్డి కృష్ణారెడ్డి, ఎంపీపీ ఆర్ లక్ష్మీదేవి, సర్పంచు పెంచలమ్మ పాల్గొన్నారు.

● **సంగం:** వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా వైసీపీ శ్రేణులు స్థానిక చెక్‌పోస్టు సెంటర్‌లో ఉన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● **సీతారామపురం:** మండల కేంద్రంలో వైఎస్ఆర్ వర్ధంతి నిర్వహించారు. వైసీపీ నాయకులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చింతంరెడ్డి సుబ్బారెడ్డి, ఎంపిటిసి పీ.సి అల్లూరురాజు తదితరులు పాల్గొన్నారు.

పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవు : కాకర్ల

దుత్తలూరు (ఉదయగిరి), సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్య సిబ్బంది పనితీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది వివరాలు, వైద్య పరికరాల పనితీరు అడిగి తెలుసుకున్నారు. వైద్యశాలలో వార్డులు, గదులు, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు సమయపాలన పాటిస్తూ వైద్యశాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఇంటికి పంపడం తథ్యమన్నారు. అనంతరం సిబ్బందిచే బీపీ చెకప్ చేయించుకున్నారు.

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపర్చాలి : ఎంపీడీవో



చెత్త సేకరణను పరిశీలిస్తున్న ఎంపీడీవో అప్పాజీ

ఉదయగిరి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో అప్పాజీ సూచించారు. మంగళవారం మండలంలోని గండిపాళెం పంచాయతీలో జరుగుతున్న పారిశుధ్యం పనులను, తడి, పొడి చెత్త సేకరణను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లల్లో వచ్చే చెత్తా చెదారాన్ని రోడ్లపై వేయకుండా ప్రతిరోజు ఇంటివద్దకు వచ్చే గ్రీన్‌అంబాసిడర్లకు అందజేస్తే చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి తరలిస్తారన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో షేక్ కరీముల్లా, పంచాయతీ కార్యదర్శి ఆవుల వెంకటరమణ, వెల్ఫేర్ అసిస్టెంట్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో సమయపాలన పాటించాలి



పిల్లల బరువును పరిశీలిస్తున్న ఐసీడీఎస్ సూపర్వైజర్ షేక్ షాను

సీతారామపురం, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఎత్తు, బరువులను పోషణ్ ట్రాకర్ యాప్‌తో పాటు, రిజిస్టర్లలో తప్పనిసరిగా నమోదు చేయాలని ఐసీడీఎస్ సూపర్వైజర్ షేక్ షాను సూచించారు. ఆమె మంగళవారం రంగనాయుడుపల్లి అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది కేంద్రాల నిర్వహణలో సమయపాలన పాటిస్తూ, పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. పిల్లలకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తూ ప్రీస్కూల్ హాజరు శాతం పెరిగేలా చూడాలన్నారు. అనంతరం రిజిస్టర్లు పరిశీ లించి సిబ్బందికి తగు సూచనలు, సలహాలు అందించారు.

ఉదయగిరిని జిల్లా చేయాలి : జనసేన



డిప్యూటీ తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న జనసేన పార్టీ నాయకులు

ఉదయగిరి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అనాదిగా అభివృద్ధికి నోచుకోని మెట్ట ప్రాంతమైన ఉదయగిరిని జిల్లా చేయాలని మంగళవారం డిప్యూటీ తహసీల్దారు షాజియాకు జనసేన పార్టీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నూతన జిల్లాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసినందున ఈప్రాంత స్థితి గతులను పరిశీలించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఉదయగిరి అభివృద్ధి జిల్లా ఏర్పాటుతోనే సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు అల్లూరి రవీంద్ర, కిరణ్‌కుమార్, రవి, మహేష్, కేశవ్, సురేష్, మాల్యాద్రి పాల్గొన్నారు.

పుట్టగొడుగుల్లా మినరల్ వాటర్ ప్లాంట్‌లు

● నాణ్యతకు తిలోదకాలు
● పట్టించుకోని అధికారులు



సంగంలో కొత్తగా వెలసిన వాటర్ ప్లాంట్

సంగం, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో మినరల్ వాటర్ ప్లాంట్స్ పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఐఎస్‌ఐ మార్క్ లేకుండా నాణ్యతకు తిలోదకాలు ఇస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నప్పటికీ పట్టించుకునే నాథుడే లేడని వినియోగదారులు విమర్శిస్తున్నారు. పోటాపోటీగా మినరల్ వాటర్ ప్లాంట్స్ ఏర్పాటుచేసి లక్షలు గడిస్తున్నారు. శుద్ధమైన తాగునీటిని అందిస్తామని చెబుతూ నీటి వ్యాపారాన్ని జోరుగా సాగిస్తున్నారు. ఒక్కో వాటర్ క్యాన్ ధర రూ. 15 నుంచి రూ. 30 వరకు విక్రయిస్తున్నారు. పట్టణాల్లోనే కాకుండా పల్లెల్లో సైతం మినరల్ వాటర్ వాటర్‌కు ప్రజలు అలవాటు పడ్డారు. దీన్ని ఆసరాగా చేసుకుని కొందరు గ్రామీణ ప్రాంతాల్లో సైతం వాటర్ ప్లాంట్లు ఏర్పాటుచేస్తున్నారు. నిర్వాహకులు నీటిశుద్ధి కోసం అవగాహన రాహిత్యంతో విపరీతమైన కెమికల్స్ వాడకంతో ప్రజలు అనేక రకాలైన జబ్బులకు గురవుతున్నారు. నాసిరకం ఆక్సిజన్ వినియోగిస్తూ మినరల్ వాటర్ తయారు చేస్తున్నారు. అంతేగాక ఐఎస్‌ఐ నిబంధనల ప్రకారం లైసెన్సులు పొందకుండానే నీటి వ్యాపారాలకు తెరతీస్తున్నారు. ఇలా మండల కేంద్రాల్లో కనీస నిబంధనలను పాటించకుండా అక్రమంగా మినరల్ వాటర్ ప్లాంట్స్ ఏర్పాటు చేసి నీటి వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు కాయలుగా సాగిస్తున్నారు. అయితే మండల కేంద్రాల్లో ఉన్న ఏ ఒక్క వాటర్ ప్లాంట్‌లో కూడా నియమ నిబంధనలు పాటించడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇటువంటి నీటిని తాగితే ప్రజలు మలేరియా, టైఫాయిడ్ వంటి రోగాల బారిన పడే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వాటర్ ప్లాంట్లలో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకొని ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని పలువురు కోరుతున్నారు.

C.R.I.M.E N.E.W.S

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

● రూ. 8వేల నగదు, 5 సెల్‌ఫోన్ల స్వాధీనం



పోలీసులకు పట్టుబడిన పేకాటరాయుళ్లు

పొదలకూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లూర్తి గ్రామంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు మంగళవారం సాయంత్రం అరెస్టు చేశారు. పేకాట ఆడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం రావడంతో ఎస్‌ఐ హనీఫ్ సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.8వేల నగదు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంగళవారం విజిలెన్స్ అధికారులు పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో వెంకటేశ్వర ఫర్టిలైజర్స్ దుకాణంలో ఉన్న యూరియా స్టాక్‌లో వ్యత్యాసం ఉండటాన్ని గుర్తించి, 6ఏ కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ సీఐ శ్రీహరిరావు, అగ్రికల్చర్ అధికారి వేణుగోపాలరావు, మండల వ్యవసాయాధికారి శ్రీహరి పాల్గొన్నారు.

75 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

బుచ్చిరెడ్డిపాళెం,సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి):ఓ వాహనంలో బద్వేల్ నుంచి నెల్లూరుకు శ్రీనివాసులు అనే వ్యక్తి రేషన్ బియ్యం రవాణా చేస్తుండగా, బుచ్చి టోల్‌గేట్ వద్ద స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. 75 బస్తాల్లో సుమారు రెండున్నర టన్నుల బియ్యం ఉన్నట్లు తెలిపారు. బస్తాలను సివిల్ సప్లై అధికారులకు స్వాధీనం చేసి, కేసు దర్యాప్తు ఆయన తెలిపారు.

బాలికపై అత్యాచారయత్నం

● పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు

కావలి రూరల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రకోట ఎస్టీ కాలనీలో 7 ఏళ్ల బాలికపై ఓ 20 ఏళ్ల యువకుడు అత్యాచార యత్నానికి పాల్పడినట్లు బాలిక తల్లి మంగళవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. బాలిక కుటుంబం ప్రకాశం జిల్లా నుంచి 3 ఏళ్ల క్రితం రుద్రకోటకు వలస వచ్చింది. బాలిక తల్లిదండ్రులు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండగా వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ క్రమంలో తల్లి గ్రామంలోని కూరగాయల షాపునకు వెళ్లి వచ్చేలోగా అదే ప్రాంతానికి చెందిన ఆ యువకుడు ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలికపై అత్యాచారయత్నం చేయబోగా బాలిక పెద్దగా కేకలు వెయ్యడం, అదే సమయంలో బాలిక తల్లి అక్కడకు రావడంతో ఆ యువకుడు అక్కడ నుంచి పరారయ్యాడు. బాలిక తల్లి ఫిర్యాదుతో పోలీసులు పోక్సో కేసు నమోదు చెయ్యగా డీఎస్పీ శ్రీధర్ దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాత గొడవలతో దాడి చేసి నగరంలో హత్యాయత్నం

● పోలీసుల కేసు నమోదు

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): పాత గొడవలు మనసులో పెట్టుకొని ఓ వ్యక్తిపై రాయితో ఇష్టానుసారంగా దాడి చేసిన ఘటనపై దర్గామిట్ట పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని ప్రగతి నగర్ ఏ-బ్లాక్‌లోని ఏడవ వీధిలో షేక్ మస్తాన్ కుటుంబం నివసిస్తోంది. ఆయన ఏసీ మెకానిక్‌గా జీవనం సాగిస్తున్నారు. సోమవారం రాత్రి సారాయి అంగడి సెంటర్ సమీపంలో స్నేహితుడు కలాంతో మాట్లాడుతుండగా అబ్దుల్ ముజీద్ అనే వ్యక్తి అక్కడకు వచ్చాడు. వారి మధ్య పాత కక్షలుండటంతో మాస్తాన్‌తో గొడవకు దిగాడు. మస్తాన్‌ను కింద పడేసి గుండెలమీద కూర్చొని పక్కనే ఉన్న ఓ రాయితో తలపై బలంగా మోదాడు. మస్తాన్ స్పృహ కోల్పోవడంతో మరణించాడనుకుని అక్కడి నుంచి వెళ్లిపోయాడు. అక్కడే ఉన్న కలాం ఆంబులెన్స్‌లో మస్తాన్‌ను జీజీహెచ్‌కు తరలించారు. మంగళవారం కోలుకున్న మస్తాన్ దర్గామిట్ట పోలీసు స్టేషన్‌కు చేరుకొని ఫిర్యాదు చేశారు. పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కార్పొరేషన్‌లో 'ఓసీ' కలకలం!

(5వ పేజీ తరువాయి)

రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించి తగు విచారణ కోరగా ఆ మేరకు కలెక్టర్‌కు అందిన ఆదేశానుసారం కార్పొరేషన్ అధికారులు విచారించి ఇటీవల కలెక్టర్, హైకోర్టుకు నివేదికను అందచేశారని తెలిపారు. ఓసీలు లేకుండా మార్టిగేజ్‌లు విడుదల చేసింది నిజమేనన్న వాస్తవాన్ని వారే ధ్రువీకరించారని స్పష్టం చేశారు. పైగా తదుపరి విచారణకు విజిలెన్స్‌కు సిఫార్సు చేయడం తగదన్నారు. కార్పొరేషన్ అధికారులే అక్రమాలు జరిగాయని తేల్చి మరలా విజిలెన్స్‌కు రాయడం సరి కాదని చెప్పారు. అక్రమాలకు పాల్పడిన కమిషనర్లపై చర్యలకు సిఫార్సు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇందులో బాధ్యులుగా ఉన్నవారందరికీ తగు శిక్షపడాలని సూచించారు. పైగా భూగర్భ డ్రైనేజీలోనూ రూ 20 కోట్లు అవినీతి బాగోతం జరిగిందని, ఆ వివరాలను కూడా త్వరలో బయటపెడతానన్నారు. ఓ మహిళా కమిషనర్ సంతకాలు చేసి పనులు జరగకుండానే బిల్లులు చేసిందని ఆరోపించారు. ఆనం ఫిర్యాదుతో బయటకు వచ్చిన ఈ నివేదిక రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ యంత్రాంగంలో చర్చనీయాంశంగా మారింది.

మద్యం కేసు నీరుగార్చే యత్నం?

(5వ పేజీ తరువాయి)

అదనంగా 1800 నుంచి 2 వేల బాటిళ్ల విక్రయించినట్లు నిర్ధారించుకున్నారు. ఇలా ఒక్క సర్వేపల్లిలోనే సుమారు 80 వేలకుపైగా మద్యం సీసాలు బల్క్‌గా బయటకు వెళ్లినట్లు గుర్తించారు. మరి ఇక జిల్లా మొత్తం విచారణ జరిపితే అక్కడ పరిస్థితేమిటన్నది కూడా తెలుస్తుందన్న వాదన వినిపిస్తోంది.

● **ఆ అధికారి కనుసన్నల్లోనే!**

సాధారణానికి మించి అమ్మకాలు జరిగిన షాపుల్లోని డేటాను ఇవ్వాలని ఎక్సైజ్ అధికారులు నాటి సాఫ్ట్‌వేర్ కన్సల్టెన్సీ సంస్థను కోరారు. ఆ వివరాలు అందితే ఎక్సైజ్ అధికారుల పాత్ర ఏ స్థాయిలో ఉందో స్పష్టమవుతుంది. అలానే ఏఏ వ్యక్తులకు ఈ మద్యం చేరిందన్నది కూడా బయటపడుతుంది. కానీ ఈ సమాచారం ఎక్సైజ్ అధికారులకు అందడం లేదు. దీంతో మద్యం కేసుల విచారణ కూడా ముందుకు సాగడం లేదు. అయితే గతంలో జిల్లాలో పనిచేసినప్పుడు ఆరోపణలు ఎదుర్కొన్న అధికారి ఇప్పుడు తెరవెనుక కీలకంగా వ్యవహరిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. వివరాలు బయటకు వస్తే తనకు ఇబ్బందని భావించిన సదరు అధికారి.. ఎలాగైనా ఈ కుంభకోణం నుంచి బయటపడాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు ఎక్సైజ్ శాఖలో చెప్పుకుంటున్నారు. కాగా ఈ కేసుల అంశంపై ఎక్సైజ్ సూపరిటెండెంట్ శ్రీనివాసులు నాయుడును వివరణ కోరగా అన్ని కోణాల్లో విచారణ జరుగుతున్నట్లు చెప్పారు. అవసరమైన డేటాను ఇవ్వాలని గతంలో పనిచేసిన కన్సల్టెన్సీ సంస్థను కోరామని, ఇంకా ఆ వివరాలు అందలేదని వెల్లడించారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	118
స్కిన్ చికెన్	216
స్కిన్‌లెస్	240

కోడిగుడ్ల ధర (100): 570

కందుకూరులో ఆటోనగర్ ఏర్పాటుకు కృషి : ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఉన్న చిన్న చిన్న మెకానిక్ షాపులు, వెల్డింగ్ వర్క్‌లు, ఇతర చిన్న వ్యాపారులంతా ఒకే ప్రదేశంలో ఉండేలా ఆటోనగర్ ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. కందుకూరులో వెల్డింగ్ డిజైన్ వర్కర్స్ యూనియన్ ఏర్పడిన సందర్భంగా మంగళవారం పట్టణంలోని ఇస్లాంపేట షాదీఖానాలో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆనందపురం గ్రామం సర్వేనెం. 1719లో 100 ఎకరాల ప్రభుత్వభూమి ఉందని దానిని చిన్న వ్యాపారుల కోసం కేటాయించే దిశగా జిల్లా కలెక్టరుతో ఇప్పటికే చర్చించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెల్డింగ్ డిజైన్ వర్కర్స్ యూనియన్ నాయకులు షేక్ అబ్దుల్‌గఫూర్, షేక్ చాంద్‌బాషా , కమిటీసభ్యులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

13న లోక్ అదాలత్

కందుకూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): జాతీయ న్యాయసేవాధికారసంస్థ ఆధ్వర్యంలో ఈనెల 13న నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కందుకూరు సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.శోభ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ లోక్ అదాలత్‌లో సివిల్, క్రిమినల్, మోటారువాహనాలు, భరణం తదితర కేసులను రాజీచేసుకో వచ్చునని తెలిపారు.

డిగ్రీ విద్యార్థినికి ఎమ్మెల్యే కాకర్ల పరామర్శ

జలదంకి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న జలదంకికి చెందిన డిగ్రీ విద్యార్థిని కరిష్మాను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మంగళవారం పరామర్శించారు. విద్యార్థిని తల్లిదండ్రులు మాబాషా, నూర్జహాన్‌ల నుంచి ఆమె ఆరోగ్య విషయం తెలుసుకుని ప్రభుత్వం తరుఫున వైద్యసహాయం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట పులుగుంట మధురెడ్డి, గంటా అశోక్ తదితరులు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో భూసారం వృద్ధి

ఉలవపాడు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయంతో భూసారం వృద్ధి చేసుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి విజయ్‌కుమార్ సూచించారు. మంగళవారం మండలంలోని మన్నేటికోటలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రధాన పంటలకు ముందుగా పచ్చిరొట్ట విత్తనాలుగా 30 రకాల పీఎండీఎస్ విత్తనాలు సాగు చేసుకోవచ్చన్నారు. పీఎండీఎస్ విత్తనాలను ప్రధాన పంటకు 50 రోజుల ముందు భూమిలో చల్లి 45వ రోజుల తరువాత కలియదున్నాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బం ది సునీత, రమేష్, వంశీ, అరుణ, రాజా, ప్రియాంక పాల్గొన్నారు.

మోపాడులో 'పొలం పిలుస్తోంది'

కందుకూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోపాడులో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో అబ్దుల్‌రహీం, కేవీకే శాస్త్రవేత్త వెంకటేష్‌లు గ్రామంలో సాగుచేసి ఉన్న వరిపైరును పరిశీలించి రైతులకు సస్యరక్షణ చర్యలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో గ్రామవ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి

వలేటివారిపాలెం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి) : పంటల సాగులో రసాయన ఎరువుల వినియోగ తగ్గించి, సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలని ఏవో శేషారెడ్డి తెలిపారు. మండలంలోని పోకూరు, బడేవారిపాలెం గ్రామాల్లో మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది చరణ్, సాయి, ఆఫ్రీన్ రైతులు పాల్గొన్నారు.

కాండ్ర కుటుంబానికి పలువురి పరామర్శ

బిట్రగుంట, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం నాగులవరం చెరువు మాజీ సాగునీటి సంఘం అధ్యక్షుడు కాండ్ర గోవర్ధన్‌నాయుడు సతీమణి కాండ్రరత్నమ్మ (65) మృతి చెందడంతో మంగళవారం పలువురు నేతులు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు, కండ్లగుంట మధు బాబునాయుడు, బీజేపీ మండల అధ్యక్షుడు వీరాల శ్రీనివాసులుయాదవ్, చిలకపాటి వెంకటేశ్వర్లు, జీ.నాగరాజు. పీ.సుబ్బారావు, టీ.వేణుగోపాల్, తదితరులు రత్నమ్మ భౌతికకాయానికి పూలమాలు వేసి నివాళులర్పించి ఆమె అంత్యక్రియలో పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

కావలి(టౌన్), సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి) : రామస్వామి ఆసుపత్రి అధినేత డాక్టర్ మంచిగంటి రామస్వామి తన సతీమణి జ్ఞాపకార్థం 200 మంది పేద గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేశారు. పలు గిరిజన ప్రాంతాల్లో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాలను రామస్వామి కుమారుడు, కోడలు వెంకట్‌సౌరవ్, రక్షణలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంయుక్త సేవాసంస్థ అధ్యక్షుడు జీ సురేంద్ర, స్వచ్ఛంద సంస్థల గౌరవాధ్యక్షుడు ఖాదర్‌బాషా, రత్నమ్మ ఫౌండేషన్ చైర్మన్ ప్రసాదరావు పాల్గొన్నారు.

లార్వా, ఫీవర్ సర్వే సక్రమంగా చేయాలి

కలిగిరి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా మలేరియా అధికారిణి హుస్సేనమ్మ మంగళవారం సందర్శించారు. స్థానిక వైద్యాధికారిణి డాక్టర్ బిజ్జం గీతారెడ్డి సమక్షంలో ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది క్షేత్ర స్థాయిలో ప్రతి ఇంటిని సందర్శించి లార్వా, ఫీవర్ సర్వేను విధిగా చేయడంతో పాటు సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం పీహెచ్‌సీలో ల్యాబ్ పనితీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కావలి సబ్‌యూనిట్ అధికారి లక్ష్మీనరసయ్య, సీహెచ్‌ఓ సాయి లక్ష్మీ, పీహెచ్‌సీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గంగమ్మ ఒడికి గణనాథులు


కావలి రూరల్ : నిమజ్జనానికి వెళ్తున్న గణనాథుడు


కావలి : లడ్డూను తీసుకెళుతున్న భక్తుడు


కావలి టౌన్ : అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

కావలి రూరల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వేడుకల్లో భాగంగా ప్రత్యేక పూజల అనంతరం మంగళవారం గణనాథులు గంగమ్మ ఒడికి చేరారు. 7 రోజుల పూజల అనంతరం వినాయక మండపాల వద్ద అన్నప్రసాద వితరణ చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన వా హనాల్లో స్వామి వారిని ఉంచి మండలంలోని తుమ్మలపెంట, కొత్తసత్రం, చెన్నాయపాలెం స ముద్ర తీరంలో నిమజ్జన కార్యక్రమాన్ని కోలాహలంగా నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమా ల్లో భాగంగా మహిళలు, చిన్నారులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి బహుమతు లు అందజేశారు. తుమ్మలపెంట బలిజపాలెం లో స్వామివారి లడ్డూకు వేలం నిర్వహించగా రూ.65,000 పలికింది. రూరల్ సీఐ రాజేశ్వరరావు, సిబ్బంది, మెరైన్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

● **కావలి :** వినాయణ ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని రాజావీధిలో గణేష్‌యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహం వద్ద నిమజ్జనం సందర్భంగా మంగళవారం గణేష్ లడ్డూకు వేలం నిర్వహించారు. రైస్‌మిల్ వ్యాపారి తుమ్మల రాజేష్ రూ.3,01,000లకు వేలం పాడి లడ్డూను దక్కించుకున్నారు. ఈ లడ్డూ తనకు దక్కడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని రాజేష్ ఆనందం వ్యక్తం చేశారు.

● **కావలి(టౌన్) :** పట్టణంలోని కలుగోళ శాంభవీ ఆలయ ప్రాంగణంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యం లో జరుగుతున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం ఆలయ ప్రాంగణం వెలుపల భారీ అన్న ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు మన్నవ రవిచంద్ర ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉదయం 108 మంది యువతీ యువకులచే శ్రీవిష్ణు వివాహ ప్రాప్తి కొరకు కాత్యాయినీ వ్రతం నిర్వహించారు. రాత్రి 8గంటలకు దశ హారతుల కార్యక్రమం అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా జానపద గేయాల కార్యక్రమం అలరించింది. మలిశెట్టి మాట్లాడుతూ బుధవారం సాయంత్రం సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి కల్యా ణ మహోత్సం జరుగుతుందని, గురువారం ఉదయం ఉట్టి కార్యక్రమం, 4గంటలకు లడ్డూ వేలం పాట అనంతరం సాయంత్రం 5 గంటలకు 108 మంది చిన్నారుల జ్యోతులతో గణేష్ మహరాజ్ గ్రామోత్సవం, నిమజ్జనోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

కోలాహలంగా ఊరేగింపులు
పోలీసుల విస్తృత బందోబస్తు

● **కొండాపురం :** వినాయకచవితి సందర్భంగా పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాథుల విగ్రహాలకు మంగళవారం నిమజ్జన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. సాయిపేట పంచాయతీలోని మక్కెనవారిపాలెంలో కొలువైన వినాయక విగ్రహానికి భక్తులు విశేష పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించి నిమజ్జనానికి తరలించారు. భక్తులు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

ధైర్యశాలి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

● కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి


అల్లూరులో రక్తదాతను అభినందిస్తున్న ఎమ్మెల్యే వెంకటకృష్ణారెడ్డి, అళహరి సుధాకర్, బీద గిరిధర్

అల్లూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రా ష్ట్రంలో డబుల్ ఇంజన్ ప్రభుత్వ పాలన కొనసాగుతోందని, రాష్ట్ర అభివృద్ధి ప్రదాత ముఖ్య మంత్రి చంద్రబాబు అయితే, కూటమి నాయకుల్లో, కార్యకర్తల్లో ధైర్యం నింపే ధైర్యశాలి డిప్యూటీ సీఎం పవణ్ కల్యాణ్ అని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి పేర్కొ న్నారు. మంగళవారం అల్లూరులో జనసేన పార్టీ మండల కన్వీనర్ కారుమంచి కార్తీక్ శర్మ ఆధ్వర్యంలో జరిగిన పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ కార్యకర్తల నుండి దేశ ప్రధాని వరకు మంచి గుర్తింపు తెచ్చుకున్న నాయకుడని పేర్కొన్నారు. అనంతరం రక్తదాతల్ని అభినందించారు. అనంతరం మొక్కలు నాటి, ఆసుపత్రి సిబ్బందికి దుస్తులు, రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. అన్నదాన కార్యక్రమాలను చేపట్టారు. టీడీపీ నేత బీద గిరిధర్ మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రజా హృదయాల్లో స్థానం సంపాదించుకున్న నేతగా ఎదిగారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన కావలి నియోజకవర్గ ఇన్‌చార్జి అళహరి సుధాకర్, టీడీపీ, జనసేన నాయకులు పలగాటి శ్రీనివాసులురెడ్డి, బండి శ్రీనివాసులురెడ్డి, కృష్ణ చైతన్య, బండి అమర్‌రెడ్డి, రేబాల శంకర్‌రెడ్డి, మేడా కృష్ణారెడ్డి, సామంతుల పరంధామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● **బిట్రగుంట(ఆంధ్రజ్యోతి):** బోగోలు కూడలిలోని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద జనసేన మండలప్రధాన కార్యదర్శి గంగపట్ల సురేష్ ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్నారు. టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు కేక్ కట్ చేసి జనసైనికులతో పాటు తెలుగు తమ్ముళ్ల కు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కమిటీ సభ్యుడు ఎన్.శ్రీని వాసులు యాదవ్, మండల అధ్యక్షుడు వీ.శ్రీనివాసులు యాదవ్, జనసేన నియోజకవర్గ మత్స్యకార విభాగ అధ్యక్షు డు డాక్టర్ రవి, నేతలు ప్రభాకర్, ఫిలిప్, వెంకటేష్, మునుస్వామి, తదితరులు పాల్గొన్నారు.

● **ఉలవపాడు(ఆంధ్రజ్యోతి) :** పవన్ కల్యాణ్ పుట్టిన రోజు వేడుకలు ఉలవపాడులో జనసైనికుడు వక్కల గడ్డ మణికంఠ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ఘ నంగా నిర్వహించారు. పవన్ కాళ్యాణ్ పేరుతో తయారు చేసిన కేక్‌ను కట్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేనకులు, టీడీపీ, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సేవలు మరువలేనివి


వలేటివారిపాలెంలో బుర్రాను సన్మానిస్తున్న వైసీపీ నేతలు

వలేటివారిపాలెం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సేవలు మరువలేనివని కందుకూరు నియోజకవర్గం వైసీపీ ఇన్‌చార్జీ బుర్రా మధుసూదన్ యాదవ్ తెలిపారు. వలేటివారిపాలెం వైసీపీ కార్యాలయంలో మండల కన్వీనర్ అనుమోల లక్ష్మీనరసింహం అధ్యక్షతన మంగళవారం జరిగిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం బుర్రాను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు గుత్తా గోపి, నాగిరెడ్డి శివరామిరెడ్డి, పొట్టేళ్ల క్రిష్ణయ్య, నల్లమోతు చంద్రమౌళి పాల్గొన్నారు.

● **జలదంకి :** జలదంకి బస్టాండు కూడలిలో, గ్రామచావిడి వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహాలకు వైసీపీ మండల కన్వీనర్ ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి, మాజీసర్పంచు తిప్పారెడ్డి ఇందిరమ్మలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురే శేషారెడ్డి, దేవరపల్లి మదురెడ్డి, పేతురు, మదుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

● **అల్లూరు :** స్థానిక పాతబస్టాండు కూడలి సమీపంలోని వైఎస్సార్ విగ్రహానికి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అనంతరాజు బాలకృష్ణంరాజు, నీలం సాయికుమార్, ఉస్మాన్ షరీఫ్, మేడా మాధవ, తాండ్ర మల్లికార్జున, సురేష్, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

● **లింగసముద్రం :** మండల అధ్యక్షుడు నోటి వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక తిరుమణిశెట్టి కోటయ్యస్వామి మందిరం సమీపంలో ఉన్న వైఎస్ విగ్రహానికి, పార్టీ కార్యాలయంలోని వైఎస్ఆర్ చిత్రపటానికి ఎంపీపీ పెన్నా కృష్ణయ్య తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పులిహోర, పెరుగు అన్నం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పీ.తిరుపతిరెడ్డి, ఎంపీటీసీ దగ్గు వెంకటేశ్వర్లు, సర్పంచులు డీ.మల్లికార్జున, వంటేల శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

● **ఉలవపాడు:** ఉలవపాడు బస్టాండ్ సెంటర్‌లో ఉన్న వైఎస్ విగ్రహానికి నాయకులు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఉలవపాడు సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు పోతురాజు, నాయకులు ధనకోటి, ప్రభాకర్‌రెడ్డి, కోటులింగం, మద్దసాని నవీన్, ఆదాం, మోహన్ బాబు, నిషాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర పునర్నిర్మాణంలో కీలక పాత్ర : ఇంటూరి


లింగసముద్రంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

లింగసముద్రం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పునర్నిర్మాణంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కీలక పాత్ర పోషించారని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చెప్పారు. మంగళవారం లింగసముద్రంలోని బలిజపాలెంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు నరసింహారావు ఆధ్వర్యంలో జరిగిన పవన్ జన్మదిన వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి కూటమి నేతలు, కార్యకర్తలకు, అభిమానులకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో రాష్ట్రంలో జరిగిన అన్యాయాలు, అక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, వైసీపీ పాలనకు చరమగీతం పాడేందుకు కూటమి ఏర్పాటులో చురుకైన పాత్ర పోషించారని తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక వడ్డెర కాలనీలో నిర్మించే రామాలయం నిర్మాణానికి అంగులూరి నరసింహారావు రూ.25 వేలు ఆర్థిక సహాయం ఎమ్మెల్యే నాగేశ్వరరావు చేతుల మీదుగా కానీవాసులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పీ.గురునాథం, నాయకులు గాలంకి ప్రసాద్, బింకం శేషయ్య, బింకం నాగేంద్ర, అడపా నర్సయ్య, యు నాగేశ్వరరావు, జంపాల శివప్రసాద్, కిలారి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ యంత్రాల వినియోగంపై మహిళలకు శిక్షణ


శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న మహిళా రైతులు

కందుకూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో వ్యవసాయ యంత్ర పరికరాల వినియోగంపై మహిళా రైతులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. కేవీకే, అనంతపురంలోని దక్షిణక్షేత్ర వ్యవసాయ యంత్రాల శిక్షణ, పరీక్షణసంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కందుకూరు ప్రాంతంలోని వివిధ గ్రామాల మహిళా రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిచికారి డ్రోన్లు, పవర్ వీడర్లు, వివిధ రకాల నార్లు నాటే యంత్రాలు, విత్తనాలు విత్తే యంత్రాలు, వేరుశనగ కాయలు వలిచే యంత్రం, ఎరువులు, విత్తనాలు చల్లుకునే యంత్రాలపై అవగాహన కల్పించటంతో పాటు వాటి వినియోగంలో మెలకువలపై శిక్షణ ఇచ్చారు. కేవీకే శాస్త్రవేత్త వివేక్ కామత్, అనంతపురం నుంచి వచ్చిన శిక్షణ అధికారులు వెంకటరమణ, వెంకటేశ్, భాస్కర్, పలు స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై అనుచిత వాఖ్యలు చేస్తే సహించం

కావలి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డిపై వైసీపీ నేతలు తమస్థాయిని మరచి అనుచిత వాఖ్యలు చేస్తున్నారని, అలాంటి వారికి తగిన బుద్ధి చెప్పాల్సి వస్తోందని టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం జరిగిన విలేకరుల సమావేశంలో టీడీపీ నేతలు జ్యోతి బాబూరావు, కండ్లగుంట మధుబాబు నాయుడు, దేవరకొండ శ్రీనివాసులు, దావులూరి దేవకుమార్, యల్లంటి వెంకటేశ్వర్లు మాట్లాడారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి తన అనుచరులతో అనుచిత వాఖ్యలు చేయిస్తున్నారన్నారు. దళిత వర్గాలను అడ్డం పెట్టుకుని ఎక్కువగా వారి చేత మాట్లాడిస్తున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో కావలి నియోజకవర్గంలో దళితులపై దాడులు జరిగినప్పుడు వైసీపీలో ఇప్పుడు మాట్లాడుతున్న ఆ దళిత నేతలు అప్పుడు ఎక్కడకు పోయారన్నారు. ఒక మాజీ కౌన్సిలర్, కొంత మంది దళిత నేతలు తన గత చరిత్రను మరచి వారి స్థాయిని మించి ఎమ్మెల్యేపై అనుచిత వాఖ్యలు చేయడం తగదన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నేతలు వల్లూరి కిరణ్, మేడికొండ సుకుమార్, అక్కిలగుంట సూర్యప్రకాష్, కమతం శ్రీనివాసు లు, నేలపాటి మాల్యాద్రి, పల్లపు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

'పొగాకు'లో యాజమాన్య పద్ధతులు పాటించాలి

కలిగిరి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): పొగాకు నారుమళ్లలో యాజమాన్య పద్ధతులు పాటించాలని స్థానిక పొగాకుబోర్డు వేలం నిర్వహణాధికారి శివకుమార్ పేర్కొన్నారు. మంగళవారం పొగాకు బోర్డు పరిధిలోని శెట్టిపాలెం, పార్లపల్లి, సత్యవోలుఅగ్రహారం గ్రామాల్లో సాగు చేస్తున్న పొగాకు నారుమళ్లను ఆయన పరిశీలించారు. నారుమళ్లు సాగు చేస్తున్న రైతులు తప్పనిసరిగా పొగాకు బోర్డు అనుమతి పొందాలన్నారు. అనుమతులు లేకుండా నర్సరీలు సాగుచేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా రిజిస్ట్రేషన్ లేని నర్సరీల నుంచి నారు కొనుగోలు చేసి పొగాకు సాగుచేస్తే సంబంధిత రైతుల రిజిస్ట్రేషన్ నిలుపుదల చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీసీ మేనేజరు జీ వెంకటేశ్, ఫీల్డ్ ఆఫీసర్ సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సులభరీతిలో బోధించండి

లింగసముద్రం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు బోధన చేయాలని మండల స్థాయి మోనిటరింగ్ అధికారి గోపీకృష్ణ చెప్పారు. మంగళవారం ఆయన మండలంలోని చినపవని ప్రాథమిక, అన్నెబోయినపల్లి యూపీ, వీఆర్ కోట జడ్పీ ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టీలను పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థుల ఎఫ్ఎల్ఎన్ అమలు తీరును, ప్రాథమిక భాష, గణిత సామర్థ్యాలను పరిశీలించారు. ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి, రుచి చూశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈ వో-1 కే.మాల్యాద్రి, ఎంఈవో-2 ఎంవీ శివకుమార్ పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

● **కొండాపురం :** మండలంలోని పలు పాఠశాలలను ఎంఈవోలు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంఈవో-1 కే.రవికుమార్ తూర్పు జంగాలపల్లి, ఉప్పలూరు ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలను తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని నిర్వాహకులకు సూచించి విద్యార్థులతో కలసి భోజనం చేశారు. ఎంఈవో-2 ఆనందరావు బోయళ్లవారిపాలెం, గుడవళ్లూరు ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేసి విద్యార్థుల అభ్యసనాసామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాల రికార్డుల్లో విద్యార్థుల సమగ్ర వివరాలు నమోదు చేయాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు.



సర్వదర్శన క్యూలైన్ వద్ద నెమలి

తిరుమలలోని సర్వదర్శన క్యూలైన్‌లో ఉన్న భక్తులను అడవిలోంచి వచ్చిన ఒక నెమలి అలరించింది. శేషాచలం అడవుల్లో నుంచి నెమళ్లు జనసంచారంలోకి రావడం అరుదు. మంగళవారం ఉదయం కృష్ణతేజ విశ్రాంతి భవనానికి సమీపంలోని రింగురోడ్డులో సర్వదర్శన క్యూలైన్ల వద్దకు నెమలి వచ్చి చాలా సేపు తిరుగులాడింది. అక్కడి సిబ్బంది, వాహనాల్లోని వారూ దానిని తమ మొబైల్‌లో ఫొటోలు తీశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

అభివృద్ధే అజెండా!

చంద్రబాబు పుట్టి పెరిగిన తావు..
మంచి చెడుల తేడా తెలిసిన రైతులున్న ప్రాంతం.. హేమాహేమీలు ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గం.. సంక్లిష్ట రాజకీయాలకు నెలవు.. చంద్రగిరి నియోజకవర్గం నుంచి శాసనసభకు ప్రాతినిధ్యం వహించడం అంటే.. నిత్యం గాల్లో తాడుమీద నడక వంటిదే! ఆ సాహస ప్రయాణాన్ని సవాలుగా స్వీకరించారు పులివర్తి వెంకటమణి ప్రసాద్ అలియాస్ పులివర్తి నాని. ఏడాది పొడవునా ఇంటింటికీ తాయిలాలు పంచి జనాదరణకు ప్రయత్నించిన చెవిరెడ్డి భాస్కరరెడ్డిపై 2024లో సంచలన విజయం సాధించారు. సై సవాల్ అనే దూకుడు స్వభావం.. అండగా ఉక్కు కొండలా నిలిచే భార్య సుధారెడ్డి సహకారం.. అభివృద్ధితోనే జనాన్ని గెలుచుకోగలమన్న ఆత్మవిశ్వాసం.. పిలిస్తే పలికే నాయకుడిగా జనంలో పేరు తెచ్చుకున్న పులివర్తి నాని తొలి ఏడాదిలో నియోజకవర్గంలో చేసిన పనులేమిటి? ఇచ్చిన హామీల అమలు స్థితిగతులేమిటి? చేయాలనుకున్న పనుల పరిస్థితి ఏమిటి.. ఈ అంశాలపై ఆంధ్రజ్యోతితో సంభాషణలో ఆయన చెప్పిన సంగతులు ఇవి...

...6వ పేజీలో



• సిలికా కోసం నిబంధనల

'దారి' తప్పారు!

ఆ మైన్ యజమాని చక్రం తిప్పారు. సిలికా తరలింపునకు ప్రభుత్వ భూముల్లో అక్రమంగా గ్రావెల్‌తో రోడ్డు వేస్తున్నారు. తాను లీజుకు తీసుకున్న మైన్ నుంచి సిలికా తరలించడంతో పాటు.. ఈ దారి పక్కనే ఉన్న ప్రభుత్వ భూముల్లో సిలికాను సొంతం చేసుకునే వ్యూహమూ దీని వెనుక దాగుందన్న ప్రచారం జరుగుతోంది. మొదట్లో నిబంధనల పేరిట అడ్డుకున్న అధికారులు.. వారం రోజులుగా రోడ్డు వేస్తుంటే పట్టించుకోకుండా ఉండటం పలు ఆరోపణలకు తావిస్తోంది.

- కోట, ఆంధ్రజ్యోతి


ప్రభుత్వ భూమిలో వేసిన రోడ్డు

ప్రభుత్వ భూముల్లో అక్రమంగా రోడ్డు

గతంలో అడ్డుకుని.. ఇప్పుడు పట్టించుకోని అధికారులు

చక్రం తిప్పిన సిలికా మైనింగ్ యజమాని

ఆ దారికి ఎలాంటి అనుమతుల్లేవు

కర్లపూడిలోని సిలికా భూములకు దారికి సంబంధించి ఎలాంటి అనుమతుల్లేవు. అక్రమ మార్గంలో పనులు జరుగుతుంటే తక్షణ చర్యలు చేపడతాం. దీనిపై తక్షణ విచారణ జరిపి బాధ్యులను శిక్షిస్తాం.

- జయజయరావు, కోట తహసీల్దారు

కోట మండలం కర్లపూడి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 108లోని 8.5 ఎకరాల్లో.. గూడూరు ప్రాంతానికి చెందిన ఒకరికి సిలికా మైనింగ్‌కు అనుమతులున్నాయి. ఈ మైనింగ్‌కు కొన్ని మీటర్ల దూరంలోనే సర్వే నెంబరు 107లో 167 ఎకరాల ప్రభుత్వ భూములున్నాయి. వీటిల్లో కొంతమంది గిరిజనులు నివాసం ఉండగా, మిగతా భూములు ఖాళీగా ఉన్నాయి. ఆ భూముల్లోనూ సిలికా ఖనిజ సంపద ఉంది. కాగా, గూడూరు ప్రాంతానికి చెందిన వ్యక్తి.. తన మైన్ నుంచి సిలికా తరలించాలంటే దారి లేదు. పోనీ సిలికా యజమానుల సిండికేట్‌లో కలుద్దామంటే.. వాళ్లు దారి సమస్యనే ప్రస్తావించినట్లు తెలిసింది.దీనికి ఏకైక పరిష్కారం.. ప్రభుత్వ భూముల్లో రోడ్డు వేయడమే. దీంతో ఆ ప్రభుత్వ భూముల్లో రోడ్డు వేయడానికి ఆ యజమాని ప్రయత్నించగా రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు అడ్డుకున్నారు. దీంతో తన ప్రయత్నాలు ఆపేశారు. ఆ తర్వాత ఆయన కర్లపూడిలోని కొందరు దళిత,గిరిజనులను తనవైపు తిప్పుకొన్నారు. స్థానిక నాయకుల్లో కొందరితోను, అధికారులతోనూ మాట్లాడుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. మొత్తమ్మీద ఆ రోడ్డు కోసం భారీగా ఖర్చు చేస్తున్నట్లు సమాచారం. ఆ దారితో పాటు పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిలోని సిలికానూ అనధికారికంగా తవ్వి తరలించే వ్యూహంతోనూ


దారి కోసం సానకాలువను పూడ్చి వేశారిలా..

సిండికేట్ ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. కాగా, వారంరోజులుగా ప్రభుత్వ భూముల్లో రోడ్డు వేస్తున్నా ఏ శాఖ అధికారులూ పట్టించుకోకపోవడం గమనార్హం. ఈ రోడ్డు కోసం సహజసిద్ధంగా ఏర్పడి కర్లపూడి.. చిల్లకూరు మండలంలోని వేళ్లపాళెం,కాకువారిపాళెం చెరువుల్లోకి నీటి సరఫరా అయ్యే సానకాలువలనూ పూడ్చివేస్తున్నారు. దీనివల్ల ఆయా చెరువుల పరిధిలోని తమ ఆయకట్టుకు సాగునీరు అందకుండా పోతుందంటూ రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

రౌడీషీటర్లు ఏం చేస్తున్నారు?

• డీజీపీ ఆదేశాలతో రంగంలోకి దిగిన పోలీసులు • స్టేషన్ల వారీగా వివరాల సేకరణ

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): పోలీసు స్టేషన్ల వారీగా రౌడీ షీటర్లు ఎంత మంది ఉన్నారు? ఇంకా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారా? శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తున్నారా? నాయకులతో అంటకాగుతూ సెటిల్మెంట్లు చేస్తున్నారా? ఈ దిశగా పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. నెల్లూరు జైలులో ఉంటూ శ్రీకాంత్ సెటిల్మెంట్లు చేయడం.. లేడీ డాన్ అరుణ ఘటన నేపథ్యంలో పోలీసులు జిల్లా వ్యాప్తంగా రౌడీ షీటర్లపై ఉక్కుపాదం మోపేలా చర్యలు చేపడుతున్నారు. మళ్లీ మళ్లీ నేరాలు చేస్తున్న రౌడీషీటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ తాజాగా డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఆదేశాలివ్వడంతో పోలీసు అధికారులు స్పందించారు. కాగా, ఇప్పటి వరకు అందిన సమాచారం మేరకు జిల్లాలో దాదాపు 860 మంది రౌడీషీటర్లు ఉన్నట్లు తెలిసింది. వీరిలో 150 నుంచి 200 మంది యాక్టివ్‌గా ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. వీరంతా ఎక్కడెక్కడ తిరుగుతున్నారు? రాజకీయ నాయకుల కనుసన్నల్లో మెదులుతున్న వారెందరనే కోణాల్లో పోలీసులు విచారిస్తున్నారు. గత ఏడాది కాలంలో రౌడీషీటర్లు ఎక్కడైనా మళ్లీ హత్యలు, హత్యాయత్నాలు, ఇతర గ్రేవ్ నేరాల్లో పాల్గొన్నారా అనేది పరిశీలిస్తున్నారు. పాత రికార్డులు తిరగతోడుతున్నారు. గతంలో రౌడీషీటర్లుగా నమోదైన వారి జాబితా బయటకు తీస్తున్నారు. గతంలో ప్రతి వారం స్టేషన్లకు రౌడీషీటర్లను పిలిపించుకుని కౌన్సిలింగ్ ఇచ్చి పంపేవారు. స్టేషన్ల వారీగా టాప్-10 లో ఉన్న షీటర్లను గుర్తించి పాత కేసుల్లో పాత్ర ఉన్న వారిని, వారం, వారం గైర్హాజరైన వారిని ఎంపిక చేస్తున్నారు. మొత్తంగా నేర చరిత్ర ఉన్న వారిని జైలుకు పంపడానికి సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో గత వైసీపీ ప్రభుత్వంలో కక్ష సాధింపు చర్యలతోనూ రౌడీ షీట్లు ఓపెన్ చేశారు. ఈ అంశాన్నీ పరిగణనలోకి తీసుకుంటున్నట్లు సమాచారం.

785 మంది నేరస్థుల వేలి ముద్రల సేకరణ

జిల్లా వ్యాప్తంగా నెల రోజుల వ్యవధిలో దాదాపు 785 మంది నేరస్థుల వేలిముద్రలు సేకరించారు. ఈ మేరకు ఆగస్టు నెల నేర సమీక్ష గణాంకాలను మంగళవారం ఎస్పీ హర్షవర్ధన రాజు మీడియాకు విడుదల చేశారు. 'రాత్రి పూట రోడ్లపై తిరుగుతున్న 1260 మంది అనుమానితులకు కౌన్సెలింగ్ ఇచ్చాం. 785 మంది వేలిముద్రలు తీసుకున్నాం. 65.600 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని పలువురిపై కేసులు పెట్టాం. 791 మంది రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చాం. బహిరంగంగా మద్యం తాగుతున్న 1209 మందిపై కేసులు నమోదు చేశాం. 2185 సమస్యాత్మక వార్డులు, గ్రామాలను డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు సందర్శించి ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు. డ్రోన్ల ద్వారా 127 ఆపరేషన్లు చేశాం. గ్రామాల్లో పల్లెనిద్ర చేయగా.. 463 హోంస్టేలు తనిఖీలు చేసి కొన్నింటిపై కేసులు పెట్టాం. కార్డన్‌సెర్చ్ నిర్వహించి, 60 వాహనాలు సీజ్ చేశాం' అని ఆ ప్రకటనలో ఎస్పీ వివరించారు. చట్టాలను అతిక్రమించే వారిని ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు.

పద్మావతి వర్సిటీలో పలు కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీ నిర్వహించే వివిధ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి పీజీ కామర్స్, తెలుగు, మ్యూజిక్ కోర్సుల్లో ప్రవేశానికి మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చివరి గడువు ఈ నెల 30వ తేదీగా నిర్ణయించారు. సమగ్ర సమాచారం కోసం.. ఎస్‌పీఎంవీవీ.. వెబ్‌సైట్‌లో కానీ, 8121787415 నెంబరులో కానీ సంప్రదించవచ్చని వర్సిటీ పీఆర్వో డాక్టర్ ఎన్.శ్రీరజని తెలిపారు.

ముక్కంటి ఆలయం వద్ద భక్తుడికి గుండెపోటు

- అంబులెన్సు ఉన్నా అందుబాటులో లేని డ్రైవర్లు
- కుటుంబీకుల ఆర్తనాదాలు విని బాధితుడిని తీసుకెళ్లిన పోటు అర్చకుడు
- అప్పటికే మృతిచెందినట్లు వైద్యుల నిర్ధారణ


నరసింహారావు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ముక్కంటి దర్శనార్థం విచ్చేసిన నరసింహారావు (60) గుండెపోటుతో మృతి చెందారు. కడపకు చెందిన ఈయన కుటుంబ సమేతంగా మంగళవారం రాత్రి శ్రీకాళహస్తీశ్వరాలయం చేరుకున్నారు. అద్దె గది కోసం ఆలయ నాలుగో ప్రవేశ మార్గం వద్ద ఉన్న సీఆర్వో కేంద్రానికి కుటుంబ సభ్యులు వెళ్లారు. సీఆర్వో కార్యాలయం వెలుపల నిలబడి ఉన్న నరసింహారావు ఉన్నట్టుండి కుప్పకూలారు. అంబులెన్సు నిలిపి ఉంచే పరిపాలనా భవనానికి సమీపంలో భక్తుడు గుండెపోటుకు గురయ్యారు. ఆ సమయంలో ఒక్క డ్రైవరూ అందుబాటులో లేరు. మరోవైపు బాధితుడి కుటుంబీకులు ఆర్తనాదాలు పెట్టారు. ఆ సమయంలో ముక్కంటి ఆలయ నైవేద్యం తయారీ పోటులో పనిచేసే అర్చకుడు రావిశర్మ అటుగా వెళుతూ స్పందించారు. నరసింహారావును ఆలయ అంబులెన్సులో ఎక్కించుకుని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే నరసింహారావు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అంబులెన్సు డ్రైవర్లు అందుబాటులో లేకపోవడంపై మృతుడి బంధువులతో పాటు ఈఘటన చూసిన భక్తులంతా ఆవేదన చెందారు.

ఇదేమి తీరు?

ముక్కంటి ఆలయంలో మొత్తం ఏడుగురు డ్రైవర్లను నియమించారు. అంబులెన్సుతోపాటు అధికారుల వాహనాలకు వీరు విధులు నిర్వహించాలి. ఆలయం తరఫున ఉన్న అంబులెన్సు కోసం షిఫ్టుల ప్రాతిపదికన నిరంతరం డ్రైవర్లు అందుబాటులో ఉండాలి. వేలాదిగా భక్తులు ఆలయానికి విచ్చేస్తుంటారు. ముఖ్యంగా రాత్రివేళల్లో ఆలయ ప్రాంగణంలో ఆరుబయట భక్తులు పెద్దసంఖ్యలో నిద్రిస్తుంటారు. పలుమార్లు రాత్రి వేళల్లో ప్రమాద ఘటనలు చోటు చేసుకున్నాయి. నాల్గో గేటు వద్ద నిద్రిస్తున్న భక్తులపై స్టోర్ కోసం నిత్యావసరసరకులు తీసుకువచ్చిన మినీలారీ మూడేళ్లక్రితం దూసుకెళ్లింది. రాత్రివేళల్లో స్వల్ప ఘటనలు జరుగుతుంటాయి. ఇంతటి కీలకమైన ఆలయ స్వావరంలో అంబులెన్సు డ్రైవర్ విధుల్లో అప్రమత్తంగా లేకపోవడం విమర్శలకు తావిచ్చింది.

వేడుకగా అమ్మవారి ఆలయ శుద్ధి

• 5 నుంచి పవిత్రోత్సవాలు

తిరుచానూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో ఈ నెల 5 నుంచి పవిత్రోత్సవాలు జరగనున్న నేపథ్యంలో మంగళవారం కోయిల్‌ఆళ్వార్ తిరుమంజనం (ఆలయ శుద్ధి) నిర్వహించారు. ఆలయ గోడలు, పైకప్పు, పూజాసామగ్రిని నీటితో శుద్ధి చేశారు. అనంతరం అమ్మవారిని అలంకరించి భక్తులకు సర్వదర్శనం కల్పించారు. ఈ సందర్భంగా ఆర్జిత సేవలను రద్దు చేశారు. ఈ నెల 4న అంకురార్పణ.. 5 నుంచి 7వ తేదీ వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. పవిత్రోత్సవాల్లో ఉదయం బ్రేక్ దర్శనం, ఆర్జితసేవలు రద్దు చేశారు. పవిత్రోత్సవాలను పురస్కరించుకుని ఓ దాత పరదాలను కానుకగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో హరీందరనాథ్, సూపరింటెండెంట్ రమేష్, అర్చకులు బాబుస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతి, సుబ్బరాయుడు, సుభాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.


ధ్వజస్తంభాన్ని శుద్ధి చేస్తున్న డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్ తదితరులు

14న జాతీయ మహిళా సాధికారత బృందం చంద్రగిరి కోట సందర్శన

చంద్రగిరి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఈనెల 14, 15 తేదీల్లో మహిళా సాధికారత కమిటీ సభ్యుల జాతీయ స్థాయి సమావేశం జరగనుంది. సమావేశానికి లోకసభ స్పీకర్‌తో పాటు వివిధ రాష్ట్రాల అసెంబ్లీ స్పీకర్లు, మహిళా సాధికారత కమిటీ సభ్యులు, పార్లమెంటు మహిళా సాధికారత కమిటీ సభ్యులు, రాష్ట్ర గవర్నర్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు తదితర ప్రముఖులు హాజరుకానున్నారు. ఈసందర్భంగా వారు చారిత్రాత్మక ప్రాశస్త్యత కలిగిన కోటను సందర్శించనున్నారు. అదే రోజు రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు విందుకూ కోట వేదిక కానుంది. ఇందుకు ఏర్పాటు చేస్తున్నారు. ఈనేపథ్యంలో రాష్ట్ర అసెంబ్లీ డిప్యూటీ సెక్రటరీలు రాజ్‌కుమార్, ఈశ్వర్‌రావులతో కూడిన బృందం, జిల్లా అధికారులు కలిసి మంగళవారం చంద్రగిరి కోటను సందర్శించారు. ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ఆర్డీవో రామ్మోహన్, ఏపీ టూరిజం ఆర్డీ రమణ ప్రసాద్, డీటీ దివాకర్, కోట సీఐ బాలకృష్ణారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



చంద్రగిరి కోటను పరిశీలిస్తున్న అధికారులు

నవంబరు వరకూ ప్రత్యేక రైళ్ల పొడిగింపు

తిరుపతి(సెంట్రల్), సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): దీపావళి, దసరా సందర్భంగా కొన్ని మార్గాల్లో నడుస్తున్న వారాంతపు ప్రత్యేక రైళ్లను అక్టోబరు నుంచి నవంబరు వరకు పొడిగిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నుంచి సాయినగర్ షిరిడీ, నరసాపురం నుంచి తిరువణ్ణామలైల మధ్య నడుస్తున్న ప్రత్యేక రైళ్లు అక్టోబరు 5 నుంచి నవంబరు 24 వరకు నడుస్తాయి. తిరుపతి నుంచి షిరిడీకి ప్రత్యేక రైలు(07637), షిరిడీ నుంచి తిరుపతికి ప్రత్యేక రైలు(07638) నవంబరు 24 వరకు రాకపోకలు సాగిస్తాయి. నరసాపురం- తిరువణ్ణామలై (07219-07220), హైదరాబాదు- కన్యాకుమారి(07230-07229), కాచిగూడ-మధురై (07191-07192), హైదరాబాదు- కొల్లాం ప్రత్యేక రైళ్లు (07193-07194) రేణిగుంట, తిరుపతిల మీదుగా నవంబరు నెలాఖరు వరకు నడుస్తాయని అధికారులు పేర్కొన్నారు.


సర్వదర్శనానికి 7 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 7 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 11 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.4.03 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 65,384

తలనీలాలు సమర్పించినవారు: 22,512



పుట్టింది చంద్రగిరి నియోజకవర్గంలోని పులివర్తివారిపల్లెలో. పెరిగిందీ, చదివిందీ మాత్రం చిత్తూరులో. పులివర్తివారిపల్లె సర్పంచుగా చేసినా చిత్తూరు రాజకీయాల మీదే ప్రేమ ఎక్కువ. అనూహ్య పరిస్థితుల్లో చంద్రగిరినే పులివర్తి నాని.. తన రాజకీయ క్షేత్రంగా స్థిరపరచుకోవాల్సి వచ్చింది. టీడీపీలో తొలినుంచీ చురుకైన నేతగా గుర్తింపు పొందారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు తెలుగు యువత అధ్యక్షుడిగా, టీడీపీ అధ్యక్షుడిగా పనిచేశారు. 2018లో చంద్రగిరి టీడీపీ ఇంచార్జిగా నియమితులయ్యారు. 2019 ఎన్నికల్లో చంద్రగిరి నుంచీ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. అయినా జనంలోనే వుండి 2024 ఎన్నికల్లో భారీ ఆధిక్యతతో ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీలో అడుగుపెట్టారు. నిరంతరం జనంలో ఉంటూ, వారు చెప్పింది వింటూ, భారీ ప్రతిపాదనలతో చంద్రబాబు, లోకేశ్‌లను కలుస్తుంటారు. నిధుల సులువులెరిగి, సాధించే ప్రయత్నాలు చేస్తుంటారు. తొలి ఏడాదిలో చంద్రగిరి నియోజకవర్గంలో చేసిన, చేయబోతున్న పనుల గురించి ఆంధ్రజ్యోతి ప్రతినిధితో పులివర్తి నాని పంచుకున్న అంశాలు ఇవి..

కథనం, ఇంటర్వ్యూ
తిరుపతి, ఆంధ్రజ్యోతి



నాడు

పాకాల మండలం నేంద్రగుంట - దామలచెరువు మార్గంలో ఊట్లవారిపల్లె గతంలో రోడ్డు (ఫైల్ ఫొటో)



నేడు

అదే రోడ్డు ఇప్పుడిలా ఉంది



రూ.350 కోట్లతో అభివృద్ధి పరుగులు

చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని

- రూ. 75 కోట్లతో తారు, సీసీ రోడ్లు
- రూ. 600 కోట్లతో పనులకు ప్రతిపాదనలు
- పరిశ్రమల కోసం భూముల గుర్తింపు

ప్రోగ్రెస్ రిపోర్ట్

1 ఏడాదిలో ఏం చేశారు?

చెరువులకు 187కోట్లు

చంద్రగిరి నియోజకవర్గంలో ఇరిగేషన్ శాఖ ద్వారా చెరువుల ఆధునీకరణకు, పూడికతీత తదితర అభివృద్ధి పనుల కోసం రూ. 220.13 కోట్లతో 180 పనులు ప్రతిపాదించగా రూ. 187.40 కోట్లతో 63 పనులను ప్రభుత్వం మంజూరు చేసింది. పాకాల మండలంలో రూ. 54 కోట్లు, చంద్రగిరి మండలంలో రూ. 15.60 కోట్లు, చిన్నగొట్టిగల్లు మండలంలో రూ. 24 కోట్లు, ఎర్రావారిపాలెం మండలంలో రూ, 33 కోట్లు, తిరుపతి రూరల్ మండలంలో రూ. 40.80 కోట్లు, రామచంద్రాపురం మండలంలో రూ. 20 కోట్లు చొప్పున ఖర్చు చేశాం.

తొలి ఏడాది చేసినవి ఇవీ..

రూ. 27.10 కోట్లతో వేసిన ఆర్ అండ్ బీ రోడ్లు

- రూ. 8 కోట్లతో వేదాంతపురం నుంచీ రాయలచెరువు కట్టమీదుగా అనుప్పల్లి వరకూ రోడ్డు
- రూ. 1.40 కోట్లతో చంద్రగిరి టవర్ క్లాక్ సెంటర్ నుంచీ శ్రీనివాస మంగాపురం వరకూ.
- రూ. 1.40 కోట్లతో నేంద్రగుంట నుంచీ దామలచెరువు వరకు
- రూ. 6 కోట్లతో భాకరాపేట నుంచీ తలకోన వరకూ 14 కిలోమీటర్లు.
- రూ. 1.60 కోట్లతో పెద్దమల్లెల నుంచీ ఎర్రావారిపాలెం వరకూ 8 కిలోమీటర్లు.
- రూ. 2.40 కోట్లతో పించా రోడ్డు నుంచీ ఉస్తికాయలపెంట వరకూ 7 కిలోమీటర్లు.
- రూ. 2 కోట్లతో పాకాల నుంచీ పి.కొత్తకోట వరకూ 5.20 కిలోమీటర్లు
- రూ. 1.30 కోట్లతో భాకరాపేట నుంచీ చట్టేవారిపాలెం, పులికుంట్లవారిపల్లి వరకూ 5.80 కిలోమీటర్లు.
- రూ. 3 కోట్లతో కుప్పం బాదూరు నుంచీ గుండోడు కనం మీదుగా కొత్త నెన్నూరు వరకూ.

రూ. 63.58 కోట్ల ఉపాధి నిధులతో సీసీ రోడ్లు

- రూ. 3.55 కోట్లతో తిరుపతి రూరల్‌లో 38 సీసీ రోడ్లు, ● రూ. 10.28 కోట్లతో పాకాలలో వంద సీసీ రోడ్లు
- రూ. 22.04 కోట్లతో చంద్రగిరిలో 144 సీసీ రోడ్లు, ● రూ. 4.47 కోట్లతో చిన్నగొట్టిగల్లులో 77 సీసీ రోడ్లు
- రూ. 4.27 కోట్లతో ఎర్రావారిపాలెంలో 84 సీసీ రోడ్లు, ● రూ. 3.12 కోట్లతో రామచంద్రాపురంలో 26 సీసీ రోడ్లు

గోకులం షెడ్లు

- రూ. 6.25 కోట్లతో చిన్నగొట్టిగల్లులో 272 షెడ్లు, ● రూ. 5.84 కోట్లతో ఎర్రావారిపాలెంలో 281 షెడ్లు
- రూ. 1.88 కోట్లతో చంద్రగిరిలో 93 షెడ్లు, ● రూ. 1.85 కోట్లతో పశువులకు 451 నీటి తొట్టెలు.

- నియోజకవర్గంలో తాగునీటి సరఫరా కోసం రూ. 35.30 కోట్లతో 538 పనులు మంజూరు చేయించా. అందులో రూ. 12.54 కోట్లతో ఇప్పటి దాకా 493 పనులు పూర్తి అయ్యాయి.
- నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతున్న 98 మంది బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచీ రూ. 2.44 కోట్లు సాయంగా అందించాం.
- నియోజకవర్గంలోని మొగరాల, పులివర్తివారిపల్లి, రామచంద్రాపురం, తొండవాడ ఎన్టీయార్ కాలనీల్లో రూ.12 కోట్లతో విద్యుత్ సబ్ స్టేషన్లు నిర్మించాం. నెరబైలులో రూ. 2.20 కోట్లతో పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయించాం.

మలి ఏడాది లక్ష్యాలు

- చంద్రగిరి శివార్లలో గోవింద ధామం పేరిట ఆధునిక స్మశాన వాటిక ఏర్పాటు చేస్తున్నాం. ఉపాధి హామీ నిధులతో శ్మశానాలకు ప్రహరీలు నిర్మించి ఆక్రమణలు జరగకుండా చూస్తాం.
- దామలచెరువు నుంచీ పాకాలకు సప్లై ఛానెల్ నిర్మాణం పనులు 2026 చివరికి ప్రారంభిస్తాం.
- చంద్రగిరి, పాకాల, చిన్నగొట్టిగల్లు మండల కేంద్రాల్లో ఇండోర్ స్టేడియాలు నిర్మించాల్సి వుంది. వీటిని ఏడాదికి ఒకటి చొప్పున చేపట్టి పదవీ కాలం పూర్తయ్యే లోపు వాటి నిర్మాణం పూర్తి చేస్తాం. ● పాకాల మండలం పెద్ద చెరువుకు హంద్రీనీవా నీరు రప్పించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాం. అమోదం కోసం ప్రయత్నిస్తున్నాం.





పాకాల భారతంమిట్ట వద్ద వేసిన సీసీ రోడ్డు - పాకాల మండలం ఊట్లవారిపల్లి నుంచి సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయం వరకూ నిర్మాణంలో ఉన్న డబుల్ రోడ్డు



తొండవాడ ఎన్టీయార్ కాలనీలో కొత్తగా వేసిన సీసీ రోడ్లు



తొండవాడలో నిర్మించిన సబ్ స్టేషన్

ప్రతిపాదనలు

1. రాయలచెరువును రిజర్వాయర్‌గా మార్చేందుకు రూ. 150 కోట్లతో ప్రతిపాదనలు
2. తలకోన జలాలను సాగునీటికి మళ్ళించేందుకు రూ. 27 కోట్లతో ప్రతిపాదనలు
3. ఐతేపల్లి - రంగంపేట మధ్య స్వర్ణముఖిపై రూ. 14.60 కోట్లతో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం
4. వేదాంతపురం-రాయలచెరువు-పచ్చికాపల్లం రోడ్డులో స్వర్ణముఖిపై రూ. 23.55 కోట్లతో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం
5. తిరుచానూరు నుంచి తనపల్లి-వెంకటాపురం-చల్లావారిపల్లి రోడ్డులో స్వర్ణముఖిపై రూ. 29.10 కోట్లతో రెండు హైలెవల్ బ్రిడ్జిల నిర్మాణం
6. తిరుచానూరు-అప్పలాయగుంట-పూడి రోడ్డులో స్వర్ణముఖిపై రూ.19.90 కోట్లతో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం.
7. నేంద్రగుంట-పెనుమూరు డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ. 10 కోట్లతో ప్రతిపాదన
8. దామలచెరువు-మంగళంపేట-పులిచెర్ల మార్గంలో రూ. 16 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణం
9. ఎర్రావారిపాలెం నుంచీ ఎల్లమంద క్రాస్ వరకు రూ. 44 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణం.
10. చంద్రగిరి మూలపల్లి ఎస్టీ కాలనీ వద్ద భీమా నదిపై రూ. 1.50 కోట్లతో బ్రిడ్జి నిర్మాణం.
11. కొంగరవారిపల్లి -మామిడిమాను గడ్డ మార్గంలో భీమా నదిపై రూ. 2.10 కోట్లతో కాజ్‌వే
12. చంద్రగిరి పీఎస్ రోడ్డు నుంచీ కొత్తపల్లి రోడ్డులో స్వర్ణముఖిపై రూ. 2.50 కోట్లతో బ్రిడ్జి నిర్మాణం.

ఎన్నికల హామీలు... వాటి అమలు స్థితి

? ఎమ్మెల్యే గారూ..చంద్రగిరి పర్యాటక అభివృద్ధికి ఆలయాల ఆధారంగా చేస్తానన్న కృషి ఏ దశలో ఉంది?

ఎమ్మెల్యే: తలకోన ఆలయ అభివృద్ధికి టీటీడీ నుంచీ రూ. 18 కోట్లు మంజూరు చేయించా.. పాకాల సుబ్రమణ్యేశ్వరాలయ అభివృద్ధికి రూ. 2.80 కోట్లతో పనులు జరుగుతున్నాయి.

? మల్లవరం-పనబాకం నడుమ ఐటీ కంపెనీలు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

ఎమ్మెల్యే: ఇప్పటికే ఆ ప్రాంతంలో 40 ఎకరాల అనువైన భూమిని గుర్తించాం. ఐటీ కంపెనీలను రప్పించేందుకు ప్రయత్నిస్తున్నా.

? వేదాంతపురం జంక్షన్ నుంచీ రాయలచెరువు వరకూ వంద అడుగుల రోడ్డు నిర్మిస్తామని ఎన్నికల ప్రచార సమయంలో మీరు చెప్పారు.

ఎమ్మెల్యే: మరిచిపోలేదు. వచ్చే ఏడాది ప్రతిపాదనలు పెట్టనున్నాం.

? పాకాల, దామలచెరువులకు బైపాస్ రోడ్లు నిర్మిస్తామని మీరు పలు సందర్భాల్లో హామీ ఇచ్చారు. ఏడాది అయింది.

ఎమ్మెల్యే: మొత్తం 16 కిలోమీటర్ల నిడివికి రూ. 150 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం వద్ద పెండింగులో వున్నాయి. వెంటబడి సాధిస్తా.

? పాకాల ప్రభుత్వ ఆస్పత్రి 24 గంటలూ పనిచేసేలా స్థాయి పెంచుతామని చెప్పారు.

ఎమ్మెల్యే: దీనిపై ప్రతిపాదనలు పంపాం. మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్ళా.

? పాకాల రైల్వే జంక్షన్‌లో లోడింగ్, అన్ లోడింగ్, పార్శిల్ బుకింగ్ సదుపాయాలు పునరుద్ధరిస్తామని మీరు హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యే: చిత్తూరు ఎంపీ ద్వారా కేంద్రానికి ప్రతిపాదనలు పంపించాం.

? దామలచెరువులో మ్యాంగోనగర్ విడిగా ఏర్పాటు చేస్తామన్నారు.

ఎమ్మెల్యే: అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి, ప్రభుత్వానికి పంపించాం.

? చిన్నగొట్టిగల్లులో ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయిస్తామని మీరు ఎన్నికల ప్రచార సమయంలో చెప్పారు.

ఎమ్మెల్యే: శ్రీవెంకటేశ్వర విజ్ఞాన్ ఎడ్యుకేషనల్ సొసైటీ ద్వారా ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నాం. ఇందుకు 15 ఎకరాలు గుర్తించాం.

? చిన్నగొట్టిగల్లు నుంచి ఎల్లమంద వరకూ డబుల్ రోడ్డు నిర్మిస్తామన్నారు.

ఎమ్మెల్యే: ప్రతిపాదనలు పంపించాం. ముందస్తుగా గ్రావెల్ పనులు చేయించాం.

? ఎర్రావారిపాలెంలో కోల్డ్ స్టోరేజీ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని, అర్లపెంట ప్రాజెక్టు పూర్తి చేస్తామని చెప్పారు.

ఎమ్మెల్యే: ప్రైవేటు రంగంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తే ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు అందించి కోల్డ్‌స్టోరేజ్ ప్లాంట్ ఏర్పాటు చేస్తాం. ఇక అర్లపెంట ప్రాజెక్టు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాం.

ఘనంగా ఎస్వీయూ ఆవిర్భావ దినోత్సవం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం(ఎస్వీయూ) లక్ష్యాలను నెరవేర్చడానికి అందరూ సమష్టిగా కృషి చేయాలని వర్సిటీ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు పిలుపునిచ్చారు. ఎస్వీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రాంగణంలోని గాంధీ, అంబేడ్కర్, టంగుటూరి ప్రకాశం పంతులు, నీలం సంజీవరెడ్డి, ఆచార్య గోవిందరాజులు విగ్రహాలకు పుష్పాంజలి ఘటించారు. అనంతరం శ్రీనివాసా ఆడిటోరియంలో జరిగిన సభలో వీసీ అప్పారావు మాట్లాడుతూ.. వరల్డ్, ఆసియా ర్యాంకింగ్స్‌లో రాష్ట్రంలోనే ఎస్వీయూకు మొదటి స్థానం లభించిందన్నారు. క్వాంటం టెక్నాలజీ, గ్రీన్ టెక్నాలజీని ఉపయోగించుకోవడానికి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు మాట్లాడుతూ బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో వర్సిటీ ఎంతో ప్రగతి సాధించిందన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గొప్ప గుర్తింపును సంతరించుకుందన్నారు. యూనివర్సిటీ అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారాన్ని అందిస్తూ ఉందన్నారు. క్రీడా, సాంస్కృతిక పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మిమిక్రీ విజయకుమార్ ప్రదర్శన అలరించింది. ఓ ఉద్యోగి అన్నమయ్య వేషధారణతో ఆకట్టుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జాయింట్ రిజిస్ట్రార్ చంద్రయ్య, నాన్ టీచింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గుర్రంకొండ శ్రీధర్, నెల్లూరు సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.



టంగుటూరి చిత్రపటానికి పూలమాల వేస్తున్న వీసీ అప్పారావు తదితరులు



బాలాజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గ్రామస్తులు

అతిసారంతో వృద్ధురాలి మృతి

- గుత్తివారిపల్లెకు పరుగులు తీసిన ఆరోగ్య శాఖ అధికారులు

రేణిగుంట సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అతిసారంతో వృద్ధురాలు మృతి చెందింది.సమాచారం తెలుసుకున్న ఆరోగ్య శాఖ అధికారులు గుత్తివారిపల్లెకు పరుగులు తీశారు. మండలంలోని గుత్తివారిపల్లెలో ఉంటున్న బంధువుల ఇంటికి తిరుపతికి చెందిన సుభద్ర(75) వచ్చింది. ఆమెకు అతిసారం రావడంతో బంధువులు ఆమెను తిరుపతిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సలు ఫలించక ఆమె మంగళవారం మృతి చెందింది.సమాచారం అందుకున్న వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వెంటనే గుత్తివారిపల్లెకు చేరుకున్నారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 20 మందికి అతిసారం లక్షణాలు కనబడడంతో వెటనే సమీపంలోని బాలాజీ ఆస్పత్రికి తరలించారు. డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి ఆస్పత్రికి చేరుకుని చికిత్స పొందుతున్న గ్రామస్తులను పరామర్శించారు. అనంతరం గుత్తివారిపల్లికి చేరుకుని గ్రామస్తులందరికీ పరీక్షలు నిర్వహించారు. మరో 76 మందికి అతిసారం ఉన్నట్టు గుర్తించారు.



గుత్తివారిపల్లిలో బావిని పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి

ట్యాంక్ నీరు కలుషితం కావడంతోనే ..

గుత్తివారిపల్లికి సరఫరా అయ్యే తాగునీటి ట్యాంక్‌లో కప్పలు, పాములు మృతి చెందాయని, నెలలు గడుస్తున్నా ట్యాంకును శుభ్రం చేయకుండా సరఫరా చేస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. అయితే పారిశుధ్య అధికారులు మాత్రం ఇటీవల గ్రామంలో జరిగిన ఓ ఫంక్షన్‌లో చికెన్ తినడం వల్లే గ్రామస్తులకు అతిసారం వచ్చిందని అంటున్నారు. అయితే వైద్యాధికారులు ట్యాంకు నీటిని సేకరించి పరీక్షల నిమిత్తం తిరుపతికి తీసుకెళ్లారు. కాగా వారం రోజులుగా గుత్తివారిపల్లిలో అతిసారం ప్రబలుతున్నా హెల్త్ సూపర్‌వైజర్, ఏఎన్ఎంలు చర్యలు తీసుకోకపోవడంపై గ్రామస్తులు మండిపడ్డారు.

టిప్పర్ ఢీకొని యువకుడి దుర్మరణం


పెళ్లకూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని టిప్పర్ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. పోలీసుల కథనం మేరకు.. మోదుగులపాళెం గ్రామానికి చెందిన దువ్వూరు నవీన్-అనిత దంపతుల కుమారుడు చెర్రీ(19) నాయుడుపేటలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం సాయంత్రం నాయుడుపేటకు ద్విచక్ర వాహనంలో వెళ్లాడు. తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా పెన్నేపల్లి సమీపంలోని సర్వీస్ రోడ్డులో టిప్పర్ ఢీకొంది. తీవ్రగాయాలు కావడంతో చెర్రీ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వ వైద్య శాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



చెర్రీ (ఫైల్ ఫొటో)

ఘాట్‌రోడ్డులో వన్యప్రాణి మృతి

తిరుమల, సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): తిరుమల ఘాట్‌రోడ్డులో మంగళవారం పునుగుపిల్లి రూపంలో ఉన్న ఓ వన్యప్రాణి మృతి చెందింది. రెండవ ఘాట్‌రోడ్డులోని హరిణి ప్రాంతంలో వాహనాల కిందపడి ఈప్రాణి మృతిచెందడాన్ని కొందరు గుర్తించి ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. వారు చేరుకునేలోపే ఈ ప్రాణి నుజ్జునుజ్జుగా మారి చనిపోయింది పునుగుపిల్లేనా లేక మరేదైనా వన్యప్రాణా అనేది గుర్తించడం కష్టంగా మారింది. చర్మం ఆధారంగా అది అరుదైన పునుగుపిల్లే అయిండచ్చని కొందరు భావిస్తున్నారు.



బల్లవోలు దిమ్మెలు, షట్టర్లు శిథిలం

● బాగుచేయాలంటున్న రైతులు

చిల్లకూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు, కోట మండలాల్లోని పలు గ్రామాల మీదుగా ఉన్న బల్లవోలు డ్రైనేజీ కాలువ (ఫ్లడ్‌ఫ్లో కెనాల్) నీటిని ఏరూరు చెరువుకు మళ్లించేందుకు రామారెడ్డిపాళెం గ్రామ సమీపంలో బల్లవోలు డ్రైనేజీ స్కీంలో భాగంగా ఏర్పాటు చేసిన గేట్లు, సిమెంటు దిమ్మెలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీనిపై చెరువు ఆయకట్టు రైతులు ఆందోళన చెందు తున్నారు. చిల్లకూరు మండలంలోని వేళ్లపాళెం, బల్లవోలు, రామారెడ్డిపాళెం, కోట మండలంలోని కర్లపూడి, నెల్లూరుపల్లి కొత్తపాళెం, విశ్వనాధపురం తదితర గ్రామాల మీదుగా ఉన్న బల్లవోలు డ్రైనేజీ కాలువ ద్వారా వర్షపునీరుతో పాటు, వరద నీరు ప్రవహించి సముద్రంలో కలిసిపోయేవి. దీంతో సుమారు 35 ఏళ్ల క్రితం బల్లవోలు డ్రైనేజీ పథకం ద్వారా మండలంలోని రామారెడ్డిపాళెం గ్రామ సమీపంలో క్రాస్ రెగ్యులేటర్‌లో భాగంగా ట్రిటల్ పద్ధతిలో గేట్లను ఏర్పాటు చేశారు. దీంతో బల్లవోలు డ్రైనేజీ కాలువ ద్వారా ప్రవహించే వర్షపునీరు, వరదనీటిని సమీపంలోని ఏరూరు చెరువుకు మళ్లించి నీటిని నిల్వ చేసేవారు. ఆ తరువాత అదనపునీటిని సముద్రంలోకి వదిలేవారు. ఏరూరు చెరువులో, కాలువలో నీరు నిల్వ చేరడం ద్వారా సుమారు 1700 ఎకరాల రొయ్యలసాగుకు, సుమారు 600 ఎకరాల వరిసాగు అవుతుంది. ప్రస్తుతం గేట్లు, సిమెంటు దిమ్మెలు దెబ్బతిని శిథిలావస్థకు చేరుకున్నారు. దీంతో ఎప్పుడు నీటి ప్రవాహానికి గేట్లు, సిమెంటు దిబ్బెలు పూర్తిగా దెబ్బతింటాయోనిని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందు తున్నారు. ప్రభుత్వం స్పందించి బల్లవోలు డ్రైనేజీ పథకం ద్వారా ఏర్పాటు చేసిన గేట్లును అభివృద్ధిపరచాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు.


శిథిలావస్థకు చేరుకున్న గేటు షటర్లు


శిథిలమవుతున్న సిమెంటు దిమ్మెలు

మహిళల అభ్యున్నతే చంద్రబాబు ధ్యేయం

● ఎమ్మెల్యే డాక్టర్ విజయశ్రీ

నాయుడుపేట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మహిళల అభ్యున్నతే ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్యేయమని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. నాయుడుపేట ఏఎంసీ ప్రాంగణంలో మంగళవారం సూపర్ సిక్స్ సూపర్ హిట్, స్త్రీశక్తి పథకంలో మహిళా సాధికారికత సభను మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయశ్రీ మాట్లాడుతూ కుటుంబంలో స్త్రీఆర్థిక స్వేచ్ఛ ఎంతో అవసరమన్నారు. అందులో భాగంగా వారి కార్యకలాపాలకు ఆర్టీసీ బస్సుల రవాణాను చంద్రబాబు పూర్తిగా ఉచితం చేయడంతో స్త్రీశక్తి ద్వారా ఆయా కుటుంబాలు బాగుపడుతాయన్నారు. ఉచిత బస్సు ప్రయాణాలతో విద్యార్థినులు, దినసరి వ్యాపారులు, పేద బడుగు, బలహీన వర్గాల మహిళలు గ్రామాల నుంచి సమీప పట్టణాలకు వెళ్లి తమ కార్యకలాపాలను ఎంతో సంతోషంగా చేసుకోగలుగుతున్నారన్నారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సీఎం చంద్రబాబు మహిళలకు పొదుపు సంఘాల ద్వారా, బ్యాంక్ సబ్సిడీ రుణాలు అందజేశారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు డాక్టర్ శివప్రసాద్, ఏఎంసీ చైర్మన్‌లు ఉయ్యాల ప్రవీణ్, ఆకుతోట రమేష్, కట్టా రమణారెడ్డి, సంచి కృష్ణయ్య, కామిరెడ్డి అశోక్‌రెడ్డి, సన్నారెడ్డి చంద్రారెడ్డి, పసల గంగాప్రసాద్, మైలారి రాజశేఖర్, నానాబాల సుబ్బారావు, దార్ల రాజేంద్ర, విజయకుమార్ నాయుడు, వేలూరు మురళీ కృష్ణారెడ్డి, దేవారెడ్డి నాగేంద్రరెడ్డి, చైతన్య కృష్ణారెడ్డి, దారా అంకయ్య తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ, నెలవల సుబ్రహ్మణ్యం తదితరులు

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ.. నిందితుల అరెస్ట్


మాట్లాడుతున్న రూరల్ సీఐ కిషోర్‌బాబు

గూడూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల చోరీల కేసులకు సంబంధించి ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో రూరల్ సీఐ కిషోర్‌బాబు మాట్లాడారు. గూడూరు మండలం, బాలాయపల్లి, డక్కిలి, చిల్లకూరు తదితర పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని రాగి వైర్‌ను అపహరించుకు వెళ్లిన ఓజిలి మండలం ఆర్మేనిపాడు గ్రామానికి చెందిన చిన్నబ్బయ్య, పోలయ్యలను సోమవారం అరెస్టు చేశామన్నారు. వీరి నుంచి 135 కిలోల రాగి వైరును స్వాధీనం చేసుకున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మనోజ్‌కుమార్, సిబ్బంది బాలకృష్ణయ్య, శ్రీనివాసరావు, శ్రీనివాసులు, విష్ణుకుమార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానాలలో బోర్ల ఏర్పాటు

చిల్లకూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓడూరు, పున్నపువారిపాళెం గ్రామాలలోని శ్మశానాలలో మంగళవారం బోర్లు ఏర్పాటు చేసినట్లు టీడీపీ నేతలు గుండాల లీలావతి, కీరవాణి అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో శ్మశానాలలో ఎవరైనా మృతిచెందిన సమయంలో స్థానికులు పలు కార్యక్రమాలు చేసేందుకు నీటి వసతి లేకపోవడంతో ఇబ్బందులు పడేవారన్నారు. ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, టీడీపీ సీనియర్ నాయకుడు తానంకి నానాజీల చొరవతో ఆయా గ్రామాల శ్మశానాలలో బోర్లు వేయించామన్నారు. నీరు పుష్కలంగా పడ్డాయని తెలియజేశారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో జిల్లా జట్టు ప్రతిభ


గెలుపొందిన ట్రోఫీతో హాకీ క్రీడాకారులు

గూడూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి హాకీ పోటీలలో జిల్లా జట్టు విజయం సాధించినట్లు జట్టు కోచ్ దీపక్‌ఆకాశ్ మంగళవారం తెలిపారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవల తిరుపతిలో నిర్వహించిన అమరావతి హాకీ చాంపియన్స్ పోటీలలో జిల్లా జట్టు ప్రతిభచాటి విజేతగా నిలిచిందని తెలిపారు. దీంతో జట్టుకు సహకారం అందించిన స్థానిక పీఎంరావు, శ్రీలక్ష్మీలు జట్టు సభ్యులను అభినందించినట్లు వివరించారు.

అంబేడ్కర్ గురుకులానికి ఫ్యాన్ల వితరణ


ప్రిన్సిపాల్‌కు సీలింగ్ ఫ్యాన్‌లను పంపిణీ చేస్తున్న జనసేన నాయకులు

వాకాడు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదినం మంగళవారం ఘనంగా నిర్వహించారు. జనసేన వాకాడు మండల అధ్యక్షుడు రౌతు శివకుమార్ ఆధ్వర్యంలో అక్కడి విద్యార్థుల కోసం పిన్సిపాల్ కిషోర్‌కు 8 ఫ్యాన్‌లను పంపిణీ చేశారు. కేక్ కట్‌చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పవన్ అభిమానులు రాహుల్, బాలు, మధు, రమణ, జగదీష్, అశోక్ తదితరులు ఉన్నారు.

ఘనంగా డీసీఎం జన్మదిన వేడుకలు



వెంకటగిరి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు పట్టణంలోని త్రిభువని సెంటరులో జనసేన నాయకులు, పవన్ కల్యాణ్ అభిమానులు ఘనంగా నిర్వహించారు. జనసేన సీనియర్ నాయకులు తోట క్రిష్ణయ్య ఆధ్వర్యంలో కేక్‌కట్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు తిరుపాల్, రాజేష్, హరిప్రసాద్, నాగయ్య, సురేస్, అపర్న, రేవతి, కూటమి నాయకులు ఏఎంసీ చైర్మన్ పునుగోటి విశ్వనాథనాయుడు, బీరం రాజేశ్వరరావు, మంకు ఆనంద్, గల్లా శ్రీనివాసులు, సీఐ ఏవీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అవార్డు గ్రహీతకు సన్మానం


లక్కా శ్రీనివాసులు, సంధ్యలను సన్మానిస్తున్న పద్మశాలీ ఉద్యోగ సంక్షేమ సంఘం నాయకులు

వెంకటగిరి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : చేనేత రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకొని ఇటీవల రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకొన్న లక్కా శ్రీనివాసులును మంగళవారం పద్మశాలీ ఉద్యోగుల సంఘం కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. అదేవిదంగా నీట్‌లో మంచి మంచిర్యాంక్ సాధించిన కుమారి ఆలూరు వెంకటసంధ్యను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ ఉదోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీరామ నాగేశ్వరరావు, జిల్లా మహిళా విభాగం కార్యదర్శి బడిమల సునీత, బడిమల కళాశాల ప్రిన్సిపాల్ బడిమల శేఖర్ బాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొత్తగుంటలో జనసేన రక్తదాన శిబిరం


రక్తదానం చేసిన యువకులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న జనసేన నాయకులు

చిట్టమూరు, సెప్టెబర్ 2(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రపదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కల్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం కొత్తగుంటలో జనసేన నాయకులు రక్తదాన సిబిరం నిర్వహించారు. జనసేన నాయకులు, వాకాడు ఏఎంసీ డైరెక్టర్ బసవనూరు భాస్కర్ ఆధ్వర్యంలో జరిగిన రక్తదాన శిబిరం నిర్వహించారు. రెడ్ క్రాస్ సొసైటీ నెల్లూరు వారు రక్తం సేకరించారు. ఈ రక్తదాన శిబిరంలో 40 మంది రక్తదానం చేశారు. మొలకలపూడిలో ఉన్న మెహర్ నిర్భాగ్యుల అనాథశరణాలయంలో 50 మందికి బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. రక్తదానం చేసిన వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన లీగల్ సెల్ కార్యదర్శి ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్‌రావు, గూడూరు నియోజకవర్గం పీవోసీమోహన్, గోను కాంతి కుమార్, రాజా, శంకర్, శేఖర్, శీను, యశ్వంత్, రాజేష్, గోపాల్, మల్లికార్జున్ రావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి ద్వారా పేదలకు ఆర్థికసాయం

గూడూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి ద్వారా ఆర్థికసాయం అందిస్తున్నామని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, ఎల్లసిరి శ్రీనివాసులు రెడ్డి, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్ రహీం, ఇశ్రాయిల్‌కుమార్ పాల్గొన్నారు.

నేత్రదానం


రమాదేవి (ఫైల్‌ఫోటో)

సూళ్లూరుపేట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరు పేటలో ఆచార్య భరద్వాజ సేవాసంస్థ నిర్వహిస్తున్న నేత్రదానం 475కి చేరింది. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని సోనియాగాంధీ నగర్‌కు చెందిన పేరిం రమాదేవి (78) మరణాంతరం ఆమె నేత్రాలను చెన్నై శంకరనేత్రాలకు కుటుంబసభ్యులు దానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్య భరద్వాజ సేవాసంస్థ నిర్వాహకులు ఎంఎం చంద్రబాబు, ఆలపాటి అశోక్ కుమార్, సాయిరాం ఉన్నారు.

మొదలైన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు


ఉత్సవాలకు ముస్తాబైన ఆలయం

చిట్టమూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి) : చిట్టమూరు మండలం మల్లాంలో స్వయంభువు వళ్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 2 నుంచి 14వ తేదీ వరకు అంగరంగ వైభవంగా జరగనున్నట్లు ఆలయ పాలక మండలి చెర్మన్ కామిరెడ్డి మునిశేఖర్ రెడ్డి తెలిపారు. మంగళవారం అంకురార్పణ, విఘ్నేశ్వర పూజతో ప్రారంభమైనట్లు తెలిపారు. భక్తులకు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

అంగన్వాడీ కేంద్రానికి గ్యాస్‌స్టౌ వితరణ



కోట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని తిన్నెలపూడి పంచాయతీలో గల లక్ష్మక్కకండ్రిగ అంగన్వాడీ కేంద్రానికి మంగళవారం నవ్యాంధ్రప్రదేశ్, రజక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనుపూరు జగదీష్ గ్యాస్ స్టౌను వితరణగా ఇచ్చారు. వర్కర్ పారిచర్ల సుజాత, ఈశ్వరమ్మ తదితరులు ఉన్నారు.

గణనాథుల గ్రామోత్సవం

కోట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం గణనాథుల గ్రామోత్సవం కోలాహలంగా సాగింది. కోటలోని శ్రీలక్ష్మమ్మకాలనీ, గూడలి, తదితర ప్రాంతాల నుంచి గణేష్ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి వాకాడు మండలం తూపిలిపాళెం సముద్రంలో నిమజ్జనం చేశారు.

పండ్లు, రొట్టెల పంపిణీ

కోట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కోటలో మంగళవారం ఉప ముఖ్య మంత్రి పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలను జనసేన నాయకులు ఘనంగా నిర్వహించారు. క్రాస్‌రోడ్డులోని శ్రీలక్ష్మమ్మకాలనీలో సీనియర్ జనసేన నాయకులు అల్లం బాబు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అలాగే కోట ప్రభుత్వ ఆస్పత్రిలో జనసేన నాయకులు బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.


శ్రీ లక్ష్మమ్మ కాలనీలో కేక్‌కట్‌చేసి సంబరాలు చేసుకుంటున్న జనసేన నాయకులు

ప్రజానాయకుడు పవన్‌కల్యాణ్


అన్నదానం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, జనసేన నాయకులు

గూడూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజాసంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసం నిస్వార్థంగా పనిచేసే ప్రజానాయకుడు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక టవర్‌క్లాక్ కేంద్రం వద్ద జనసేన పార్టీ నాయకుడు తీగల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పవన్‌కళ్యాణ్ పుట్టిరోజు కార్యక్రమాన్ని నిర్వహించారు. పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిప్యూటీ సీఎంగా పవన్‌కల్యాణ్ రాష్ట్రాభివృద్ధికి ఎంతో కృషిచేస్తున్నారన్నారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా ప్రతి నియోజకవర్గంలో పల్లె పండుగ కార్యక్రమం ద్వారా సుమారు రూ.15 కోట్ల నిధులు విడుదల చేసి సీసీరోడ్లు, డ్రైనేజీ కాలువల అభివృద్ధికి చర్యలు చేపట్టారన్నారు. అనంతరం స్థానిక ఏరియా ఆస్పత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మోహన్, సాయికిరణ్, నాగార్జున, మనోజ్, విజయ్, మధు, వంశీ, నవీన్‌కుమార్, అనిల్, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన అన్నదానం


బస్టాండు వద్ద అన్నదానం చేస్తున్న జనసేన నాయకులు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను మంగళవారం జనసేన పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించుకున్నారు. జనసేన నాయకులు అవుల రమణ, మాబాషా ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద కేక్‌కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు హరిబాబు, తేజ, కోటి, దాసు, రేవంత్, నాగరాజు, పద్మజ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ జాతరకు చెట్ల కొమ్మల తొలగింపు


చెట్లు కొడుతున్న విద్యుత్ శాఖ సిబ్బంది

వెంకటగిరిటౌన్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఈ నెల 10, 11వ తేదీల్లో పోలేరమ్మ జాతర సందర్భంగా పట్టణంలో విద్యుత్ అంతరాయం కలగకుండా చెట్ల కొమ్మలను విద్యుత్ సిబ్బంది మంగళవారం తొలగించారు. పట్టణంలోని రాజా వీధి, కాశీపేట, తూర్పువీధి, దక్షిణవీధి, ఉత్తరపు వీధి, టీచర్స్‌కాలనీ, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతాల్లో చెట్లు కొమ్మలను తొలగించారు. జాతరలో ఎటువంటి అసౌకర్యాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని డీఈఈ శీనయ్య తెలిపారు. అయితే విద్యుత్ శాఖ సిబ్బంది అత్యుత్సాహంతో పట్టణంలోని పెద్ద పెద్ద వృక్షాలను సైతం తొలగిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. ఇందుకోసం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా ఆపేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి అవసరమైన మేరకే చెట్లు నరకాలని కోరుతున్నారు.

అర్హులకు పింఛన్లు రద్దుకావు

● మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం


మాట్లాడుతున్న మాజీ ఎంపీ నెలవల

పెళ్లకూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అర్హులెవరికీ పింఛన్లు రద్దుకావని టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం తెలిపారు. మంగళవారం మండలంలోని నెలబల్లిలో విలేకర్లతో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన మాట తప్పకుండా ఒకేసారి పింఛన్ల పెంచిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించి మాట నిలబెట్టుకున్నారన్నారు. పింఛన్లు తొలిగి స్తున్నట్లు వైసీపీ తప్పుడు ప్రచారాలు మాను కోవాలని హితువు పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పార్లమెంట్ అధికార ప్రతినిధి సుధాకర్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, స్వర్ణముఖినది ఆనకట్ట ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు, నాయకులు నేలవల్లి సిద్ధులయ్యనాయుడు, మదన మోహన్ నాయుడు, చంద్ర, పరుశురాం ఉన్నారు.

చెత్త నుంచి సంపద రాబట్టండి


సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారిణి వాణిరెడ్డి

డక్కిలి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంటు కేంద్రాల ద్వారా కంపోస్టు ఎరువులను ఉత్పత్తి చేసి పంచాయితీలను ఆదాయాల బాట పట్టించాలని గూడూరు డివిజన్ పంచాయతీల విస్తరణ అధికారిణి వాణి రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం లింగసముద్రం గ్రామంలోని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంటు కేద్రంలో తయారైన వర్మీకంపోస్ట్ ఎరువులను రైతులకు విక్రయించారు. ఈ సంద్భంగా ఆమె మాట్లాడుతూ చెత్త నుంచి సంపద సృష్టించి వచ్చే ఆ నిధులతో పంచాయతీలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఇన్‌చార్జీ ఎండీవో అనురాధ, యువో పీఆర్‌డీ నర్సింహులు, పంచాయితీ కార్యదర్శి సీహెచ్ వినోద్ కుమార్, గ్రామస్థులు పాల్గొన్నారు.

వైఎస్‌కు ఘన నివాళి

వెంకటగిరిటౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దివంతగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని వెంకటగిరి వైసీపీ సమన్వయ కర్త నేదరుమల్లి రాంకుమార్ రెడ్డి మంగళవారం ఆయన నివాసంలో నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, రాష్ట్ర పద్మశాలీ మాజీ డైరెక్టర్ నక్కా వెంకటేశ్వరరావ పాల్గొన్నారు.

డక్కిలి: డక్కిలిలోని వైస్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే, గేయదార సృష్టికర్త డాక్టర్ విబి సాయియికృష్ణ యాచేంద్ర పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నాయుడుపేట టౌన్: నాయుడుపేట ఆర్టీసీ కూడలి ప్రాంతంలో వైఎస్ఆర్ విగ్రహాలకు మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పూలమాల వేసి నివాళులర్పించారు.అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో చైర్ పర్సన్ కటకం దీపిక, ఎంపీపీ ధనలక్ష్మి, తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, కామిరెడ్డి రాజారెడ్డి, కటకం జయరామ్ పాల్గొన్నారు.


వైఎస్‌కు నివాళులర్పిస్తున్న నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు సంజీవయ్య, సాయికృష్ణ యాచేంద్ర

ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ అన్యాయం

సూళ్లూరుపేట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ పేరుతో కార్పొరేట్ సంస్థలకు దారాదత్తం చేయడం అన్యాయమని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన ఏఐటీయూసీ నియోజకవర్గ సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రభుత్వాలు నిర్వీర్యం చేసి ప్రైవేటీకరణ చేయడం వల్ల సామాన్య ప్రజలు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రైవేట్ రంగ సంస్థల్లోనూ రిజర్వేషన్ల కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు శ్రీనివాసులు, అధ్యక్షుడు రమణయ్య, కార్యదర్శి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీగణపతి హోమపూజలు



గూడూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక ముత్యాలపేటలో వినాయకచవితి సందర్భంగా ఏర్పాటు చేసిన గణేశుని ప్రతిమ వద్ద మంగళవారం విజయదుర్గాదేవి ఉప పీఠాధిపతి కోట సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో లక్ష్మీగణపతి హోమపూజలు నిర్వహించారు. వినాయకస్వామిని ప్రత్యేకంగా అలంకరించి శాస్త్రోక్తతంగా హోమపూజలు జరిపారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

రెండు ట్రాక్టర్ల సీజ్

కోట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని విద్యానగర్, కోట ప్రాంతాలలో లైసెన్స్‌లు లేకుండా తిరుగుతున్న రెండు ట్రాక్టర్లను రవాణా అధికారి ప్రభాకర్ మంగళవారం సీజ్‌చేశారు. వాటిని కోట పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు నిబంధనలు పాటించాలని కోరారు.

ప్రజా శ్రేయస్సే పవన్ కల్యాణ్ ధ్యేయం

● జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్


కేక్ కట్ చేసి అన్నదానం చేస్తున్న ఉయ్యాల ప్రవీణ్, అట్ల కృష్ణారావు

నాయుడుపేట, సెప్టెంబరు 2 : ప్రజాశ్రేయస్సే ధ్యేయంగా పవన్ కల్యాణ్ నిరంతరం కృషి చేస్తున్నారని సూళ్లూరుపేట జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి, ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ అన్నారు. మంగళవారం పవన్ కల్యాణ్ జన్మదినం సందర్భంగా జనసేన నాయకులు అట్ల కృష్ణారావు, ఎన్డీఏ నాయకులు, అభిమానులతో కలసి గ్రామదేవత పోలేరమ్మ గుడివద్ద ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, పాలు, రొట్టెలను పంపిణీ చేశారు. జువ్వలపాళెంలో కేక్ కట్‌చేసి అందరికి పంపిణీ చేశారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. ఆ తర్వాత బీడీకాలనీలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కేశవరెడ్డి, గిండి సతీష్, బాలుశెట్టి, శేఖర్, టీడీపీ నాయకులు నానాబాల సుబ్బారావు, బిరదవాడ నారాయణ, మల్లాం రవి, బీజేపీ నాయకులు కొప్పోలు సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు.